ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 30.07.2025 | సంపుటి : 12 సంచిక : 11 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## కాలుష్యరహిత నగరంగా
# హైదరాబాద్

- పాతికేళ్ల అవసరాలకు తగ్గట్టుగాప్రణాళికలు
- మెట్రో పనులు వేగవంతం చేయాలి
- నగరానికి ఐకానిక్‌గా మూసీ అభివృద్ధి
- ఎంఏయూడీ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ నగరాన్ని పర్యావరణహితంగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... అటువంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదన్నారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని సీఎం ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని... ఇందుకు రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకుగానూ ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అన్ని శాఖలు సమగ్ర డీపీఆర్‌లు తయారు చేయాలని సీఎం సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని... నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే

మిగతా 2లో..

## భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ

ఫిర్యాదుదారుకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు



2లో..

## ఎవరో చెబితే
# ఆపరేషన్ సిందూర్ ఆపలేదు



## ట్రంప్ ఒత్తిడి మాపై లేదు : మోదీ

- బుల్లెట్‌కు బుల్లెట్టే సమాధానమని జేడీ వాన్స్‌తో స్పష్టం చేశాం
- పాక్‌కు ఎవరూ సహాయం చేసినా ఊరుకోమని చెప్పాం
- కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదు
- ఆపరేషన్ సిందూర్‌కు 190 దేశాల మద్దతిచ్చాయి
- పాకిస్తాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం
- దాయాది ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాం
- ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోంది
- 'ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో వివరణ ఇచ్చిన ప్రధాని

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుం టోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, భారత సేనల శౌర్య, ప్రతాపాల ప్రదర్శన తర్వాత విజయోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యత, ఇచ్ఛాశక్తి ఫలాలతో భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో వాడీ వేడిగా జరిగిన చర్చకు సమాధానంగా ప్రధాని మోదీ ప్రసంగించారు. కాల్పుల విరమణలో అమెరికా పాత్రను మరోసారి తోసిపుచ్చిన ప్రధాని మోదీ.. కాంగ్రెస్, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

మిగతా 2లో..

### విధిలేని పరిస్థితుల్లో పాకిస్థాన్ సరెండర్ అయ్యింది

పహల్గాం దాడి ఉగ్రవాదుల్లో ముగ్గుర్ని హతమార్చాం: అమిత్ షా

పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

### ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా రాగలిగారు?

భద్రతాపరమైన లోపాలకు అమిత్ షా బాధ్యత వహించాలి : మలికార్జున ఖర్గే

రాజ్యసభలోనూ వాడీవేడీ చర్చ.

2లో



## సైన్యం,యుద్ధ త్యాగాలను రాజకీయాలకు వాడుకుంటున్నారు

- ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో కేంద్రం పూర్తిగా విఫలమైంది
- మోదీకి ఇందిరా గాంధీలా ధైర్యముంటే.. ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి
- పహల్గాం ఉగ్రదాడి శత్రుదేశం పాకిస్థాన్ పన్నిన కుట్ర
- సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడింది
- 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయి: రాహుల్ గాంధీ
- అకస్మాత్తుగా యుద్ధాన్ని ఎందుకు ఆపారు?: ప్రియాంక
- పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టడం నిఘా వర్గాల వైఫల్యానికి నిదర్శనం: అఖిలేష్‌యాదవ్

2లో

## చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకోలేదు

1962 నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది

లోక్‌సభకు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత భూభాగంలోకి చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. 1962 నుంచి ఇదే పరిస్థితి అని మంగళవారం లోక్‌సభకు వెల్లడించారు. రికార్డులను సరిచేయడం ఎంతోముఖ్యమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు."నా సొంతరాష్ట్రంలోకి చైనా ప్రవేశించి, ఆక్రమణలకు పాల్పడిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ముఖ్యమని నేను భావించాను. అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ప్రాంతం 1962 యుద్ధానికి ముందు లేదా ఆ సమయంలో ఆక్రమించారు. ఆ తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తలేదు" అని వెల్లడించారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అరుణాచల్‌ప్రదేశ్ లోని పలు ప్రాంతాల పేర్లను మార్చడానికి డ్రాగన్ యత్నించింది. దానిని పలుమార్లు భారత్

మిగతా 2లో..





# ప్రాజెక్టులను ఆధునీకరిస్తాం

### పేదల కడుపు నింపేది కాంగ్రెస్ ప్రభుత్వం

గేమ్‌చేంజర్స్‌గా సన్న బియ్యం, నూతన రేషన్ కార్డుల పంపిణీ

మంత్రి ఉత్తమ్

వార్త 3 లో

- జలాశయాల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం
- 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్
- మంత్రి అడ్లూరితో కలసి జలాశయం గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నల్గొండ బ్యూరో(జనంసాక్షి): రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి

మిగతా 2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో
# తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది

20 నెలల్లోనే వారికి పూర్తిగా అర్థమైంది

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి : కేటీఆర్

రాజన్న సిరిసిల్ల (జనంసాక్షి): 20 నెలల కాల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.మీ అందరిలో ఒకడిగా ఉంటాను. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కు మంచిరోజులు రాబోతున్నాయి. ఇప్పుడు ప్రజలకు కేసీఆర్ విలువ తెలుస్తుంది. స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పట్టుదలతో పని చేయాలి. బూత్ స్థాయిలో మెజారిటీ తీసుకురావాలి. ఎంత పెద్ద నాయకుడైన ఊర్లో మెజారిటీ తీసుకురావాలి. చినుకు చినుకు కలిసి వరద అయినట్లు ప్రతి ఒక్క ఓటును రాబట్టుకోవాలి. పోయిన కాడనే వెతుక్కోవాలి.. మళ్లీ గులాబీ

మిగతా 2లో..





## ఆగస్ట్ 8న కరీంనగర్‌లో
# బీసీల భారీ బహిరంగ సభ

బీసీ రిజర్వేషన్ల విషయంలో మభ్య పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపేలా కుట్రలు

ఢిల్లీకి వెళతామని మళ్లీ కొత్త డ్రామాలకు తెర : తలసాని

హైదరాబాద్,జూలై29(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను కాంగ్రెస్ మభ్య పెడుతోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చివరికి పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న

మిగతా 2లో..

# నిన్న విరమణ.. నేడు ఉల్లంఘన

24 గంటలు కాకముందే కాల్పుల విరమణ

కంబోడియా కవ్వింపు చర్యలు.. థాయ్‌లాండ్ ఆరోపణలు



బ్యాంకాక్(జనంసాక్షి): థాయ్‌లాండ్–కంబోడియాల మధ్య మరోసారి ఘర్షణ చెలరేగే పరిస్థితి తలెత్తింది. ఇరుదేశాల మధ్య ఒప్పందం జరిగి 24 గంటలైనా పూర్తికాక ముందే కవ్వింపు చర్యలు మొదలయ్యాయి. కంబోడియా దళాలు ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని థాయ్‌లాండ్ ఆరోపించింది. ఇప్పటికే ఇరుదేశాల మధ్య ఐదు రోజుల పాటు జరిగిన సైనిక ఘర్షణల్లో

మిగతా 2లో..

## యూరియాపై ప్రభుత్వం
# తప్పుదోవ పట్టిస్తోంది

రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయింది?

ప్రభుత్వమే జవాబు చెప్పాలి

బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ దోబూచులాట

బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

ఖమ్మం,జూలై29(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు

మిగతా 2లో..



## భారీగా ఓట్లు తొలగిస్తే జోక్యం చేసుకుంటాం

జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ విషయంలో ఈసీకి సుప్రీం ఆదేశం

2లో..

## బీసీ రిజర్వేషన్ల కోసం
# 72 గంటల నిరాహార దీక్ష

జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి



హైదరాబాద్,జూలై29(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు

మిగతా 2లో..

## ఉక్రెయిన్ జైలుపై రష్యా
# వైమానిక దాడులు

ఘటనలో 17 మంది మృతి.. 80 మంది గాయాలు

కీవ్(జనంసాక్షి): రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. తాజాగా సోమవారం అర్ధరాత్రి తమ దేశంలోని జైలుపై మాస్కో వైమానిక దాడులకు పాల్పడిందని ఉక్రెయిన్ అధికారులు ఆరోపించారు. ఈ దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోగా.. 80 మంది

మిగతా 9 లో..



## ప్రళయ్ క్షిపణి పరీక్ష
# విజయవంతం



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత రక్షణరంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన ప్రళయ్ క్షిపణి ని వరుసగా పరీక్షిం చారు. ఒడిశా లోని అబ్దుల్ కలామ్ ద్వీ పంలో 28, 29 తేదీల్లో నిర్వహించిన టెస్ట్ లు విజయవంతమయ్యాయి. ఈ క్షిపణి అత్యధిక, అత్యల్ప రేంజిని అంచనా వేయ డానికి యూజర్ ఎవల్యూషన్ ట్రయల్స్‌ను నిర్వ హించారు. డీఆర్‌డీవో ప్రకారం రెం డు టెస్ట్‌ల్లో క్షిపణి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించింది. అంతేకాదు.. అన్ని ప్రమాణాలను ప్రళయ్ అందుకొందని అధికారులు

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 30.07.2025

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది

జెండా ఎగురవేయాలి. ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలంటే ప్రతి సీటు గెలవాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.గత పదేళ్ళలో ప్రజలకు చేయాల్సిన పనులన్నీ చేశాము. ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి మోసపోయారు. రైతులకు కేసీఆర్ సాగునీళ్లు, రైతుబంధు, రైతుభీమా ఇచ్చారు. కార్యకర్తలందరూ కలిసి పని చేయాలి. మనం కూసున్న చెట్టు కొమ్మను మనమే నరుక్కున్నాము. ప్రజలంతా బీఆర్ఎస్‌కే ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రతి రైతు తినే పళ్ళెంలో మట్టి పోసుకున్నామని బాధపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేదు. రైతుబంధు రాదు, రైతు బీమా రాదు, బోనస్ రాదు. కానీ ఓట్లు ఉన్నప్పుడే నోట్లు వేస్తున్నాడు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రైతులకు యూరియా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక ప్రభుత్వం మోసం చేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని మభ్యపెట్టారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీ పోయి ధర్నా చేస్తామంటున్నారు.. కూట్లే రాయి తీయనోడు ఏట్లే రాయి తీస్తామంటున్నారు. సీఎం చేతిలో ఉన్న పనులు చేయడం లేదు. రేవంత్ రెడ్డిని తిడితే.. బండి సంజయ్‌కి ఏం నొప్పి. తెలంగాణలో గులాబీ జెండా లేకుండా చేయాలి%ూ% గోదావరి నీళ్లు ఆంధ్రకు వదిలేయాలి.. అనేది బండి సంజయ్, రేవంత్ రెడ్డి గూడుపుటాని. కేసీఆర్ ఉంటే నీళ్లు, నిధులు ఎవరికి పోనియ్యడనే దురుద్దేశ్యంతో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కుట్రలు చేస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.కులం,మతం ముసుగులో మళ్ళీ మోసపోవద్దు. మహిళలకు 2500లు అన్నాడు హామీ ఏమైంది%ూ% ఒక్కో మహిళకు రేవంత్ రెడ్డి 50వేలు బాకీ ఉన్నాడు. ఆసరా పెన్షన్లు 4వేలు ఏమైంది. మొదటి ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను నిరుద్యోగ యువత అశోక్ నగర్‌లో కొట్టుడు ఒకటే తక్కువ. ఆనాడు చంద్రబాబు, వైఎస్, రోశయ్యల, కిరణ్ కుమార్ రెడ్డిలతో కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చోడిలా వ్యవహరిస్తున్నారు. సీఎం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఢిల్లీ పోయి రేవంత్ రెడ్డి పీకిందేమి లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఫాల్తూ మాటలు మాట్లాడుతున్నారు. సీఎం తిట్టుడు బంద్ చేస్తే నేను తిట్టుడు బంద్ చేస్తా. సీఎం దిక్కుమాలిన పనులు చేస్తున్నాడు. ప్రజలు నమ్మి మోసపోయారు. ప్రజలు స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కడితే మళ్లీ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుంది. కార్యకర్తలు బేషజాలకు వెళ్లొద్దు అని కేటీఆర్ సూచించారు.

## ఆగస్ట్ 8న కరీంనగర్‌లో బీసీల భారీ బహిరంగ సభ

నాట కాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఎలా చేస్తారని అప్పుడు అడిగితే మా వ్యూహం మాకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపమంతా భాజపా, భారత రాష్ట్ర సమితిపై నెట్టేస్తోంది. 42 శాతం రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల విషయంలో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. భారత రాష్ట్ర సమితి తరఫున కూడా రాష్ట్రపతిని కలిసి.. 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరతాం. అధికార యంత్రాంగంలోనూ కీలకమైన స్థానాలను ఓ అగ్రవర్ణం వారికే ఇచ్చారు. కార్పొరేషన్ పదవుల్లో సగం బీసీలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు. ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు– ఈ సదర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూ వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున త్వరలోనే బీసీ ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కలవనుందని తెలిపారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా కులగణన జరిపి, హడావుడి గా అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును పెట్టిందన్నారు.

## భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు.ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధింన అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు– సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు–, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ– స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు– ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితేష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితేష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. .

## నిన్న విరమణ.. నేడు ఉల్లంఘన

ఇప్పటివరకు 33 మంది ప్రాణాలు కోల్పోగా.. వేల మంది నిర్వాసితులయ్యారు. సోమవారం నుంచి కాల్పుల ఒప్పందం అమలు మొదలైనా ఆదిలోనే మళ్లీ సమస్యలు తలెత్తాయి. అర్ధరాత్రి నుంచి తాము కాల్పులు జరపడం ఆపేశామని థాయ్ మిలిటరీ చెబుతోంది. కానీ, కంబోడియా పక్షం నుంచి మాత్రం కాల్పులు ఆగలేదని ఆరోపించింది. సరిహద్దు వెంట చాలా ప్రదేశాల్లో రాత్రి మొత్తం కాల్పులు జరిగినట్లు వెల్లడించింది. వీటికి తగిన స్థాయిలో థాయ్ నుంచి కూడా ప్రతిస్పందనలు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈవిషయాన్ని థాయ్ ప్రతినిధి వింథాయ్ సువారే వెల్లడించారు.మరోవైపు కంబోడియా రక్షణ మంత్రి ఓ ఆంగ్ల వార్తాసంస్థతో మాట్లాడుతూ.. కాల్పుల విరమణ మొదలైప్పటినుంచి ఇరుపక్షాల నుంచి ఎక్కడా సాయుధ ఘర్షణలు చోటుచేసుకోలేదని వివరణ ఇచ్చారు. ఇక కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా జరగాల్సిన స్థానిక కమాండర్ల సమావేశం కూడా రెండుసార్లు వాయిదా పడటం గమనార్హం. సోమవారం థాయ్‌లాండ్–కంబోడియాలు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే..

## ఎవరో చెబితే ఆపరేషన్ సిందూర్ ఆపలేదు

"ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత కూడా మాకు చెప్పలేదు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. పాక్ భారీగా దాడి చేయబోతోందని ఆయన హెచ్చరించారు. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పా. పాక్‌కు ఎవరు సాయం చేసినా.. చూస్తూ ఊరుకొనేది లేదని చెప్పాం. పాక్ ఎలాంటి దాడి చేసినా మేం చూసుకుంటామని వాన్స్‌కు చెప్పాం. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని జేడీ వాన్స్‌కు చెప్పాం. పాక్‌కు ఎవరు సహాయం చేసినా.. చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశాం. పాక్‌కు చిరకాలం గుర్తుండిపోయే సమాధానం ఇచ్చాం. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి దాడులు ఆపాలని బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్ నిలిపివేశాం. " అన్నారు. "మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులు. ఈ దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనాం. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని చెప్పాం. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాలని అఖిలపక్ష భేటీలోనూ చర్చించాం. పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్ ఎయిర్ బేస్‌లు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. అణుబాంబులు బెదిరింపులు చెల్లవని పాక్‌ను హెచ్చరించాం. 193 దేశాల్లో 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌ని సమర్థించాయి. పాక్‌కు కేవలం మూడు దేశాలే అండగా నిలిచాయి" అన్నారు. "ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ మాత్రమే తప్పుపడుతోంది. స్వార్థ రాజకీయాల కోసం సైనికుల పరాక్రమాలను తక్కువ చేస్తోంది. తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. తద్వారా సైన్యం మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. మీడియా హెడ్‌లైన్లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మీడియా హెడ్‌లైన్లలో ఉండొచ్చేమో గానీ.. ప్రజల మనసుల్ని గెలవలేరు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం. సర్జికల్ స్ట్రైక్స్ విషయంలోనూ కాంగ్రెస్ నేతలు ఇలాగే మాట్లాడారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడూ ఇలాగే మాట్లాడారు. పాక్ నుంచి అభినందన్‌ను మోదీ ఎలా తెస్తారో చూస్తామన్నారు. మేం ఆయన్ను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చాం. విపక్షాల తీరు చూసి దేశమంతా నవ్వుకుంటోంది. భారత రక్షణ దళాల శక్తి, సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది. భారత రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షమే. భారతీయుల భావనలతో నా స్వరం మిళితం చేసుకొని ముందుకెళ్తున్నా. ఆపరేషన్ సిందూర్ సమయంలో నాపై నమ్మకం ఉంచినందుకు దేశ ప్రజలకు రుణపడి ఉన్నా" అన్నారు.'పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులు చేసినా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది. పాక్ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాం' అని ప్రధాని మోదీ హెచ్చరించారు. పహల్గాం దాడి ఉగ్రవాదులను సైతం మట్టుబెట్టామన్నారు. ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ఉగ్రవాదుల్ని ఏరివేస్తున్నట్లు చెప్పారు.

## సైన్యం,యుద్ధ త్యాగాలను రాజకీయాలకు వాడుకుంటున్నారు

ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. "సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారు. " అని రాహుల్ గాంధీ విమర్శించారు. "పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలి" అని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు.

### ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా రాగలిగారు?

ఆపరేషన్ సిందూర్‌పై రాజసభ్యలోనూ వాడీవేడీ చర్చ జరిగింది. దేశంలో ఉగ్రమూలాలు దెబ్బతిస్తే.. మరి ఉగ్రవాదులు పహల్గాం వరకు వచ్చి ఎలా దాడి చేశారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పహల్గాంలో భద్రతాపరమైన లోపాలకు హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా రాజ్యసభలో ఖర్గే ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో దేశ సాయుధ దళాల శౌర్యపరాక్రమాలను 'ఇండియా' కూటమి ప్రశంసించిందని, దేశ ప్రయోజనాల కోసం కేంద్రానికి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు.

### అకస్మాత్తుగా యుద్ధాన్ని ఎందుకు ఆపారు?: ప్రియాంక

నాయకత్వం అంటే క్రెడిట్ తీసుకోవడమే కాదని, బాధ్యత కూడా తీసుకోవడమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు చేయడం మన ప్రధాన మంత్రి బాధ్యతారాహిత్యాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. అమిత్ షా ప్రసంగాన్ని లక్ష్యంగా చేసుకుంటూ తనదైన శైలిలో ప్రశ్నలు కురిపించారు."జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీల విషయాలతతోపాటు నా తల్లి కన్నీరు పెట్టిన విషయంపై అమిత్ షా మాట్లాడారు. కానీ, శత్రువులు ఎక్కడికీ వెళ్లలేని సమయంలో యుద్ధాన్ని ఎందుకు ఆపారో అమిత్ షా సమాధానం చెప్పలేదు. నాయకత్వం అంటే క్రెడిట్ తీసుకోవడమే కాదు బాధ్యత కూడా తీసుకోవాలి. ఇలా ఆకస్మికంగా యుద్ధాన్ని ఆపడం దేశ చరిత్రలోనే మొదటిసారి. ఆ ప్రకటన కూడా అమెరికా అధ్యక్షుడు చేశారు. ఇది మన ప్రధాని బాధ్యతారాహిత్యాన్ని చూపిస్తోంది. మన దౌత్యం విఫలమైంది" అని ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు.ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రధాని, హోంమంత్రి, రక్షణశాఖ, జాతీయ భద్రతా సలహాదారులకు లేదా అని ప్రియాంక ఈ సందర్భంగా ప్రశ్నించారు. "బైసరన్ వ్యాలీకి వేలాది మంది పర్యటకులు వస్తారని ప్రభుత్వానికి తెలియదా. భద్రత ఎందుకు లేదు.

## విధిలేని పరిస్థితుల్లో పాకిస్థాన్ సరెండర్ అయ్యింది

న్యూఢిల్లీ : ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ లోక్‌సభలో చర్చ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ కొనసాగుతున్న సమయంలో.. పాకిస్థాన్ లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. ఆ పరిస్థితికి దారితీసిన ఘటనలను ఆయన సభలో పేర్కొన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించారని, దాంట్లో 25 మంది భారతీయులు, ఓ నేపాలీ ఉన్నారన్నారు. ఏప్రిల్ 30వ తేదీన సీసీఎస్ మీటింగ్‌లో సింధూ నదీ జలాలపై నిర్ణయం తీసుకున్నామన్నారు. పాకిస్థానీ పౌరుల్ని వెనక్కి పంపామన్నారు. సీఆర్పీఎఫ్, ఆర్మీ, జేకే పోలీసులు ఉగ్రవాదులకు గట్టి బదులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.మే 9వ తేదీన పాకిస్థాన్‌పై దాడి కోసం ఆర్మీకి ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి షా చెప్పారు. 11 ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశామన్నారు. నూర్ ఖాన్ ఛక్లా, మురిద్, సుగుర్దా, రఫికీ, రహిమ్ ఖాన్, జాకోబాబాద్, భోలారిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆరు రేడార్లను, సర్ఫేస్ టు ఎయిర్ ఆయుధాలను ధ్వంసం చేశామన్నారు. ఎయిర్ బేస్‌లను టార్గెట్ చేయలేదని, కానీ భారత్‌లో ఉన్న పౌర ప్రాంతాలను పాకిస్థాన్ అటాక్ చేసే ప్రయత్నం చేసిందన్నారు. పాకిస్థాన్ తన దాడులకు చెందిన అన్ని రకాల సామర్థ్యాలను కోల్పోవడంతో, ఆ దశలో ఆ దేశానికి మరో అవకాశం లేకుండా పోయిందని, అప్పుడు పాకిస్థాన్ లొంగిపోయినట్లు అమిత్ షా తెలిపారు.మే 10వ తేదీన పాకిస్థాన్ డీజీఎంవో.. దాడుల్ని ఆపేస్తున్నట్లు సాయంత్రం 5 గంటలకు ఫోన్ చేశారన్నారు. అయితే అడ్వాంటేజ్ ఉన్న సమయంలో ఎందుకు అటాక్ చేయలేదని ప్రశ్నిస్తున్నారని, కానీ ప్రతి యుద్ధానికి ఓ సామాజిక కోణం ఉంటుందని మంత్రి అన్నారు. 1951, 1971లో జరిగిన యుద్ధాల గురించి ఆయన వెల్లడించారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను నెహ్రూ అప్పగించారని, షిమ్లా ఒప్పందంలో దాన్ని డిమాండ్ చేయలేదన్నారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రెండో రోజు చర్చ కొనసాగుతోంది. ఈ చర్చ సందర్భంగా ఇవాళ షా మాట్లాడారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు.

**పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం: రాజ్‌నాథ్ సింగ్**

న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్దాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు.ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలనుకుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు.

## భారీగా ఓట్లు తొలగిస్తే జోక్యం చేసుకుంటాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో..ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ విషయంలో వెరిఫికేషన్ పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చేర్చకపోవడంపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై నేడు విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో ఎన్నికల సంఘానికి రాజ్యాంగ అధికారం ఉందని.. అది చట్ట ప్రకారం పని చేస్తుందని వ్యాఖ్యానించింది. అయితే..భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే మాత్రం తాము జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణపై దాఖలైన పిటిషన్లను ఆగస్టు 12, 13 తేదీల్లో విచారిస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

## బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ .... 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారు... ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అఫీషియల్ గా అఖిల పక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిల పక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు.

### ప్రళయ్ క్షిపణి పరీక్ష విజయవంతం

వెల్లడించారు. దీంతో ఇది వినియోగానికి సిద్ధంగా ఉందని తేలినట్లైంది. ప్రళయ్ స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణయుద్ధ రంగాల్లో నేరుగా వినియోగించేందుకు వీలుగా దీనిని తయారుచేశారు. భారత వాయుసేన, సైన్యం అవసరాలకు తగినట్లు దీనిని తీర్చిదిద్దారు. ఇది 150 నుంచి 500 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను ఛేదించగలదు. 350 నుంచి 700 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. శత్రువుల కమాండ్ సెంటర్లు, లాజిస్టిక్స్ హబ్స్‌ను ఇది లక్ష్యంగా చేసుకోగలదు.

## కాలుష్యనగరంగా హైదరాబాద్

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా.. సీవరేజీ బోర్డు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. బోర్డు తమకున్న వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై ప్రత్యేక ప్రణాళిక రూపొంచుకోవాలని సీఎం సూచించారు. ఓఆర్ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకుగానూ కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. మార్గదర్శకాల రూపకల్పనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిపైనా సీఎం ఆరా తీశారు. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏమాత్రం జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పట్టాలెక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని సీఎం సూచించారు. మూసీపైన బ్రిడ్జి కం బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అనుమతులు, నిబంధనల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు తెలిపారు. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా సీఎం సమీక్షించారు. మీరాలం ట్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఎస్టీపీలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని... పార్క్, మీరాలం ట్యాంక్ తోపాటు నగరాన్ని వీక్షించేలా హోటల్ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (హెచ్ఎండీఏ ఏరియా) కార్యదర్శులు ఇలంబర్తి, టి.కె.శ్రీదేవి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కే.శశాంక, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇ.వి. నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహుదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు– వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు.తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు– అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు– నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు మొత్తం 26 గేట్ల ద్వారా నీటిని దిగువ వదిలారు అనంతరం మంత్రులు,అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకోలేదు

తిరస్కరించింది కూడా."అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని.. అది విడదీయరాని భాగమని.. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరు" అని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇక గత ఏడాది ఈ ఆసియా దేశాల మధ్య గస్తీ దోస్తీ కుదిరింది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాలు.. ఆ ఒప్పందం తర్వాత కాస్త మెరుగయ్యాయి.

## యూరియాపై ప్రభుత్వం తప్పుదోవపట్టిస్తోంది

ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేంద్రప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్‌లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. యూరియా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి రామచంద్ర రావు సవాల్ విసిరారు. ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు సేకరిద్దాం అని, తనది తప్పైతే రాజీనామా చేస్తానంటూ సవాల్ చేశారు. యూరియా సరఫరా విషయంలో ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు తీసుకోవచ్చని, అందులో తాము చెప్పేది అబద్ధమైతే తాను రాజీనామాకు సిద్ధమని.. మరి తుమ్మల రాజీనామా చేస్తాడో చూడాలన్నారు

# పసికందును బలిగొన్న ప్రైవేటు పాఠశాల బస్సు

- అనుమతులు లేని బస్సు లైసెన్స్ లేని డ్రైవర్
- చిన్నారి తలపై టైర్లు, ఎక్కడంతో మెదడు చితికి బయటికి..



**మహాదేవపూర్,జూలై 29, (జనం సాక్షి) :** సోదరుడు విద్యావంతుడు అవ్వాలని కోరుకున్న ఆ చెల్లెకు, అదే పాఠశాల వాహనం దీవికి చేర్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 7:30 గంటలకు మూడు సంవత్సరాల చిన్నారి శ్రీహర్షిని ఎస్ వి ఎస్ ఎం ప్రైవేట్ పాఠశాల వాహనం, డ్రైవర్ నిర్లక్ష్యానికి టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. మండలంలోని అంబటిపల్లి గ్రామవాసి అయిన సింగినేని మల్లేష్ భాగ్య లకు శ్రీ హర్షిని, తో పాటు ఒక కుమారుడు ఉన్నాడు, మంగళవారం రోజు సూరారం గ్రామంలో ఎస్‌విఎంఎస్ ఇంగ్లీష్ మీడియం పేరుతో నిర్వహించబడుతున్న పాఠశాలకు సంబంధించిన, స్కూల్ బస్సు హర్షిని సోదరునికి పాఠశాలకు తీసుకువెళ్ళుటకు వచ్చింది. శ్రీ హర్షిని తల్లి తన కొడుకును స్కూల్ బస్సులో ఎక్కించిన అనంతరం, ముందుకు సాగుతున్న క్రమంలో పక్కనే ఉన్న హర్షినిపై స్కూల్ బస్ మొదటి టైరు ఎక్కడంతో శ్రీహర్షిని అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి మొత్తుకుంటున్న డ్రైవర్ వినకుండా టైరులు ఎక్కించడంతో శ్రీ హర్షిని ప్రాణాలు విడిచింది. సోదరుడు చూస్తుండగానే చెల్లి మృత్యువాతకు గురికావడం మరోవైపు తల్లి మొత్తుకున్న డ్రైవర్ వినకుండా తల్లి ముందే తన బిడ్డను పరలోకానికి వెళ్లడం అంతా కండ్ల ముందు జరగడంతో, ఆ కుటుంబం గుండెలు బాదుకుంటూ కన్నీటి పర్వం అవుతుంది.

### అనుమతులు లేని బస్సు లైసెన్స్ లేని డ్రైవర్.

చిన్నారి ప్రాణాలకు యముడుగా మారిన ఆ డ్రైవర్ కనీసం లైసెన్స్ కూడా లేదు. ఎస్ ఎస్ వి ఎం ఇంగ్లీష్ మీడియం అనే పాఠశాల స్కూల్ బస్సు కు డ్రైవర్ గా ఉన్న బూర్గుడెం గ్రామానికి చెందిన వ్యక్తి, డ్రైవింగ్ పై అవగాహన, డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేకపోవడం, అలాంటి వ్యక్తి స్కూల్ బస్ డ్రైవర్ గా ఉంటే, ఇలాంటి చిన్నారులే కాక అనేకమంది పసికందుల ప్రాణాలు పోవడం ఖాయం. స్కూల్ బస్సు విద్యార్థుల తరలింపు కొరకు ఆర్టిఓ అనుమతి, కూడా లేనటువంటి ఈ స్కూల్ బస్, ఫిట్నెస్ తోపాటు బ్యాడ్జి లైసెన్సులను తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఆర్టిఓ ఎలాంటి అనుమతులు లేకుండా, కొనసాగడం ఒక నిండు ప్రాణానికి బలిగొంది.

### పల్లెల్లో ప్రైవేటు పాఠశాలల బస్సులు, చిన్నారులకు శాపం

ఇక ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన బస్సులు చిన్నారులకు శాపంగా మారే పరిస్థితి కనబడుతుంది. అంబటిపల్లి ఎస్ ఎస్ వి ఎం ఇంగ్లీష్ మీడియం పేరుతో నిర్వహించబడుతున్న పాఠశాల స్కూల్ బస్ మూడు సంవత్సరాల చిన్నారిని, డ్రైవర్ నిర్లక్ష్యం తో మృత్యువాతకు తీసుకువెళ్లిన ఘోర ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన స్కూల్ బస్సులు, ఫిట్నెస్ బ్యాడ్జ్ లైసెన్స్ లేకుండా స్కూల్ బస్ అనుభవం లేని డ్రైవర్ల నిర్లక్ష్యానికి చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఉన్నట్టుగా స్పష్టం కనబడుతుంది. శ్రీహర్షిని మృతితో మండలమంతా శోక సముద్రంలో కన్నీరు మున్నీరైనారు. మండల ప్రజలు మాత్రం తక్షణమే పాఠశాల నిర్వాహకులపై చర్యలతో పాటు పాఠశాలను మూసివేయాలని గ్రామస్తులతో పాటు మండల ప్రజలు కోరుతున్నారు, సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టిన స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# ఆఫీస్ నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య

**ముంబై, జూలై29 (జనంసాక్షి) :** మహారాష్ట్రలోని పుణెలో ఓ ఐటీ– ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఆఫీసులో మీటింగ్ జరుగుతుండగా మధ్యలో బయటకు వెళ్లిన ఆ టెకీ.. భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాసిక్‌కు చెందిన 23 ఏళ్ల పీయూష్ అశోక్ కవాడే పుణెలోని హింజెవాడి ఐటీ– పార్క్‌లోని ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన అతడు కంపెనీ మీటింగ్‌కు హాజరయ్యాడు. మధ్యలో అస్వస్థతగా ఉందని చెప్పి మీటింగ్ నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే బిల్డింగ్ ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీకు కొడుకుగా ఉండేందుకు నాకు అర్హత లేదని కుటుంబసభ్యులనుద్దేశిస్తూ లేఖ రాసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. పీయూష్ గతేడాది జులైలోనే ఈ కంపెనీలో చేరాడు. పనిఒత్తిడి, మానసిక సమస్యల కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# సరస్వతీ పవర్ షేర్ల బదిలీ కుదరదు

### జగన్‌కు భారీ ఊరట

**హైదరాబాద్, జులై 29 (జనంసాక్షి) :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు భారీ ఊరట లభించింది. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ వాటాల బదిలీపై జగన్ వేసిన పిటిషన్‌ను అనుమతించింది. విజయలక్ష్మి, షర్మిలకు వాటాలు బదిలీ నిలుపుదల చేయాలని జగన్ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం.. జగన్ వాదనలతో ఏకీభవించింది. విజయలక్ష్మి, షర్మిలకు బదిలీ అయిన వాటాలను నిలుపుదల చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును విజయమ్మ, షర్మిల హైకోర్టు లో సవాల్ చేసే అవకాశం ఉన్నట్లు– తెలుస్తోంది. కాగా గతంలో తన అన్న వదిన కలిసి తమకు సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో రావాల్సిన వాటాలను ఇవ్వడం లేదని షర్మిల, విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

# నెలల వ్యవధిలోనే కృంగిన క్యాతనపల్లి పై ఓవర్ రోడ్డు





**రామకృష్ణాపూర్, జులై 29 (జనంసాక్షి):** మందమర్రి మండలంలోని రామకృష్ణాపూర్ క్యాతనపల్లి రైల్వే గేట్ వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిన కొన్ని నెలల్లోనే, బిజోన్ నుండి మంచిర్యాలకు వెళ్ళే దారిలో రోడ్డు కృంగి పోవడంతో కాంట్రాక్టర్ పనిలో చూపిన నైపుణ్యత లోపం కనిపిస్తుంది. ఇటీవల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించి, త్వరలోనే వీధి దీపాలను సైతం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ ఇప్పటికీ వీధి దీపాలు ఏర్పాటు చేయకపోగా ఇంతలోనే రోడ్డు కృంగి పోవడంతో వాహనదారులు, పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రోడ్డుపై నిర్మించిన ఫుట్పాత్‌పై కూడా పగుళ్లు ఏర్పడటంతో సదరు గుత్తేదారు త్వరగా పని ముగించుకోవాలనే తపన తప్ప నాణ్యత పై దృష్టి పెట్టలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఏది ఏమైనా కృంగిన రోడ్డుపై వెంటనే మరమ్మతులు చేపించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

# పేదల కడుపు నింపేది కాంగ్రెస్ ప్రభుత్వం

- గేమ్‌చేంజర్స్‌గా సన్న బియ్యం, నూతన రేషన్ కార్డుల పంపిణీ
- హుజూర్‌నగర్ నియోజకవర్గంని రాష్టంలోనే నెం.1గా చేస్తా
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ ఇండ్లు, రేషన్ కార్డులు: మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్



**హుజూర్ నగర్, జులై 29 (జనంసాక్షి):** పేదల కడుపు నింపే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, నూతన రేషన్ కార్డులు పంపిణి కార్యక్రమాలన్ని మించిన సంక్షేమ పథకాలు భారత దేశ చరిత్రలో లేవన్ని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్ నగర్ పట్టణంలోని కౌండిన్య పంక్షన్ హాల్ నందు మంగళవారం హుజూర్ నగర్ నియోజకవర్గంలో లబ్ధిదారులకి నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో ఎస్ సి, ఎస్ టి, మైనారిటీ, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ , జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలోనే హుజూర్ నగర్ నుండి సన్న బియ్యం పంపిణి చేసిన ఉగాది పర్వదినం నిలిచి పోతుందని, అలాగే తిరుమలగిరి నుండి నూతన రేషన్ కార్డులు పంపిణి, సూర్యాపేట జిల్లా నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సూర్యాపేట జిల్లా నుండి ప్రారంభించిన రెండు పథకాలు చరిత్ర లో గేమ్ చెంజర్స్ గా నిల్చిపోతాయన్నారు. గతంలో 10,600 కోట్లు ఖర్చు పెట్టి 89.95 లక్షల కార్డులకి 2.80 కోట్ల మందికి దొడ్డ బియ్యం పంపిణి చేస్తే ప్రజాధనం దుర్వినియోగం అయిందని, అందుకే పేద వారి కడుపు నింపేలా 13,000 కోట్లతో 97.90 లక్షల కార్డులకి 3.10 కోట్ల మందికి కేజీ 57 రూపాయలు ఖర్చు పెట్టి ప్రతి ఒక్కరికి 6 కేజీల సన్న బియ్యం ఉచితంగా పంపిణి చేస్తున్నామని అన్నారు. రైతులకి సన్న వడ్లు పండించేందుకు బోనస్ 500 ఇస్తున్నామని, సన్న వడ్లు సేకరించి మిల్లింగ్ చేసి దారిద్య్ర రేఖకి దిగువన ఉన్న వారు కడుపు నిండా తినేలా రాజకీయాలకి అతీతంగా నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణి చేస్తున్నామని తెలిపారు. చింతలపాలెం మండలంలో గతంలో 12,000 కార్డులుంటే 1116 కొత్తగా ఇచ్చామని, గరిడేపల్లి మండలంలో పాతవి 17000 ఉంటే కొత్తవి 2446, హుజూర్ నగర్ లో పాతవి 18000, కొత్తవి 2300, మఠంపల్లి మండలంలో పాతవి 13,800 ఉంటే కొత్తవి 1400, మేళ్లచెర్వులో పాతవి 11,000 ఉంటే కొత్తగా 1200, నేరేడుచర్ల లో పాతవి 11,000 ఉంటే కొత్తగా 1700 అలాగే పాలకీడులో 7000 పాతవి ఉంటే 812 కొత్తవి మొత్తం 11,000 కార్డులు నూతనంగా మంజూరు చేశామని దీని ద్వారా 52,000 మందికి సన్న బియ్యం తినే హక్కు కల్పించామని తెలిపారు. 18 సంవత్సరాల తర్వాత జూల్కె మాసంలో సాగు నీరు వదలటం జరుగుతుందని నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రు శంకుస్థాపన చేసిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఇందిరా గాంధీ ప్రారంభించారని నేటికీ చెక్కు చెదరలేదు అని తెలి పారు. 396 కోట్ల రూపాయలతో 10,000 ఎకరాలకి నీరు అందించే రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ దొండపాడు 2 కి క్యాబినెట్ ఆమోదం తెలపటం జరిగిందని తెలిపారు. హుజూర్ నగర్ నియోజకవర్గంని రాష్ట్రములోనే నెంబర్ 1 గా చేస్తానని మంత్రి తెలిపారు. ఇంచార్జి మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కార్డు, ఇల్లులు ఇవ్వలేదని ఇందిరమ్మ రాజ్యములో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, 200 యూనిట్ల కరెంట్, ఉచిత బస్సు, ఉద్యోగాలు, ఇలాంటి మంచి సంక్షేమ పథకాలు ఇస్తున్న ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదలు ఉండాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ల కృషితో ప్రతి పేదవారికి ఆహార భద్రత కల్పించే సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు పంపిణి ప్రారంభించటం అదృష్టం అని అన్నారు. రేషన్ కార్డులు రాని వారు ఎవరు అందోళన పడాల్సిన అవసరం లేదు అని అర్హుల్కైన అందరు రేషన్ కార్డులకి దరఖాస్తు చేసుకోవచ్చు అని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రటరీ డి ఎస్ చౌహన్, జిల్లా ఎస్పి కే నరసింహ, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, డి ఎస్ ఓ మోహన్ బాబు, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్



**నిర్మల్ రూరల్, జూలై 29 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి అజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయం త్రం జిల్లా ప్రధాన ఆసుపత్రి ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎటువంటి వ్యాధులు వ్యాపించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్నటువంటి సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ గోపాల్ సింగ్,అదనపు సూపరిండెంట్ డాక్టర్ విశ్వనాథ్, డిసిహెచ్ఎస్ డాక్టర్ సురేష్,హెచ్వోడి డాక్టర్ ప్రశాంత్,వైద్యులు,వైద్య సిబ్బంది ఉన్నారు.

# రాజాసింగ్ .. రా అంటే మళ్లీ వాలిపోతా

### గోషామహల్‌కు ఉప ఎన్నిక రానేరాదు

### ఎమ్మెల్యే రాజాసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను బీజేపీ ఎమ్మెల్యే అని చెప్పొచ్చని, గోషామహల్‌కు మూడేళ్లు తానే ఎమ్మెల్యే అని పేర్కొన్నారు. కొన్ని తాను తప్పులు చేశానని, సోషల్ మీడియా మరికొన్ని తప్పుడు ప్రచారం చేసిందన్నారు. తమ పార్టీలో మిత్రులు, శత్రువులు ఉంటారని చెప్పారు. మీడియాకు రాజా సింగ్ లీక్‌లు ఇస్తున్నారని మా వాళ్లే కొందరు ఢిల్లీకి పిర్యాదు చేశారని తెలిపారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదన్నారు. బీజేపీ పార్టీకి మాత్రమే రాజీనామా చేశానని, ఎమ్మెల్యేగా రాజీనామా చేయలేదని స్పష్టం చేశారు. బీజేపీ తన ఇల్లు అని, రాజా సింగ్ రా అంటే వెంటనే పార్టీలోకి వెళ్లిపోతాను అని రాజా సింగ్ చెప్పారు. పెన్ డ్రైవ్‌లో నా మీద ఫిర్యాదులు పంపించారు. పిర్యాదులు, సోషల్ మీడియా వార్తలతోనా రాజీనామాను పెద్దలు ఆమోదించారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదు. నేను పార్టీకి రాజీనామా చేశాను, ఎమ్మెల్యేగా రాజీనామా చేయలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఉప ఎన్నిక జరగకుండా ఇక్కడ ఎలా జరుగుతుంది. చాలా మంది పార్టీనీ ఎందుకు విడిచి వెళ్లరు, ఇతర పార్టీల నుండి వచ్చిన వారు అవమానాలు ఎందుకు భరిస్తున్నారు.. ఇవన్నీ చెబుతాను. ఇవాళ లేకపోతే రేపు అయినా పిలుస్తారు అని అనుకుంటున్నా' అని ఎమ్మెల్యే రాజా సింగ్ తెలిపారు.

# బొగత జలపాత సందర్శనకు అనుమతి

**ములుగు, జూలై29 (జనంసాక్షి) :** వాజేడు మండలంలోని చీకుపల్లి గ్రామం శివారులో ఉన్న బొగత జలపాతం పర్యాటకులను ఆకర్శిస్తోంది. ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు బొగత జలాపాతం పరవళ్లు తొక్కుతోంది. జలసవ్వడులు మంత్రము గ్ధులను చేస్తున్నాయి. భారీ వర్షాలతో ఆంక్షలు విధించిన అధికారులు బొగత జలపాతం సందర్శనకు పర్యటకులకి అనుమతి ఇచ్చారు. ములుగు జిల్లా వాజేడు మండలం బోగత జలపాతం సందర్శనకు పర్యాటకులను షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. గత 10 రోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ప్రమాద స్థాయిని దాటి ప్రవహించడంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా అనుమతి నిరాకరించారు. నిన్నటి నుంచి జలత ప్రవాహం కొద్దిగా తగ్గు ముఖం పట్టడంతో జలపాతం సందర్శనకు అనుమతులు ఇచ్చారు అధికారులు. కానీ ఏ సమయంలో ప్రవాహం పెరుగుతోందో తెలియనందున నీటి కొలనులోకి అధికారులు పర్యాటకుల అనుమతి నిరాకరించారు.

# నకిలీ ఆయుర్వేదిక్ వైద్యం ముఠా అరెస్ట్



**ఆదిలాబాద్ ప్రతినిది. (జనంసాక్షి):** ఆదిలాబాద్ పట్టణంలో సాయి ఆయుర్వేదిక్ మందుల దుకాణం పేరుతో ముఠా నిర్వహిస్తున్న అక్రమాలపై ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో ముఠాను అరెస్టు చేసి మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్పీ పలు వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ముఠా సభ్యులు విడివిడిగా విడిపోయి కొందరు ఆదిలాబాద్ పట్టణంలో మరియు పలు ప్రభుత్వ మరియు ప్రైవేటు హాస్పిటల్స్ వద్ద, పలు సూపర్ మార్కెట్ల వద్ద అనారోగ్యంతో ఉన్న బాధితులను అందులో ముఖ్యంగా చిన్నపిల్లలను మహిళలను మరియు వృద్ధులను గ్రహించి వారిని సంప్రదించి తమ కుటుంబ సభ్యులకు సైతం ఇదేవిధంగా సమస్య ఉండేదని దానికి ఒక ఆయుర్వేద బాబా ద్వారా తమ సమస్యలకు అనారోగ్య సమస్యలు నయం అయి, పూర్తి అయోగ్యంగా పరిష్కారం లభిస్తుందని అమాయకులను నమ్మిస్తారని తెలిపారు.వీరందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందినవారుగా తెలిపారు. వీరందరూ ఇదివరకే సూర్యాపేట, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలలో ఇలాంటి మోసాలకు పాల్పడి ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లాలో మోసాలకు పాల్పడడం జరిగిందని తెలిపారు. తదుపరి ఇతర జిల్లాకు వెళ్లకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అడ్డగించి వారి అక్రమాలను బట్టబయలు చేసిందని తెలిపారు. ప్రజలు ఎలాంటి బాబాలను మూఢనమ్మకాలను నమ్మకుండా గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులను సంప్రదించి సరైన వైద్య చికిత్సను తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన ఆయుర్వేదిక్ వైద్యం ద్వారా చికిత్సను పొందాలని ఇలాంటి మందులను వాడటం వల్ల తమ ఆరోగ్యం మరింత చెడిపోయి అనారోగ్య బారిన పడతారని విషయాన్ని గ్రహించాలని సూచించారు.ఈ ముఠా సభ్యులపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఐదు కేసులు, టూ టౌన్ లో ఒకటి, మావలాలో రెండు కేసులు నమోదు అయ్యాయని, తెలిపారు వీరందరిపై బిఎన్ఎస్ 318(4), 316 తో కేసు నమోదు అయిందని తెలిపారు.ఈ ముఠా సభ్యులను మంగళవారం ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో 8 మందిని పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ ముఠా సభ్యులలో కీలక నిందితుడి పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కీలక నిందితుడు వీరందరికీ నకిలీ పేర్లతో మొబైల్ ఫోన్ లను మరియు సిమ్ కార్డులను అందజేయడం జరుగుతుందని, తదుపరి ఈ మొబైల్ ఫోన్ లను సిమ్ములను నాశనం చేయడం జరుగుతుందని తెలిపారు. కలిసికట్టుగా ప్రజలను మోసగించి సంపాదించిన డబ్బులను వారందరూ పంచుకునేవారుగా తెలియజేశారు. ఈ ముఠా సభ్యులను చాకచక్యంగా పట్టుకున్న ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్సై నాగనాథ్ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పిఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, కె స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లుగా పదోన్నతులు

### హర్షం వ్యక్తం చేసిన రెవెన్యూ జేసీసీ చైర్మన్ లచ్చిరెడ్డి

### రెవెన్యూ మంత్రిని కలిసిన రెవెన్యూ సంఘాల నేతలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగ సంఘాలు, జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సంఘాల నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతులకు ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా సహకారం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీసీఎల్ఏ, ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ) లోకేష్ కుమార్ కు, ఇతర ప్రభుత్వ పెద్దలకు పేరుపేరున రెవెన్యూ ఉద్యోగుల సంఘాల నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### రెవెన్యూ శాఖ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం:మంత్రి పొంగులేటి


ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అన్ని స్థాయిలలోని రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని ఆయన సూచించారు. అన్ని క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ పదోన్నతులు రెవెన్యూ శాఖలో ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని పెంచి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడానికి దోహదపడతాయన్నారు.

### ప్రజాప్రభుత్వంలో పదోన్నతుల శకం:లచ్చిరెడ్డి

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెవెన్యూ శాఖలో పదోన్నతుల శకం మొదలైందని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి పేర్కొన్నారు. చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రస్తుతం 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించిందన్నారు. ఇదే కాకుండా సీనియర్ అసిస్టెంట్ నుంచి నయాబ్ తహశీల్దార్ వరకు పదోన్నతులను కల్పించిందన్నారు. ఈ విధంగా అన్ని స్థాయిలలో పదోన్నతులను కల్పిస్తూ రెవెన్యూ శాఖను ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని 10,954 గ్రామాలలో జీపీఓల నియామకం చేపడుతుందన్నారు. ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులకే కాకుండా ప్రజలకు, రైతులకు కూడా రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందేలా చూస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె. రామక్రిష్ణ, తహసిల్దార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. భిక్షం, తహసీల్దార్ ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ, సెక్రెటరీ జనరల్ పూల్ సింగ్, ఫాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వందేళ్ల భారతీయ కమ్యూనిస్టు ఉద్యమాలు నిర్వహించిన మహత్తర పాత్ర

గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. దేశ వ్యాప్తంగా ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలైతేనేమి, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలైతేనేమి, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు, ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి, జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు, పేదలకు కొన్నొయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.




అంతటి మహత్తర వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రను ఒక చిన్న పుస్తకంలో చెప్పడం సధ్యమా? అంటే సాధ్యమే అని రాసి చూపించారు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కందిమళ్ల ప్రతాప రెడ్డి గారు. వంద పేజీల పుస్తకంలో వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రను పరిచయం చేయడంలో రచయిత చాలా మేరకు సఫలీకృతులయ్యారు. ఇది కమ్యూనిస్టు ఉద్యమ సంక్షిప్త చరిత్ర. ప్రతి ఒక్కరు చదివి తెలుసు కోవలసిన విషయాలెన్నో ఇందులో ఉన్నాయి. కందిమళ్ల ప్రతాపరెడ్డి గారి హృదయం గొప్పది. ఈ చరిత్రకు నేడు వివిధ పార్టీలుగా, గ్రూపులుగా ఉన్న వారందరూ వారసులే అని వినయంగా పేర్కొన్నారు. దాదాపు అన్ని కమ్యూనిస్టు పార్టీలు బూర్జువా ప్రజాస్వామ్య వ్యవస్థలో, భారత రాజ్యాంగం పరిధిలో పని చేస్తున్న వారే! ... ఒక్క మావోయిస్టులు తప్ప అని చెప్తూ! ఎవరికి వారు ఆత్మ విమర్శ చేసుకోవలసిన సమయమిది అన్నారు. రచయిత ముందుమాటలో ఇలా ప్రశలు వేసుకున్నారు. “వందేళ్ల మన చరిత్ర – త్యాగాలు, పోరాటాలు, సాధించిన విజయాలు ఏమైనాయి? ఎందుకు కమ్యూనిస్టు ఉద్యమం రోజు రోజుకు బలహీన పడుతున్నది? ప్రజలు కమ్యూనిస్టు ఉద్యమానికి దూరమయ్యారా? కమ్యూనిస్టులుగా మనం వారికి దూరమయ్యామా? “అని అంతర్మదనం చేసారు.

నా అభిప్రాయంలో ఈ రెండూ కరెక్టే! కమ్యూనిస్టుల ఐక్యత వీరి సదాశయం. పార్టీలు నిర్మాణ రీత్యా కార్యాచరణలో ప్రజలకు దూరమవుతున్నాయి. కానీ ప్రజా బలం తగ్గలేదు. అంటున్న వీరి మాట ఎంతో వాస్తవం. 90 ఏళ్ల వయసులో 75 ఏళ్ల ఎర్రజెండా నీడన నా జీవనం సాగింది. మా తరం అంతరించి పోతున్నది. అంటూ ఆవేదనతో యవతరాన్ని ఉత్తేజితులను చేయడానికి ఈ పుస్తకానిని అందించారు. వారి తపన ఆశయం గొప్పది.

మార్కెట్ ఎకానమీ ప్రపంచాన్ని అదుపు లోకి తీసుకొని ఆధిపత్యం చెలాయించడం మొదలై దశాబ్దాలు గడిచాయి. నాటి స్ఫూర్తి దాతలైన రష్యా విడిపోయింది. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది.

వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి.

**ఈ పుస్తకంలో ఒక ముఖ్యమైన మాట దొరికింది**

ఈ పుస్తకంలో ఒక ముఖ్యమైన మాట దొరికింది. ప్రజలను రాజకీయంగా కాకుండా, సమస్య ఆధారంగా సమీకరించి ఉద్యమాలు చేయాలని ఒక తీర్మానం చేసి దాని ప్రకారం కమ్యూనిస్టులు ముందుకు సాగారని! . మావోయిస్టులతో సహా కమ్యూనిస్టులందరు నేటికీ ఇదే పంథాలో సాగుతున్నారు. మనవారి వైఫల్యానికి పునాది ఇక్కడే పడింది. సాయుధ పోరాట విరమణ తరువాత కార్యకర్తలను, అభిమానులను రాజకీయ రంగంలో, పారిశ్రామిక, యాజమాన్య రంగాలలో ఎదగాలని చెప్ప లేదు. తర్ఫీదు ఇవ్వ లేదు. దాంతో పేద వర్గాలు పని చేసుకుంటూ బతికితే కాస్త వనరులున్న వాల్లు రాజకీయాలలో తిరిగారు. వారంతా సామాజిక వర్గాలుగా అగ్రకులాల వారే కావడం సహజం.

**వందేళ్లయినా అధికారం ఎందుకు రాలేదంటే...**

సమస్యల వారీగా ఆర్గనైజ్ చేయడం తో అవి సామాజిక ఉద్యమాలుగా, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలుగా కొనసాగుతాయి. ఓటు వేసి మనవారిని గెలిపించుకునే ప్రచారం చేయాలనే విషయం మరిచి తన వోటును కూడా ఇతర పార్టీలకు వేయడం మొదలైంది. ఇలా సమస్యల పోరాటానికి– రాజకీయాలకు మధ్య లింకు తెగిపోయింది. రాజకీయాల కోసం రాజకీయ ఉద్యమాలు చేసే తరం క్రమంగా అంతరించింది. ట్రేడ్ యూనియనిజం మిగిలింది. రాజకీయ చైతన్యం లేని ట్రేడ్ యూనిన్ ఉద్యమాల వల్ల వందేళ్లయినా రాజకీయ అధికారం రాదని నూట ఇరవై ఏళ్ల క్రితమే లెనిన్ చెప్పాడు. అది మిలిటెంట్ ట్రేడ్ యూనియనిజమే తప్ప రాజకీయ చైతన్యం కాదన్నాడు. కమ్యూనిస్టు, నక్సలైట్, మావోయిస్టులందరికీ ఈ మాట సమానంగా వర్తిస్తుంది. రాజకీయ చైతన్యం కలిగించక పోవడం వల్లనే ఉద్యమ ప్రాంతాల్లో బిజేపీ వంటి హిందూ మతతత్వ వాదులు , ప్రజా ప్రతినిధులుగా ఎమ్మెల్లేలు ఎంపీలుగా గెలువడం జరుగుతూ వస్తున్నది.

సమగ్ర సమాజ వికాసం లక్ష్యంగా శంకర్ గుహ నియోగి కమ్యూనిస్టు ఉద్యమాలలో నాకు బాగా నచ్చిన ఉద్యమం శంకర్ గుహ నియోగి సమగ్ర సమాజ వికాస ఉద్యమం. వారు చత్తీస్ గడ్ , బిలాయ్, దల్లీ రాజ, రాజ్ నంద్ గాంలో నిర్మించిన సమగ్ర సమాజ పునర్ నిర్మాణం కోసం పూనుకున్నారు. విద్య వైద్యం అందించడానికి వారేస్కూల్లు, హాస్పటల్సు పెట్టారు. సాంస్కృతిక రాజకీయ చైతన్యం కలిగించారు. రాజకీయ చైతన్యానికి సామాజిక చైతన్యానికి మధ్య చాలా తేడా!. రాజకీయ పార్టీ మేం ఇది చేస్తాం, అది చేస్తాం, అది ఇస్తాం, ఇది ఇస్తాం అంటుంది ! కమ్యూనిస్టులకు ఈ భాష అలవడలేదు. కమ్యూనిస్టులు ఇది చేయండి, అది ఇవ్వండి, అది కావాలి, ఇది కావాలి అనే భాష నేర్పారు. రాజకీయ అధికారం లక్ష్యంగా ఉన్నపుడు భాష మారుతుంది. సమస్యల ఆధారంగా ఉద్యమాలు నిర్మించాలనే మలుపు తీసుకున్నపుడే రాజ్యాధికారం చేజారి పోయింది.

ఇపుడు బీసీలు, మహిళలు, రాజ్యాధికారం కావాలని, అన్నిటిలో తమ వాటా తమకు కావాలని ముందుకు కదులుతున్నారు. వారిలో ఒకరుగా కలిసిపోయి ముందుకు సాగితే జనతా పార్టీ, జనతాదళ్, నాటి పునర్ లైభవంతో బహుజన నాయకత్వంలో కలిసి అధికారంలోకి వస్తారు అని ఆశించ వచ్చు.

కమ్యూనిస్టులు పేదల కోసం స్కూల్లు కాలేజీలు హాస్పటల్స్ ఒక ఉద్యమంగా నడిపి ఉంటే విద్య వైద్య రంగాలు ఇంత ఘోరంగా ప్రయివేటీకరణ , దోపిడి సాగేది కాదు. ప్రభుత్వాలే చేయాలి తప్ప తాము చేయాలను కోలేదు. శంకర్ గుహ నియోగి ఇవి చేసి చూపాడు గవక నాకు అభిమాన పాత్రుడయ్యారు। 1948లోనే శిబ్దాశ్ ఘోష్ తొలి చీలిక. కమ్యూనిస్టు ఉద్యమంలో 1964 లో తొలి చీలికతో సిపియం ఏర్పడిందని ఇందులో రాసారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో 1948 నుండి చీలికలు మొగలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్తాయిలో కొనసాగుతున్నది. . నాయకులు వ్యక్తిగత జీవితంలో ఆఛరించేదానికి, ప్రజలకు చెప్పేదానికి మధ్య చాలా వైరుధ్యం ఉంది, తాము చెప్పేదాన్ని వ్యక్తిగత జీవితంలో ఆచరించక పోవడం వల్ల , చిత్తశుద్ధి లోపించిన ద్వంద్వ స్వభావం వల్ల విడిపోతున్నానని ప్రకటించి స్వంత పార్టీ పెట్టాడు. 1948 నాటికే ఆయన ఇది గమనించడం నన్ను ఆశ్చర్య చకితుడిని చేసింది. 1967 లో చీలిపోయి నక్సలైట్ ఉద్యమం ముందుకు వచ్చింది. అందులో మరికొన్ని చీలికలు.

కుల వ్యవస్థ ఉత్పత్తి సంబంధాలను వదిలేసినారు. కమ్యూనిస్టులు భౌతిక వాస్తవికతను వదిలేసి సిద్ధాంతాన్ని పట్టుకున్నారు. వర్గాలను తయారు చేసే వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ కుల వివక్ష, పితృస్వామిక కుటుంబ వ్యవస్థ లోని మహిళల అణిచివేత , వివక్షతలను పట్టించుకోకుండా దాట వేస్తూ వచ్చారు. చాలా సందర్భాల్లో వాటిని లేవ నెత్తిన వారిని పక్కకు తోసేసారు . అలా 1978 లో శరద్ పాటిల్ బిటి రణదివేతో చర్చించి విసిగిపోయి సత్యశోధక కమ్యూనిస్టు పార్టీ పెట్టాడు. అందులో మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బుద్ధుడిని కలుపుకున్నాడు. మౌలిక వాస్తవికతను, దేశీయ చరిత్ర ప్రత్యేక పరిణామాలను పట్టించుకోకుండా క్రమంగా ప్రజలకు దూరమయ్యారు. స్వయంకృత అపరాధంతో ఇలా వందేళ్ల మహత్తర ఉద్యమాలతో అధికారంలోకి రాకుండా రోజు రోజుకు దూరం పెరగడానికి కారణాలు రాజకీయంగా ప్రజలను నడపక పోవడమే! కుల సమస్యను గుర్తించక పోవడమే!

అంబేద్కర్ చెప్పిన పరిష్కారం

వందేళ్లు లక్షలాది కార్యకర్తలు ప్రజలు చేసిన ఉద్యమాలగురించి అంబేద్కర్ మాటల్లో పరిష్కారం చెప్పాలంటే ... “భూమిని , పరిశ్రమలను జాతీయం చేయడం “ అనేది రాజ్యాంగంలో చేర్చడం.రష్యా , చైనాల్లో ఇదే చేశారు. అంబేద్కర్ అంత సూటిగా చెప్పినా కమ్యూనిస్టులు వీటిని కాజకీయ చైతన్య నినాదాలుగా తీసుకోలేదు. ఎక్కడిక్కడ స్థానికంగా భూమి కోసం పోరాటాలు చేసారు. ప్రాజెక్టుల కోసం భూములు సేకరించిన విధానంలో భూములు సేకరించవచ్చు. ఒక తరం దాక యజమానులకు డెవిడెండు ఇవ్వడం ద్వారా రాజ్యాంగ బద్దంగా స్వాధీనం చేసుకోవాల్సిన చూపు ప్రసరించ లేదు. తెలంగాణ కమ్యూనిస్టు పార్టీలో సీమాంధ్ర నాయకత్వం వల్ల జరిగిన కష్టాలు నష్టాల వల్ల ఉద్యమాలు ఎలా వక్రమార్గం పట్టాయో ఇందులో రాయడం పరిధికి మించిన పని కనక రాయలేదు.

గడిచి వచ్చిన చరిత్రను చెప్పే గొప్ప పుస్తకం ఇది

ఈ పుస్తకం మనం గడిచి వచ్చిన చరిత్ర గుర్తులను తెలుపుతుంది. మహానది ఎడారిలో ఇంకినట్టుగా సాగిన క్రమం అందరినీ విషాదంలో ముంచెత్తుతుంది. ఉమ్మడి కుటుంబాలు విడి పోయాయి. పండుగలు, పెళ్లిల్లు , చావులు తదితర సందర్భాల్లో కలుసుకకుంటారు. విడి పోయిన అన్ని రకాల తమ్యూనిస్టులు మేడే, మార్క్సు, ఎంగెల్స్, లెనిన్, జయంతి వర్ధంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం తదితర సందర్భాల్లో జేఏసీలుగా ఏర్పడి కలిసి పని చేస్తే గొప్ప స్ఫూర్తినిస్తుంది. బహుజన నాయకత్వం, మహిళా నాయకత్వం పెరిగే కొద్దీ ఆ సామాజిక వర్గాలు కలిసి వస్తాయి.

ఈ పుస్తకం చదువుతుంటే చరిత్ర మన కళ్ల ముందు తిరుగుతుంది. లోపాలు అటుంచి ప్రతి ఉద్యమం ఎంతటి మార్పులకు కారణమైందో తెలుస్తుంది. ప్రతి ఒక్కరు కళ్ల కద్దుకోవాల్సిన చరిత్ర పుస్తకం. పేదలు, కార్మికులు, సమ సమాజం కోరే మేధావులు విదావంతులు, కళాకారులు, కమ్యూనిస్టులు ఏం చేసారు లే అని వ్యంగ్యంగా ఎక సక్కెంగా మాట్లాడే ఆరెసెస్ బీజేపీ హిందూ మతతత్వ వాదులు కూడా ఈ పుస్తకం చదవాలి. చదివితే కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు, సాధించిన విజయాల పట్ల వినయంగా నమస్కరిస్తారు. ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధి కోసం గత వందేళ్లలో ఇందులో ఒక శాతమైనా కృషి చేయ లేకపోయామే అని బాధపడుతారు. ఈ పుస్తకం చదివి సామ్య వాదులు విషాదంగా రెండు కన్నీటి బొట్లతో త్యాగ ధనులకు నివాళి అర్పించి పిడికిలి బిగిస్తారు. ఇంత చక్కని పుస్తకం రాసి చరిత్ర వారసత్వాన్ని యవతరం చేతుల్లో పెట్టిన కామ్రేడ్ కందిమళ్ల ప్రతాప రెడ్డి గారికి హృదయ పూర్వక అభినందనలు, ధన్యవాదాలు.

**(భారత కన్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం. కందిమళ్ల ప్రతాప రెడ్డి. వెల 80 రూపాయలు. ప్రతులకు నవ చేతన బుక్ హౌసులు. (పాత విశాలాంధ్ర). ప్రచురణ కర్తల ఫోన్ . 9618032390.)**



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## “ఏదో ఒక రాగం!”



**నేనింకా బతికే ఉన్నాను**
**నీ జ్ఞాపకాల గాయాల్ని గుండెల్లో దాచుకుని,**
**పచ్చని గడ్డిపై చల్లని చెట్టు నీడలో**
**ఏకాంతంగానే నిద్రిస్తున్నాను.**
**ప్రతి ఊపిరిలోనూ నీ పేరు మోగుతూనే ఉంది,**
**ప్రతి కలలోనూ నీ రూపమే వెంటాడుతోంది.**
**కన్ను మూసినా - కన్ను తెరిచినా -**
**నీవు లేకపోవడమే నన్ను కృంగదీస్తోంది.**
**జీవితం ఉంటూనే -**
**జీవం లేని నీడగా మారిపోయాను,**
**నీ కోసం ఎదురుచూసే**
**మూలుగేశ్వాసగా మిగిలిపోయాను.**
**ఈ దేహం కూలిపోతే కూలిపోనివ్వు,**
**నా గుండె కొట్టుకునేంత వరకు నీ ధ్యాసల్లో**
**అలరారుతాను.**
**మరణం నన్ను తీసుకెళ్లినా -**
**నీ జ్ఞాపకాలే నా చివరి శ్వాసలవుతాయి.**

**-బాలాజీ పోతుల**
8179283830

## ప్రశ్నిస్తే!

**అమ్మకు దేవుడు చాలు!**
**మా అమ్మది భక్తిపిచ్చి**
**ఏడురోజులూఏడుగుళ్లు**

**దేశమంతా మా అమ్మలే!**
**వీళ్ల భక్తిపిచ్చి అపారం!**
**వీళ్ళనిమార్చటంఎలాగ?**

**భక్తిపిచ్చి కులపిచ్చి వల్లే**
**మనువాదం జీవిస్తోంది!**
**‘వారు’నేర్పిన విద్యే ఇది!**

**ఆర్థికసమస్యల్నిదేవుడు**
**ఎలా పరిష్కరిస్తాడు?**
**దేవుడికి డబ్బు తెలీదు!**

**డబ్బు సృష్టి మనిషిది!**
**వ్యాపార దృష్టి వీడిది!**

**దేవుడు అమాయకుడు!**

**ఈ పిచ్చిలోకాన్ని ఎలా**
**మార్చాలో చెప్పగలరా?**
**దేశమనువాదులదేనా?**

**వాళ్ళుపేట్రేగిపోతున్నారుజి**
**అన్నీ మూఢ విశ్వాసాలే!**
**వెనక్కి నడిపిస్తున్నారు!**

**పూర్తి అక్షరాస్యత లేదు**
**పెత్తందారీ తనం పోదు**
**సోషలిజం అంటే గిట్టదు!**

**నాదేశంముందుకెళ్ళదా?**
**వైజ్ఞానిక ప్రగతి లేదా?**
**ప్రశ్నిస్తే అర్బన్ నక్స్ లైటా**

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## ఊపిరి ఉన్నన్నాళ్లు వికసించు!!

**సమయం ఎప్పుడూ ఒకలా ఉండదు**
**అప్పుడప్పుడు కలలను పండిస్తుంది**
**మనలో నిరాశలు పెంచుతూ**
**మనిషిని కూడా నిర్జీవంగా మారుస్తుంది..**


**అన్నీ సిద్ధం చేసుకున్న జీవనయానంలో**
**పచ్చని చెట్టు పిడుగుకు కాలినట్లు**
**క్షణాల్లోనే నిప్పై కాలిపోతుంది బ్రతుకు**
**ఏదైనా జరగొచ్చు కాలపు ఒడిలో అనునిత్యం..**

**కూర్చున్న చోటే కూలిపోతూ**
**పండుకున్న చోటే జీవం నిర్జీవమై**
**వెలుగు చూసే కన్నుల్లో చీకటి కమ్ముకుంటూ**
**అనంత వాయువులో ఆత్మ చేరుతుంది..**
**మౌనంలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు**

**తనువులో ఏవో మార్పులు చేర్పులు**
**లయబద్ధపు గుండెలో శబ్దాలు నిశ్శబ్దమై**
**మరో లోకపు దారులు వెతుకుతాయి..**

**ఊపిరి ఉన్నన్నాళ్ళు వికసించు**
**మొక్కలా ఎదుగుతూ ఆదర్శంగా జీవించు**
**మట్టిలో కలిసే తనువుపై మమకారం తుంచి**
**జీవమున్నంతవరకు పరులకు సహకరించు...**


**ప్రేమనే ఆయుధంగా మార్చుకుంటూ**
**మాటనే మంత్రంగా చేసుకుంటూ**
**ఉన్నన్నాళ్లు ఉన్నతమైన వ్యక్తిత్వం జీవిస్తూ**
**జీవిత ఫలాన్ని సంపూర్ణంగా అనుభవించాలి..**



**కొప్పుల ప్రసాద్**
నంద్యాల
9885066235

# “స్పర్శ లేని శిల.. మహిళా స్వరం”

“స్పర్శ లేని శిల” అనే పేరుతో ఎన్ లహరి వెలువరించిన కవిత్వం సంపుటి ఇది. ఇందులో కవయిత్రి రాసిన నా మాటతో పాటు 60 కవితలున్నాయి. మహిళా కోణంలో రాసిన కవితల్లో తల్లిగా, జీవిత భాగస్వామిగా, కూతురుగా, ప్రేయసిగా, మనిషిగా, ప్రకృతి ప్రేమికురాలిగా, పల్లె పడుచుగా, ఏకాకి/ ఏకాంతంలోని ఆనంద విషాదాలను ఈ కవితల్లో చిత్రించారు.





బాల్యంలోని సంతోషాలను, తెలంగాణ పండుగలు మనుషులను కలిరపే ఆత్మీయతలను, ప్రకృతి ప్రేమికురాలిగా స్పందనలను అనేక కవితల్లో చిత్రించారు. “తీరం అంచున గత స్వప్నాలను నెమరేసుకుంటూ నేనూ సముద్రమూ.. ఆశలు రాలిన మోడునై ... నాలో నేనే ఒంటరినై...ఓ విషాద గీతంగా మిగిలి పోతాను అంటారు స్పర్శ లేని శిల” కవితలో!

ఇలా ఈ కవితా సంపుటి లో అంతర్లయగా విషాద గీతం కంటిన్యూగా కొనసాగుతుంది. స్త్రీ కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, అభద్రత, బరువు బాధ్యతలు ఎన్ని రకాలో ఈ కవితల్లో చూడవచ్చు. జీవితం పట్ల ఒక ఆశ, ఒక నిరాశ మధ్య కొట్టాడే స్థితి కవితల నిండా పరుచుకుంది. ఈ కవితలు ఇలా రూపుదిద్దుకోవానికి లహరి జీవిత వేపథ్యం బలంగా పని చేసింది. నా మాటలో ఇలా పేర్కొన్నారు. “ కొన్ని పరిస్థితుల వలన నేను కొన్ని రోజుల పాటు మంచం పట్టినపుడు మనుషుల విలువ బాగా తెలిసి వచ్చింది. ఆ కఠిన సమయం నుండి బయటపడి ఇపుడిలా మీ ముందుకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఇది నాకు గొప్ప ఊరటనూ ప్రశాంతతనూ కలిగించింది. బంధాలూ బంధుత్వాలూ అంటూ మనకు ఎన్నో ఉంటాయి. కానీ అవన్నీ అవసరానికి అవి తామరాకు మీది నీటి బిందువులే. అవి మన ఎదుగుదలకు ఎందుకూ పనికిరావని గ్రించడానికి ఎంతో కాలం పట్టలేదు. స్వతహాగా అన్నిటిని తట్టుకొని ఎదిగి నిలదొక్కుకోవడంలో ఉన్న తృప్తి వెల కట్ట లేనిది”. ఇలా లహరి తాను చుట్టూ సమాజంపెట్టుకున్న ఆశలు, ఆశించడాలు నిరాశలై దిగులు, డిప్రెషన్ నుండి తనకు తాను కోలుకోవడానికి చేసిన ప్రయత్నం, అంతర్యుద్ధంలో భాగంగా ఇందులోని కవితలు రూపుదిద్దుకున్నాయి.

ఈ కవితల్లో వస్తువు కనువైన వర్ణనలు, పోలికలు, రూపకాలు , పద చిత్రాలు చక్కగా చిత్రీకరించారు. లహరి పల్లె తనాన్ని , పల్లె భాషను, యాసను, సంస్కృతిని ఎంతో ఇష్టంగా ప్రేమిస్తారు. మహిళ గురించి రాస్తూ “ ఒకప్పుడు పొయ్యిలా మండుతూ ఇంటిల్లి పాదికీ బుక్కెడు బువ్వై ఆకలి తీర్చేది. .. కాలి కింద మట్టిలా నలిగిన కాలం నుండి కాళికలా కనక దుర్గలా వివక్షపై కదం తొక్కి కత్తుల్ని దూసింది. “ అంటూ మహిళా చైచన్యాన్ని ఎదిగిన క్రమాన్ని ఉత్తేజితంగా వ్యక్తీకరించారు లహరి. . ఆధిపత్య అహంకారం స్వార్థం అడుగు పడని చోటు కనుచూపు మేరలో లేదు” అంటూ పెరిగి పోయిన స్వార్థాన్ని గుర్తు చేశారు కవయిత్రి . ఇందులోని కవితా శీర్షికలు కొన్ని ... “వరకట్నపు విష బీజం, జ్ఞాపకాల వంతెన, తంగేడు పూలు, ఓదార్చేది అదే(మృత్యువే) ఆమె ఓ జీవనది, ఎగసి పడే కెరటాన్నై, ఆమె లేనిదే అవని లేదు, జ్ఞాపకాలను వెతుక్కుంటూ, దిగులు సముద్రం, రెప్ప చాటు శ్యం, కంచెలు కూల్చండి, మాట మరిచిన అరుగు, ఊరు మారింది, అమ్మమ్మ లేని ఇల్లు , ఎదురు చూపులు,శిశిర దేహం, అంతులేని వేదన..” ఇలా కవితా శీర్షికలు ఇందులో గల ప్రధాన కవితా వస్తువును తేట తెల్లం చేస్తాయి. “ ప్రేమను పంచడానికి సప్త సముద్రాలు దాట నవసరం లేదు.” అంటూ చక్కని సూచనతో కవితా సంపుటి ముగుస్తుంది. రచయిత్రి చివరాఖరుకు కన్నీళ్లు తుడుచుకొని ఆత్మ విశ్వాసంతో వివక్షను, అసమానతలను ఎదిరించి సంకల్పం ప్రకటించడం సంతోషం. ఈ కవితల్లో స్త్రీ ఎదుర్కునే సమస్యలు అనేక కోణ్ణాల్లో చిత్రించారు. గద్దర్, అలిశెట్టి ప్రభాకర్ , అమ్మమ్మ వంటి వారిని కవితల్లో తలుచుకున్న స్పర్శలో ఆత్మీయత పరిమళిస్తుంది. భర్త ఆసరాతో ఇపుడు నిరాశ దిగులు నుండి బయట పడింది. ప్రతి స్త్రీ విజయం వెనక ఒక పురుషుడు ఉంటాడు అనడానికి ఓ ప్రత్యక్ష తార్కాణం మా ఆయన అని నమస్సులర్పించారు. ఇలా దిగులు తనపై తనకు గల సెల్ఫ్ పిటీ నుండి బయటపడి తిరిగి సమాజం వైపు చూపు సారించింది రచయిత్రి. కనక ఇక జీవితంలో విశ్వరూపం ధరించి కట్టడి చేస్తున్న

కుల వివక్ష, కుల_అణిచి వేత, మతం పేరిట, మన సంస్కృతి పేరిట కొనసాగుతున్న కుల వ్యవస్థకు , పురుషాధిపత్యానికి మూల కారణమైన పితృస్వామిక కుటుంబ వ్యవస్థ, అందుకు పూర్తి మద్దతు తెలిపే పురాణ ఇతిహాసాలు, సంస్కృతి ఆధిపత్యాలను వెలికి తీస్తూ ఆ అనుభవాలను అవగాహనను అధ్యయనాన్ని కవితల్లో రాయడం నేటి అవసరం అని గుర్తు చేస్తూ మంచి కవితలతో తన మనసును హృదయాన్ని ప్రశాంతతను సాధించుకున్న లహరికి అభినందనలు, శుభాకాంక్షలు, శుభాశీస్సులు.

**ప్రతులకు : రచయిత్రి ఎన్. లహరి,**
**6-4-53/301, శ్రీరాం హోమ్స్,**
**హెచ్ ఐజి-96, ఫేజ్ 4,**
**కాలనీ, వనస్థలి పురం ,**
**హైదరాబాద్- 500070.**
**ఫోన్. 9885535506లో సంప్రదించండి.**



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## ప్రపంచ ఆర్థిక దృక్పథం
# భారత సామాజిక వ్యవస్థపై ప్రభావం

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రతి సంవత్సరం రెండు సార్లు ప్రచురించే వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ (డబ్ల్యూ ఈ ఓ) ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క స్థితిగతులను, అంచనాలను విశ్లేషిస్తూ, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే అంశాలను పరిశీలిస్తుంది. 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచ ఆర్థిక వృద్ధి 3.3 శాతంగా ఉంటుందని డబ్ల్యూ ఈ ఓ అంచనా వేసింది, ఇది అక్టోబర్ 2024 నివేదికతో పెద్దగా మారలేదు. యునైటెడ్ స్టేట్స్‌లో వృద్ధి సవరణ ఇతర ప్రాంతాల్లో తగ్గుదలను సమతుల్యం చేస్తుంది. అయితే, స్వల్పకాలిక దృక్పథం విభిన్నంగా ఉన్నప్పటికీ, మధ్యస్థ కాలంలో వృద్ధి నష్టాలు ప్రతికూలంగా ఉండవచ్చు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ద్రవ్య విధానాలకు అంతరాయం కలిగించి, ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేయవచ్చు.



భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా, నామమాత్ర జీడీపీ పరంగా ప్రపంచంలో ఐదో స్థానంలో, కొనుగోలు శక్తి సమానత్వం (పీపీపీ) ద్వారా మూడో స్థానంలో ఉంది. అయితే, తలసరి ఆదాయంలో 141వ స్థానంలో నిలిచింది. 1947 నుండి 1991 వరకు సోవియట్ నమూనా ఆధారిత రక్షణాత్మక ఆర్థిక విధానాలు, లైసెన్స్ రాజ్‌తో కూడిన బ్యూరోక్రాట్ నియంత్రణ ఆర్థిక వ్యవస్థను ఆకర్షించాయి. 1991లో శీతల యుద్ధం ముగింపు, చెల్లింపుల సంక్షోభం ఆర్థిక సరళీకరణకు దారితీసింది. ప్రభుత్వ రంగం రైల్వే, రహదారులు, బ్యాంకింగ్, భీమా, వ్యవసాయం, రక్షణ, ఇంధన రంగాల్లో గణనీయమైన నియంత్రణ కలిగి ఉంది. డిజిటలైజేషన్, టెలికమ్యూనికేషన్, అంతరిక్షం, ఓడరేవులు వంటి రంగాల్లో కూడా రాష్ట్రం ప్రభావం గణనీయంగా ఉంది.

అయితే, ఆర్థిక వృద్ధి గొప్పలు చెప్పుకునే సమాజంలో, కొందరు తమ స్థాయికి మించి ఆడంబరంగా జీవిస్తారు. “ఇంట్లో ఈగలమోత, బయట పల్లకి మూత” అనే సామెత ఈ పరిస్థితిని సూచిస్తుంది. కనీస ఆహారం, గృహం, వస్త్రం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీరని వారు ఈ దేశంలో ఇప్పటికీ కోట్లాది మంది ఉన్నారు. రోడ్ల పక్కన, మురికి కాలువల్లో, చీకటి అడవుల్లో జీవిస్తున్న వారిని మనం చూస్తున్నాం. 15 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం 25 కోట్ల మందిని పేదరికం నుండి విముక్తి చేసినట్లు ప్రకటించినప్పటికీ, 81 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తూ, దానిని పౌష్టికాహారంగా చెప్పడం సరిపోతుందా? కరోనా సమయంలో రోగనిరోధక శక్తి పెంపొందించే పౌష్టిక ఆహారం అవసరమని ప్రచారం జరిగినా, కేవలం బియ్యంతో సరిపెట్టడం ఎలా సమర్థనీయం?

రాజకీయ నాయకులు వెయ్యేళ్ల ప్రణాళిక, 2047 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందని గర్వంగా చెబుతున్నారు. కానీ, గతంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీలు ఇచ్చినా, అవి నెరవేరలేదు. రైతుల సమ్మెలను పట్టించుకోకుండా, హింసాత్మక చర్యలకు పాల్పడడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వంటివి సామాన్యులపై భారం మోపాయి. విద్య, వైద్యం, రవాణా, మౌలిక సదుపాయాల్లో కనీస సౌకర్యాలు అందించకపోతే, గొప్ప ప్రణాళికలు ప్రజలకు ఏం ఒరుగుతాయి? నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ చెప్పినట్లు, కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో దేశం అభివృద్ధి చెందినట్లు ఎలా చెప్పగలం?

అటవీ, ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్య సౌకర్యాలు లేక ప్రజలు తల్లడిల్లుతున్నారు. అత్యవసర సమయంలో కిలోమీటర్ల కొద్దీ ఢోలీల్లో రోగులను మోసుకెళ్లే దృశ్యాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సింగిల్ రోడ్లపై రవాణా జరుగుతూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాణ్యత లేని రోడ్లు, వంతెనల నిర్మాణం వల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. రాజకీయ, అధికార యంత్రాంగంలో అవినీతి పెరిగిపోతుంటే, సామాన్యులు కనీస అవసరాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ రంగంలో రైతులు రోడ్ల లేమి వల్ల పంటల రవాణాలో కష్టాలు పడుతున్నారు. మధ్యాహ్న భోజనంలో పిల్లలకు పౌష్టికాహారం బదులు సాధారణ ఆహారంతో సరిపెట్టడం ఎలా సమంజసం? నేరస్థులు, నేరాలతో సంబంధం ఉన్నవారు పాలకవర్గంలో కొనసాగుతుంటే, పాలనా వ్యవస్థ బాధ్యతారహితంగా మారుతోంది. ఎన్నికల ఖర్చు పరిమితులను తొలగించి, నీతిమంతులు, పేదలు కూడా అధికారంలోకి రాగలిగే అవకాశం కల్పించాలి. ఇప్పటికీ కోట్లాది మంది ఇళ్లు, ఉపాధి లేక నిర్వీర్యమై, అసాంఘిక కార్యకలాపాలకు లోనవుతున్నారు. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా, గొప్ప వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తే, వారు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. విద్య, వైద్యం, సామాజిక న్యాయాన్ని ప్రభుత్వ రంగంలో నాణ్యంగా అందించకపోతే, “మీసాలకు సంపెంగ నూనె” లాంటి గొప్ప మాటలు ప్రజలను నమ్మించలేవు. 140 కోట్ల జనాభాకు కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. ఆర్థిక వృద్ధి గొప్పలు చెప్పడం కాకుండా, అట్టడుగు వర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## మహిళా సంఘాలు మరింత బలోపేతం అవ్వాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం నారాయణపేట లోని శీలా గార్డెన్ లో ఏర్పాటుచేసిన మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారుచేసిన ఉత్పత్తుల అమ్మకాల ప్రదర్శన నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ ఆకాంక్ష హాత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 29 నుండి ఆగస్టు 2 వరకు నిర్వహించే మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల జిల్లా స్థాయి ప్రదర్శన ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఐదు రోజులపాటు జరిగే ఈ జిల్లా స్థాయి ప్రదర్శన ను ప్రతి ఒక్కరు తిలకించేందుకు పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ప్రతి ఒక్కరికి తెలియచేయాలన్నారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ అధికారి మొగులప్ప మాట్లాడుతూ కుటుంబాలతో కలిసి సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీఎం అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రజా సమస్యల పరిష్కరించడం ప్రజా ప్రతినిధి లక్ష్యం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**తాండూరు, జూలై 29 (జనం సాక్షి) :** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం తాండూర్ నియోజకవర్గంలో పలు సంక్షేమ అభివృద్ధి శంకుస్థాపనలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఐటీ భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూరు శాసనసభ్యులు భుయ్యాని మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందనెల్లి జిపిఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సభలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా సమస్యలు, బాధలను అర్థం చేసుకొని ప్రజా పాలనను చేపట్టడం జరుగుతుందన్నారు. గత పది సంవత్సరాల్లో చేపట్టని పనులన్నింటిని పెద్ద మొత్తంలో నిధులను కేటాయించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇంకా భవిష్యత్తులో అధిక నిధులను కేటాయిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డు లేని అర్హులైన పేదవారికి కార్డులను అందిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల కుటుంబాలకు గాను 95 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణాల నిమిత్తం ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా



3500 మంజూరు చేస్తూ, ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుడికి 5 లక్షల చొప్పున దంగదును జమ చేయడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవాడికి వైద్య సదుపాయి నిమిత్తం ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయలను అందించడం జరుగుతుంది ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు వీలుగా 25 ఎకరాల్లో 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇలాంటి పాఠశాలలు భవిష్యత్తు తరాలకు ఎంతగానో దోదపడుతుందని, ప్రజా సమస్యల పరిష్కరించడం ప్రజా ప్రతినిధి లక్ష్యం, చేసే దిశగా ప్రభుత్వం నిన్నేం తీసుకుందని ఆయన అన్నారు. జనాభాలో సగభాగమైన మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందజేయడం జరుగుతుందని, ఒక సంవత్సరంలోనే 21 వేల కోట్ల రుణాలను అందించిన ఘనత ప్రజాపాల ప్రభుత్వందని ఆయన తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయంగా మహిళలకు ఆర్టీసీల్లో బస్సులను అద్దెకివ్వడం, సోలార్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం మహిళలకు తోడ్పాటు అందిస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతుల పక్షపాతిగా రైతుల బాధలను తెలుసుకున్న ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో ముందుకు వెళుతుందని ఆయన అన్నారు. వసతి గృహాల్లో మెస్ చార్జీలను పెంచి నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు వసతి గృహాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. లో వోల్టేజ్ ని అధిగమించేం దుకు గాను రాష్ట్రంలో అవసరానున్న ప్రాంతంలో విద్యుత్తు సబ్ స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జనాభా ప్రాతిపదికన బహుజనుల రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వ తీర్మానాన్ని కేంద్రానికి సమర్పించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఆమోదం తెలుపుతుందని ఆశిస్తున్నామని మంత్రి అన్నారు. ఇలా బషీరాబాద్ లో 706, పెద్దేముల్ లో 1939, తాండూరు మండలం, మున్సిపల్‌లో 3315, యాలాలలో 1083 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, డిసిసిబి చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, జిల్లా అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా సంచారం

- పరిగి సుల్తాన్పూర్ దగ్గర త్రుటిలో తప్పించుకున్న దొంగల ముఠా
- దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు
- బైక్ స్వాదినం దర్యాప్తు ముమ్మరం

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** అంతర్రాష్ట్ర దొంగల ముఠా గత కొంతకాలంగా వికారాబాద్ జిల్లాలో సంచరిస్తుంది. వికారాబాద్, పరిగి, మర్పల్లి ఏరియాలో సంచరిచ్చినట్లు తెలుస్తోంది. వీరు రాత్రివేళ వికారాబాద్ మున్సిపల్ లో సంచరించినట్లు సీసీ కెమెరాలు స్పష్టంగా రికార్డు అయింది. అయితే పరిగి మున్సిపాలిటీ సుల్తాన్పూర్ సమీపంలో పరిగి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు అనుమానితులు వెళ్తున్నారు. అనుమానితులుగా కనిపించిన వీరిని పరిగి పోలీసులు ప్రశ్నించేలోపే తప్పించుకొని పరారయ్యారు. దగ్గరలో ఉన్న వ్యవసాయ పొలాల్లోకి పారిపోవడంతో పోలీసులు వారిని వెంబడించిన ప్రయోజనం లేకపోయింది. కానీ దొంగల ముఠా సభ్యులు ప్రయాణించిన కర్ణాటక నెంబర్ ప్లేట్ ఉన్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు పారిపోతూ చేతుల సంచిని విసరి వేయడంతో పోలీసులు దానిని తీసుకొని విప్పి చూడగా అందులో మారణాయుధాలు ఉన్నట్లు గుర్తించారు. అందులో ఒక పిస్తోల్



చాకులు స్కూ డ్రైవర్ ఉన్నట్లు తెలుస్తుంది. అయితే పారిపోయిన దొంగలను పట్టుకోవడానికి పరిగి పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే తరహాలో జూన్ 19న మర్పల్లి పోలీసులు అనుమానస్పద వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నారు. మర్పల్లి మండలం పట్లూరు గ్రామ సమీపంలో ఒక వ్యాన్ లో చాకు తోపాటు ఒక సంచిలో స్కూ డ్రైవర్లతోపాటు ఇతర వస్తువులను పోలీసులు గుర్తించారు. రాత్రివేళ దొంగల ముఠా ఈ వ్యాన్ లో ప్రయాణించి తెల్లవారుజామున పట్లూరు గ్రామ సమీపంలో వదిలి వెళ్ళినట్లుగా తెలుస్తోంది. ఈ వ్యాన్ అనుమానస్పదంగా కనిపించడంతో గ్రామస్తులు మర్పల్లి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటి ఎస్సై అబ్దుల్ గఫర్ వ్యాన్ స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. కాగా కొన్ని నెలల క్రితం వికారాబాద్ మున్సిపల్ లో దొంగల ముఠా రాత్రివేళ సంచరించింది. వారి ఆనవాళ్లు సీసీ కెమెరాలు స్పష్టంగా రికార్డు అయ్యాయి. దీనిపై వికారాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తర్వాత వికారాబాద్ లో వరుస దొంగతనాలు జరుగుతున్న పోలీసుల దొంగలను పట్టుకోలేకపోయారు. దొంగలు ఇంటికి తాళం వేసిన వాటిని టార్గెట్ చేశారా లేక రాత్రికి దొంగతనం చేయడానికి పతక రచన చేశారా అనే విషయం తెలియ రాలేదు. గత కొంతకాలంగా వికారాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తున్న అన్న విషయం మాత్రం స్పష్టమైంది. దీంతో ప్రజలు ఆందోళన చెందారు. జిల్లాలో సంచరిస్తున్న దొంగల ముఠా ఒకటేనా... లేక వాళ్ళు బృందాలుగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారని విషయం తెలియవలసి ఉంది. పరిగిలో దొంగలు వదిలి పారిపోయిన మారణాయుధాలు పట్లూరు గ్రామం వ్యాన్ లో దొరికిన మారునాయిదాలు కత్తులను స్కూ డ్రైవరు ఇతర సామాన్లను పరిశీలిస్తే ఇదే దొంగల ముఠా జిల్లాలో బృందాలుగా ఏర్పడి సంచరిస్తున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా వీలైనంత తొందరగా దొంగలను పట్టుకోవడానికి ప్రజలందరూ సహకరించాలని అనుమానితుల సమాచారాన్ని అందజేస్తారని అందరం ఆశిద్దాం...

## ఎన్నికల సమరానికి సిద్ధంగా ఉండాలి

- దోమ మండల బీజేపీ అధ్యక్షుడు బొంగు మల్లేశం



**దోమ, జూలై 29 (జనం సాక్షి) :** మండల ఎన్నికల కార్యాచరణలో భాగంగా దోమ మండలంలో అయినపూర్ గ్రామంలో నిర్వహించిన మండల కార్యశాల కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొంగు మల్లేశం మాట్లాడతూ ఎన్నికల సమరానికి సిద్ధంగా ఉండాలని పిలుపుని ఇచ్చారు. ఇందులో భాగంగా మండల ఇంచార్జ్ పెంటయ్య గుప్తా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో మమేకైమై ఉండి కుటుంబ సభ్యుల కలిసిపోవాలి అని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఉపాధ్యక్షులు గిరిగంటి కేశవులు మాట్లాడుతు వచ్చే ఎన్నికలు మనకు ఎంతో ముఖ్యని కార్యకర్తలు నాయకులుగా మరియు ప్రజా ప్రతినిధులుగా అయ్యే అవకాశం ఉందని ఉన్న అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు సీత్వ బలరాజ్, మరియు శేరి రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు దోమ నర్సిములు,ప్యాట అశోక్,ఉపాధ్యక్షులు బోయిని బాబు,కార్యకర్తలు పాల్గొన్నారు..

## విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు సాధించాలి



**శామీర్‌పేట్, జూలై 29 (జనంసాక్షి) :** ఉత్సాహంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు హకీంపేట్ లోని తెలంగాణ క్రీడా పాఠశాలలో మేడ్చల్ జిల్లా స్థాయి అండర్ 8,10, 12,14,16,18,20, మెన్ అండ్ ఉమెన్ అర్థమెటిక్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించినట్లు నిర్వాహ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ తెలిపారు. ఉదయం ప్రారంభమైన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి హాజరై క్రీడాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే క్రీడలను ఎంచుకొని తగిన శిక్షణలో ముందుకు సాగాలని విద్యార్థి దశ ఇందుకు ఎంతో ముఖ్య మని విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని తెలియజేశారు. వివిధ పాఠశాలల కళాశాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు సాధించినారు. ముగింపు కార్యక్రమంలో ఆర్గ నైజింగ్ కమిటీ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ వచ్చేనెల మూడు నాలుగు తారీకులలో హనుమకొండలో జరిగే 14వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మేడ్చల్ జిల్లా తరపున ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పాల్గొనడం జరుగుతుందని తెలియజేశారు. వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ఎంపిక చేయటం జరుగుతుందని తెలియజేశారు. అదే విధంగా ఏడవ తారీఖు జనగామలో జరిగే రాష్ట్రస్థాయి జావలిన్ త్రోలో విద్యార్థులను ఎంపిక చేయటం జరిగిందని తెలియజేశారు,క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కన బరిచి తమ పాఠశాలకు మేడ్చల్ జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని మున్ముందు క్రీడాకారులు ఉత్తమ శిక్షణలో ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ రాజు,వైస్ ప్రెసిడెంట్ అశోక్, టెక్నికల్ కమిటీ మెంబర్స్ శేఖర్,సునీల్,మల్లి కార్జున్,భద్రం, మణికంఠ,హర్ష,స్పోర్ట్స్ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గోపాల్,ప్రభాకర్, శంకర్,మరియు క్రీడాకారులు క్రీడాకారుల తల్లిదండ్రులు వివిధ పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పామాయిల్ పంట ద్వారా అధిక లాభాలు

- పంట కొనుగోలు కోసం పరిశ్రమల స్థాపన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** పామ్ ఆయిల్ పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకుసూచించారు. మంగళవారం వికారాబాద్ పరిసర ప్రాంతంలోని కొత్రేపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాటేషన్ డ్రైవ్ లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రైతులను ఆదుకునే దిశగా పనిచేస్తుందన్నారు. పామ్ ఆయిల్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించడంతో పాటు మూడు సంవత్సరాల పాటు అంతర్గత కూరగాయ పంటలతో వ్యవసాయం సాగు చేయవచ్చునని మంత్రి తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతులకు మొక్కలు



ఇవ్వడంతో పాటు డ్రిప్ పరికరాలను అందించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని అదేవిధంగా మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. అధిక దిగుబడి వచ్చే విత్తనాలను రైతులకు అందించాలని మంత్రి సూచించారు. జిల్లాలో పెద్ద మొత్తంలో ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసినట్లయితే రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఫ్యాక్టరీని శంకుస్థాపన చేసుకుందామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రైతుల కష్టాలు తీర్చడానికి భూ భారతి తీసుకువచ్చని ఆయన అన్నారు. వికారాబాద్ జిల్లాలో మంచి సారవంతమైన భూములు ఉన్నాయని, ఆయిల్ ఫాం పంటకు అనుకూలంగా ఉంటాయని ఆయన తెలిపారు. వరి పంటకు అవసరమైన ఒక్క ఎకరం నీటితో నాలుగు ఎకరాల ఆయిల్ ఫాం తోటలను సాగు చేయవచ్చని, నాటిన మొదటి నాలుగు సంవత్సరాలు 50 వేల 918 రూపాయలను ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందని ఆయన తెలిపారు. ఆయిల్ ఫాం మొక్కలను ఒకసారి నాటితే 40 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుందని ఆయన అన్నారు. దొంగల భయం, కోతుల బెడద, చీడపీడలు బాధ ఉండదని ఆయన అన్నారు. ఆయిల్ ఫాం గెలలను ఫ్యాక్టరీ వాళ్ళే డైరెక్ట్ గా కొనుగోలు చేస్తారు కాబట్టి మార్కెటింగ్ ఇబ్బందులు కూడా ఉండవని సభాపతి తెలిపారు. దేశం లో ఏడాదికి లక్ష కోట్ల విలువైన ఆయిల్ ఫాం ను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుందని కాబట్టి మన దగ్గర ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని ఆయన అన్నారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా వచ్చే అయిదేళ్ళలో ఈ ప్రాంతానికి సాగు నీరు తెస్తానని సభాపతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ హష్మీన్ భాష, డిప్యూటీ డైరెక్టర్ నీరజ గాంధీ , జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి రాజా రత్నం, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించలేదని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి వర్గీయుల ఆందోళన

- కాగ్న నది బ్రిడ్జిలో నిర్మాణం లేదని బిజెపి ఆందోళన
- నాయకుల అరెస్టు పోలీస్ స్టేషన్ తరలింపు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** ప్రోటోకాల్ పాటించలేదని అధికార పార్టీ కాంగ్రెస్ నాయకుల లొల్లి. కాగ్న నది నిర్మాణంలో నాణ్యత లోపించిందని ప్రతిపక్ష పార్టీ బిజెపి నాయకుల లొల్లి. రెండు పార్టీల ఆందోళన మధ్య రాష్ట్ర మంత్రుల పర్యటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే తాండూరు నియోజకవర్గం లోని యాలాల మండలం దౌలాపూర్‌లో ఏర్పాటుచేసిన సబ్ స్టేషన్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఫ్లెక్సీలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ పట్టణం మహేందర్ రెడ్డి ఫోటో వేయలేదని ఆయన వర్గీయులు ఆందోళనకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికార కార్యక్రమానికి ఆహ్వానించి ఫ్లెక్సీలో తమ నాయకుని ఫోటో పెట్టకుండా అవమానించారని ఆందోళనకు దిగారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ఆగ మేఘాలపై వెళ్లి మరో ఫ్లెక్సీ తయారుచేసి సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి వర్గీయులు దీంతో కొంతసేపు ఉద్రుత పరిస్థితి నెలకొంది. అలాగే కాగ్నా నది బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపించిందని బిజెపి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ కాగ్న నది బ్రిడ్జిపై ఆందోళనకు దిగారు. మంత్రుల కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రెండు సంవత్సరాల క్రితం కాగ్న నాది వంతెనపై ఏర్పాటుచేసిన నూతన బ్రిడ్జి నిర్మాణం పనుల్లో నాణ్యత లోపించడం వల్ల పలుచోట్ల



వంతెనపై పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడి వానచోదకులకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో స్పందించిన బిజెపి పార్టీ శ్రేణులు మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రేణులు అందరూ కలిసి ఉపముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయాలని భావించారు. నాణ్యత ప్రమాణాలను పాటించని కాంట్రాక్టర్ పై సంబంధిత అప్పటి టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన కాన్వాయిని అడ్డుకున్నారు. ఈ మేరకు పోలీసులు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కాన్వాయిని అడ్డుకున్న సందర్భంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర తో పాటు ఆ పార్టీ నాయకులను, శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకొని కొడంగల్, యాలాల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంలో బిజెపి పార్టీ నాయకులకు శ్రేణులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంలో బిజెపి పార్టీ నాయకులు శ్రేణులు పోలీస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ మేరకు అక్కడే మీడియాతో బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ శాంతియుతంగా న్యాయబద్ధంగా బ్రిడ్జి నిర్మాణంలో జరిగిన అవకతవకల పైన పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని బాధ్యుల పైన చట్టపరమైన చర్యలు తీసుకొని బ్రిడ్జి నిర్మాణం పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ హయాంలో జరిగిన పనులన్నీ నాణ్యతలేని పనులేనని ఆయన దుయ్యబట్టారు. ఉప ముఖ్యమంత్రిని కలిసి తాము పూర్తి వివరాలు జిల్లాకు సంబంధించిన రోడ్ల పరిస్థితి, రైతులకు సంబంధించిన సమస్యల పైన ఆయనకు వివరించాలని మేము భావించామని అయితే పోలీసులు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించి మా నాయకుల పైన కార్యకర్తల పైన పోలీస్ జూలూమ్ చూపించారని పేర్కొన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ యాములో చేపట్టిన అన్ని ప్రాజెక్టుల నిర్మాణాలు సైతం అలాగే ఉన్నాయని దానికి నిదర్శనం కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాగా బ్రిడ్జిపై ఏర్పడిన గుంత, నాసిరకమైన పనులు, అధ్వాన్న రోడ్డులకు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు కొద్దిసేపు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. అంతా మాత్రాన అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో తరలించడం పోలీసులకు బాల్యం కాదని పేర్కొన్నారు. మేము శాంతిభద్రతలకు విగాథం కలిగించలేదని కేవలం సమస్య పైన వారికి వివరించాలనుకున్నామని జిల్లా అధ్యక్షులు పేర్కొన్నారు. అసలే వర్షాకాలం అతి భారీ వర్షాలు పడితే ఆ అభివృద్ధి కాస్త కూలిపోయి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధ్యుల పైన తగు చర్యలు తీసుకొని వెంటనే ఆ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని పునరుద్ధ ఘాటించారు.

## బీజేపీ పార్టీ కులాల మీద రాజకీయాలు చేయదు

- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్



**జడ్చర్ల, జూలై 29 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ కుల రాజకీయాలు చేయదని, ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడి ముందు కోశాధికారి శాంతకుమార్‌పై కార్యకర్తలు తమ అసంతృప్తి మాత్రమే వ్యక్త పరిచారని ఇందులో బిసి బిడ్డకు అన్యాయం జరిగిందని బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీ విషయాల్లో వేలు పెట్టరాదని బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళ వారం జడ్చర్ల బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. బిజెపి పార్టీ క్రమ శిక్షణ కల్గిన పార్టీ అని, పని చేసే కార్యకర్తలను మాత్రమే చూస్తారని వారి కులాలు చూసి ఎవరు మాట్లాడారని అన్నారు. బిజెపి పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్ ఎన్నికలు జరిగి 14 నెలలు గడుస్తున్న ఇంత వరకు జిల్లాలో కనిపించలేదన్నారు. ఎన్నికల్లో ఆయన వెంట ఉండి పని చేసిన కార్యకర్తలు ఎంపీ డీకే అరుణను గెలిపించుకున్నారు. కానీ ఆయన పనుల వల్ల పార్టీకి వాళు దూరం అవుతున్నాం అనే బాధలో మాత్రమే వాళ్ళు శాంత కుమార్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారని అన్నారు. జిల్లాలో ఎంపీగా డీకే అరుణ గెలిస్తే శాంతకుమార్ మాత్రం కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలిపారని, బిజెపి పార్టీలో జడ్చర్ల నియోజక వర్గంలో అన్ని మండలాల అధ్యక్షులుగా ఎస్సీ, బిసి, ఎస్టీలు ఉన్నారని గుర్తు చేశారు. ఇక్కడ పార్టీలో అందరూ సమానమేనని ఎవరు గొప్ప, ఎవరు తక్కువ కాదని అన్నారు. కుల సంఘాల నాయకులు ఎవరు కూడా బిజెపి పార్టీలో జరిగిన గొడవలపై సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాబోతుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా స్పోక్ పర్సన్ బాలవర్ధన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు అమర్నాథ్ గౌడ్, కిసాన్ మోర్చా నాయకుడు బాలకృష్ణ, నాయకులు తిరుపతి, బుక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలు

- జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చొరవ అభినందనీయం
- రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** ప్రజలకు పారదర్శకత జవాబుదారీతనంతో కూడిన చట్టంలో నిబంధనలకు లోబడి ఖచ్చితమైన సమాచారం అందించి ప్రజలకు ప్రభుత్వానికి పౌర సమాచార అధికారులు వారధిగా నిలవాలని రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జిల్లా సమాచార హక్కు చట్టం కమిషనర్ల పర్యటన నేపథ్యంలో మంగళ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పౌర సమాచార అధికారులతో ఆర్టిఐ యాక్ట్ అమలు చేయు విధి విధానాలపై క్షుణ్ణంగా పౌర సమాచార అధికారులకు చట్ట నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెదక్ జిల్లాకు చేరుకున్న రాష్ట్ర ముఖ్య పౌర సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఇతర కమిషనర్లు, పీవీ శ్రీనివాస్ , బోరెడ్డి ,అయోధ్య రెడ్డి, మోసిన్ పర్వీన్, వైష్ణవి మేర్ల, దేశాల భూపాల్ రాష్ట్ర ముఖ్య పౌర సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పూల బొకేతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ గౌరవ వందన స్వీకరించి, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. తదుపరి ప్రజావాణి హాలులో పౌర సమాచార అధికారులకు అవగాహన సదస్సుకు ఇతర కమిషనర్లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఐ కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టి మొదటిగా మెదక్ జిల్లాకు రావడం జరిగిందని సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ శాఖల అధికారులు చూపించిన చొరవ హర్షించదగ్గ విషయం అన్నారు మెదక్ జిల్లాలో ఆర్టిఐ యాక్ట్ సమర్థవంతంగా అమలవుతుందన్నారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పథకాల అమలు ,నిధుల వినియోగం ,అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. సెక్షన్లు, సబ్ సెక్షన్లపై క్షుణ్ణంగా చదివి పౌర సమాచార అధికారులు సమగ్ర అవగాహన పెంపొందించుకోవాల్సిన ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న29 ప్రభుత్వ శాఖలలో 15 శాఖలలో ఏం కేసులు లేకపోవడం హర్షించ దగ్గ విషయంగా పేర్కొన్నారు. 136 దేశాలలో ఆర్.టి.ఐ యాక్ట్ అమలులో ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారుతనం ఎంత అవసరమో పారదర్శకత అంతే అవసరమని ఆర్టి.ఐ యాక్ట్ ద్వారా పూర్తి సమాచారం అందించినప్పుడు మాత్రమే జవాబుదారితనం పారదర్శకత సార్థకత స్థాయికి వెళ్తాయని చెప్పారు. గత పది సంవత్సరాల కాలంలో సమాచార కమిషన్ అందుబాటులో ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషన్ దగ్గర పెండింగ్లో ఉన్నాయ ని తెలిపారు ప్రజలు సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం అందజేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయాల వద్ద సిటిజన్ షాట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సహేతుక కారణాలు చూపించకుండా ఆర్టిఐ అక్ట్ దరఖాస్తులను తిరస్కరించకూడదని చెప్పారు. సమాచార హక్కు చట్టం అందుబాటులో ఉంది కాబట్టి అందరూ బాధ్యతగా తీసుకొని వీలైనంత తొందరగా సమాచారం ప్రజలకు అందించాలన్నారు. రాబోవు ఆగస్టు నెలలో పెండింగ్లో ఉన్న కేసులను పూర్తిగా పరిష్కరించి కొత్త దరఖాస్తులు ద్వారా ముందుకు వెళ్ళబోతున్నామని చెప్పారు. రెండు నెలల్లో 30 శాఖల కేసులకు పూర్తిగా పరిష్కరించి జీరో కేసులు ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. 11 జిల్లాలను ఎంపిక చేసుకుని సమాచార హక్కు చట్టం ద్వారా పౌర సమాచార అధికారులకు అవగాహన పెంపొందించి చట్టంలోని సెక్షన్లు, పూర్తిగా వివరిస్తున్నామన్నారు ద్వారా కేసులను పూర్తిగా పరిష్కరించవచ్చన్నారు. అందరికీ సమాచారం అందించేందుకు ముందుకు రావాలన్నారు 22 జిల్లాల్లో 17 శాఖలు వచ్చే మార్చి లోపు అన్ని కేసులకు పరిష్కార మార్గాలు చూపి సమాచారం అందించే విధంగా చూస్తామన్నారు. మరుగున పడిన వ్యవస్థను నూతన ఉత్సాహంతో ముందుకు తీసుకువచ్చి ప్రజలకు జవాబు దారి తనం పెంచడంలో అవగాహన సదస్సు ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యే విధంగా అధికారులకు పలు ఆదేశాలిస్తూ సమావేశాలు నిర్వహిస్తూ శాఖల పూర్తి నిబంధనలను అనుసరిస్తూ ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు. అంతకుముందు మిగతా పౌర సమాచార కమిషనర్లు సమాచార హక్కు చట్టంపై నియమ నిబంధనలను పౌర సమాచార అధికారులకు సుదీర్ఘంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూఫ్రాన్ జయచంద్రారెడ్డి, జిల్లాలోని వివిధ శాఖల పౌర సమాచార అధికారులు, పోలీస్ యంత్రాంగం, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# అత్తను చంపిన అల్లుడు అరెస్టు రిమాండ్

- మీడియా సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం



**చేర్యాల, జూలై 29 (జనంసాక్షి) :** మద్దూరు మండలం మర్మాముల గ్రామ పరిధిలోని బంజరలో సోమవారం హత్య కలకలం రేపిన విషయం తెలిసిందే.. పిల్లను ఇచ్చిన అత్త వజ్రమ్మను అల్లుడు మహేష్, అతని తమ్ముడు హరీష్ కమ్మకత్తితో నరికి చంపిన కేసులో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు హుస్నాబాద్ ఏసీపీ సదానందం మంగళవారం మద్దూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హత్యకు గురైన వజ్రమ్మ అల్లుడు మద్దూర్ మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల మహేష్ సోమవారం రోజు అత్త వజ్రమ్మ తన భార్యతో కాపురం చేయనివ్వడం లేదని తన భార్య కాపురం చేయకుండా అత్త చెప్పే మాటలతో భార్య కాపురానికి రావడం లేదని అనుమానంతో అత్తపై కక్ష పెంచుకున్న జక్కుల మహేష్, అతని తమ్ముడు జక్కుల హరీష్లు కలిసి ఎలాగైనా అత్తను చంపితే కాపురం మంచిగా చేసుకోవచ్చని నిర్ణయించుకుని ఇద్దరు నిందితులు కమ్మకత్తి తీసుకొని తన అత్త గ్రామమైన బంజరు గ్రామానికి వెళ్లి అత్తతో మాట్లాడుతున్నట్లు నమ్మించి జక్కుల మహేష్ కత్తితో నరుకగా బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే చనిపోయింది. కేసు నమోదు చేసిన మద్దూర్ పోలీసులు, చేర్యాల సీఐ శ్రీను, మద్దూర్ ఎస్ఐ షేక్ మహబూబ్ ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి హత్యకు ఉపయోగించిన కమ్మ కత్తితో పాటు మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందని ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ.. కుటుంబాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి దరఖాస్తు ఇవ్వాలని కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. క్షణికావేశంలో దాడులు చేయడం చంపడం మంచి పద్ధతి కాదని సూచించారు.

# రోడ్డు విస్తరణ పనులకు అడ్డుకున్న రైతులు



**భూత్పూర్, జూలై 29 (జనంసాక్షి) :** భూత్పూర్ నుంచి శ్రీశైలం హైవే రోడ్డు విస్తరణ పనులకు అధికారులు చేపట్టిన సర్వే ను స్థానిక రైతులు అడ్డుకున్నారు. గతంలో మంజూరైన రోడ్డును గోప్లాపూర్ వద్ద 2.8 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులను రైతులు నిలుపుదల చేశారు. రోడ్డు విస్తరణలో కోల్పోయిన భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా 66 ఫీట్ల రోడ్డు అని %=ఉదీ% అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని వారు ఆరోపించారు. బాధితుల అభ్యర్థనలను అధికారులు పరిగణనలోకి తీసుకోకుండా రోడ్డు విస్తరణ పనులకు సర్వే చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో %=ఉదీ% అధికారులు సంధ్య,రాజేష్ ,రైతులు లక్ష్మారెడ్డి,మల్లేష్, భూపతి రెడ్డి, శ్రీనివాసులు, రవీందర్ తదితరులు ఉన్నారు.

# దాత సహకారంతో ముడుమాల్ పాఠశాలకు సీసీటీవీ సౌకర్యం

**కృష్ణ, జూలై 29 (జనం సాక్షి) :** కృష్ణ మండలం ముడుమాల్ పాఠశాలకు దాత సహకారంతో సి సి కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని మంగళవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి దాత కాద్రు అశోక్ కుటుంబ సభ్యులు,మండల విద్యాధికారి నిజాముద్దీన్, పిఆర్ టీయు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై. జనార్ధన్ రెడ్డి,మండల అధ్యక్షులు దండు శేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్పర్సన్ సాదు జయ మ్మ..ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్,బీజేపీ,బీఆర్ యస్ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాలలో చదువుల పండగ సందర్భంగా దాత కాద్రు అశోక్ ఇచ్చిన హామీ మేరకు తొమ్మిది సిసి టివీ కెమెరాలతో పాఠశాల మొత్తం కవర్ అయ్యే విధంగా ఏర్పాటు చేసి ప్రారంభించా రు. ఈ సదుపాయం వల్ల పాఠశాల యొక్క భద్రత, 281మంది విద్యార్థుల పర్యవేక్షణ సులభతరం కానుందని పాఠశాల పర్యవేక్షణ సులభతరం కానుందని మండల విద్యాధికారి నిజాముద్దీన్ పేర్కొన్నారు. పిఆర్ టీ యు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ హంగులతో బడిన అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తల్లిదండ్రుల, దాతల కృషిని కొనియాడారు. అదేవిధంగా అతిథులు మాట్లాడుతూ బడుగు బల హీన వర్గాల పిల్లలు చదువు కొనే ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో ప్రయివేటు బడులకు ధీటుగా తయారు చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ ని ప్రత్యేకంగా అభినందించారు. దాత కాద్రు అశోక్ మాట్లాడుతూ నేను చదువు కున్న పాఠశాలకు సహయ పడటం ఆనందంగా ఉందని అన్నారు. నా చిన్ననాటి జ్ఞాప కాలు ఈ పాఠశాలలో పదిలంగా ఉన్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి,రవికుమార్, ఆస్మానిషాత్ ,పద్మావతమ్మ, వాలంటీర్ శిరీష, పాఠశాల సిబ్బంది యండి సోఫీ, శివమ్మ, మధ్యాహ్న భోజన సిబ్బంది పద్మమ్మ, నర్సమ్మ, చాంద్బీ, సురేఖ మరియు గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, దండురాఘవేంద్ర, గడుగు వెంకటేష్, రాఘవేంద్ర గౌడ్, వాకిటి భీమశంకర్, కాద్రు తమ్మప్ప, మజీద్, కాద్రు బుడ్డప్ప, గట్టెపోల్ల బస్వరాజ్, కుర్వ బాల్ రాజ్, విద్యార్థుల రాము,ఏల్పేటి మారేప్ప,మంగలి చంద్ర శేఖర్,మంగలి రమేష్,తిప్పన్న,దూది రామప్ప,హన్మంతు,బాల్ రాజ్,దూది శేఖర్,ఏల్పేటి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజు,దిశ రిపోర్టర్ చెన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలకు పుట్టినిల్లు వనపర్తి

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు వాకిటి శ్రీధర్

**వనపర్తి, జూలై 29 (జనంసాక్షి) :** విద్యాపర్తిగా వెలుగొందుతున్న వనపర్తి పట్టణం క్రీడలకు పుట్టినిల్లుగా నిలుస్తోందని ఉద్బోధించారు. ఆగస్టు 3,4 తేదీలలో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను మంగళవారం స్థానిక డాక్టర్ బాలకిష్టయ్య స్మారక క్రీడా ప్రాంగణంలో డివైఎస్ఓ సుధీర్ కుమార్ రెడ్డితో కలిసి వాకిటి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ వనపర్తి మొదటి నుంచి కూడా క్రీడలకు పుట్టినిల్లు అని, ఆనాటి ప్రముఖ ఫిజికల్ డైరెక్టర్ నారాయణదాసు శిక్షణలో అనేకమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడలకు ప్రాతినిధ్యం వహించి గొప్ప కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టారని కొనియాడారు. ఈ గొప్పతనం నారాయణదాసుకే చెందుతుందని అన్నారు. మున్ముందు అదే పరంపర కొనసాగాలని, క్రీడలకు సంబంధించిన ఎలాంటి అవసరాలు సౌకర్యాలను సమకూర్చడంలో మా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. వెనకబడ్డ వనపర్తి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా క్రీడాకారుల దేహదారుడ్యాన్ని సాధించడంలో తల్లిదండ్రులు పిల్లలకు క్రీడాకారులకు పౌష్టిక ఆహారాన్ని అందజేయాలని, అప్పుడే వారు క్రీడల్లో రాణిస్తారని సూచించారు .జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మీ యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించి గెలుపు ఓటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు ఆగస్టు మాసంలో 3,4 తేదీలలో హనుమకొండలో జరుగు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ కొరకు స్థానిక డాక్టర్ బాలకృష్ణయ్య స్టేడియంలో జూనియర్, సబ్ జూనియర్ సీనియర్ సెలక్షన్ను నిర్వహించడం జరిగిందని అన్నారు. సెలక్షన్స్ నందు జిల్లా నలుమూలల నుండి దాదాపుగా 300 మంది అథ్లెటిక్స్ పాల్గొన్నారని, ఇంత పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొనడం సంతోషదాయకమని అన్నారు. క్రీడాకారులను వారి తల్లిదండ్రులను జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్లాల్ , జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్, పీడీలు మంజుల, రాధిక, సునీత ,యువరాజు, బసవరాజు ,మహేష్, శ్రావణ్, దామోదర్ స్వామి, రాజశేఖర్, నరేష్, రాజప్ప, నవీన్, తిరుపతి, జబ్బార్ ,అనిత తదితరులు పాల్గొన్నారు.



# బెట్టింగ్స్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలలో అవగాహన కల్పించండి

- జోగిపేట, వట్ పల్లి పోలీసు స్టేషన్ల ఆకస్మిక తనిఖీ
- ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (జనం సాక్షి) :** బెట్టింగ్స్, ఆన్లైన్ మోసాల పై ప్రజలలో అవగాహన కల్పించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట్, వట్ పల్లి పోలీస్ స్టేషన్ లను ఎస్పీ పారితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిశుభ్రత, స్టేషన్ రికార్డుల మెయింటెనెన్స్ పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్ లో ఉండాలని, ప్రతి ఫిర్యాదును క్లుప్తంగా విచారణ చేపట్టాలని అన్నారు. ఇన్వెస్టిగేషన్ లో ఎలాంటి సందేహాలున్న ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని ఎస్.హెచ్.ఓ లకు సూచనలు చేశారు. సిబ్బంది ప్రతి ఒక్కరు అన్నిరకాల విధులను చేయగలిగే విధంగా, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతను అందింపుచుకోవాలన్నారు. ప్రతిరోజు విజిబుల్ పోలిసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ మన చుట్టూ జరుగుతున్న నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. డయల్-100 కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలని, తొందరగా నేరస్థలానికి చేరుకున్నట్లయితే నేరం తీవ్రతను తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది, అధికారులు స్టేషన్ హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉండాలని దూరప్రాంతాలకు నుండి ప్రయాణం ప్రమాదకరం అన్నారు. నేరాల నియంత్రణ, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ.., స్వచ్ఛందంగా సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చేల చూడాలని, దాబాలు, పెట్రోల్ పంపులు, విద్యాసంస్థలలో సిసి కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా యాజమాన్యాలకు సూచించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు పంపిణీ

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- నర్సాపూర్ శాసన సభ్యులు సునీత లక్ష్మారెడ్డి

**చిలప్‌చేడ్, జూలై 29 (జనంసాక్షి) :** మండలంలోని శీలపల్లి రైతు వేదికలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి,సంబంధిత అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైనవారందరికి రేషన్ కార్డులు ఇచ్చే వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి, మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నదని అన్నారు. రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు నమోదు చేయించుకోవాలని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ఎవరైనా చనిపోయిన లేదా రేషన్ కార్డులలో పేర్లు తప్పుగా నమోదై ఉంటే స్వచ్ఛందంగా వారి పేర్లు తీసివేయించాలని కోరారు. నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డుల వల్ల అన్ని సంక్షేమ పథకాలకు అర్హులు అవుతారని, అంతేగాక సన్నబియ్యం పొందుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు రుణమాఫీ,సన్న వడ్లకు 500 బోనస్ మహిళా సంఘాలకు 20 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ ఐదు లక్షల వరకు మాత్రమే ఇచ్చింది మిగతా 15 లక్షల మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే మహిళా సంఘాలకు చెల్లించాలని సూచించారు మహిళా సంఘాలకు 20 నెలలకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించకుండా నాలుగు నెలలకు మాత్రమే చెల్లించిందని వాటిని కూడా త్వరగా చెల్లిస్తే బాగుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచినట్లు చేసిందని రైతు రుణమాఫీ సక్రమంగా చేయలేరని ఇప్పటివరకు రైతు రుణమాఫీ జరిగిన రైతులు 40 శాతం మాత్రమే లబ్ధి పొందారని మిగతా 60 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ పూర్తి కాలేదని ఈ 60 శాతం మంది రైతులకు ప్రభుత్వ అధికారులు ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా ఆధార్ తప్పుగా నమోదయిందని లేదంటే అకౌంట్ నెంబర్ లేదా రేషన్ కార్డు లేదని సాకులు చెబుతూ మిగతా 60 శాతం మందికి రుణమాఫీ చేయలేదని నిలదీశారు రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉన్న ప్రభుత్వం త్వరగా రైతు రుణమాఫీని సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. రవాణా సౌకర్యం కోసం ప్రతి పల్లెకు బస్సులను నడపాలని గుర్తు చేశారు వర్షాకాలం ప్రారంభమైన గ్రామాలలో పారిశుద్ధానికి నోచుకోలేకపోయాయని ప్రభుత్వ అధికారులు కలెక్టర్ ఉన్నత అధికారులు చొరవ తీసుకొని గ్రామాలలో మురికి కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లే విధంగా చూడాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మైపాల్ రెడ్డి తాసిల్దార్ సహదేవ్ ఎంపీడీవో కరీముల్లా ఏపీవో శ్యాం కుమార్ ఆర్ఐలు సునీల్, వెంకటేశం సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.




# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్ సునీత



**చారకొండ, జూలై 29 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మంగళవారం నాడు స్థానిక తాసిల్దార్ సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సునీత మాట్లాడుతూ. పాఠశాల రికార్డ్స్ ను,పాఠశాలలో టీచర్స్ అటెండెన్స్, మెనూ రిజిస్టర్, విద్యార్థుల క్లాస్ అబ్జర్వేషన్, విద్యార్థులు రాసిన నోట్ బుక్స్ ను చెక్ చేయడం జరిగింది. పదవ తరగతి విద్యార్థుల సిలబస్, వారు రాసిన నోట్ బుక్స్ ను పరిశీలించి తగు సూచనలు చేసి ఉన్నత చదువులు చదువుకొని గొప్పవాళ్ళు కావాలని మీ పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించి శుభ్రత పాటించాలని మంచి భోజనం అందించాలని కుకింగ్ సెక్షన్ వారితో మాట్లాడి వంట పరిశుభ్రంగా చెయ్యాలని వంటకు ఉపయోగపడే వస్తువులను వాటి యొక్క వస్తువుల నాణ్యతను ఆమె పరిశీలించారు. శుభ్రత పాటించాలని మధ్యాహ్నం భోజనం అందించాలని వారితో మాట్లాడి వంట పరిశుభ్రంగా ఉంచాలని తాసిల్దారు సునీత సూచించారు. విద్యార్థుల విషయాలలో తగు జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు చేశారు.

# దేశ భవిష్యత్తు దశ దిశను మార్చేది విద్యనే..

- జిల్లాలో ఉత్తమ పిఎం శ్రీ స్కూల్‌గా బండారుపల్లి, టిజి మోడల్ స్కూల్ ఎంపిక
- శిలాఫలకం ఆవిష్కరణ
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు ప్రతినిధి, జులై 29 (జనంసాక్షి) : దేశ భవిష్యత్తు దశ దిశను మార్చేది విద్యనే అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం బండారుపల్లి, టిజి మోడల్ స్కూల్ పియం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ జిల్లాలో ఉత్తమ పియం శ్రీ స్కూల్ గా ఎంపిక కావడం వలన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌తో కలసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య పట్ల సానుకూల శక్తితో ముందుకు వెళ్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో ఎదగడానికి అదేవిధంగా ఐఏఎస్, ఐపీఎస్ కావాలన్నా మంచి కలలను కనాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. విద్యార్థి, విద్యార్థినిలు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం ఉందని, ప్రతి విద్యార్థి శ్రద్ధ, నిబద్ధత, క్రమశిక్షణతో ఎన్ని సమస్యలు వచ్చిన వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఉందని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కూడా మీపై ఉందని విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ తెలిపారు. పాఠశాల కోసం విడుదలైన నిధులను విద్యార్థులు చదువులో అతున్నత ప్రతిభ ప్రదర్శించడానికి, సృజనాత్మక పెంపొందించుకోవడానికి ఉపయోగించుకోవాలని కోరారు. పియం శ్రీ పథకంలో భాగంగా టిజి, మోడల్ స్కూల్ కి విడులైన నిధులను పాఠశాల అవసరాలకు అత్యుత్తమంగా ఖర్చు చేసి జిల్లాలో ఉత్తమ పాఠశాలగా నిలిచినందుకు పాఠశాల ప్రిన్సిపల్ కి, అధ్యాపక బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా స్వయంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఉండడం వల్ల విద్యాశాఖకు అత్యధిక నిధులు కేటాయిస్తు న్నారని, ఇది మనలాంటి వెనుకబడిన ప్రాంతాలలో విద్యా అబివృద్ధికి, విద్యార్థులకి చాలా ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పియం శ్రీ పథకంలో భాగంగా పాఠశాలకు మంజూరు అయిన సంగీత పరికరాలను కలెక్టర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ తో కలసి విద్యార్థులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సింగారం దేవకి, మండల విద్యాధికారి తిరుపతి, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్ అర్షం రాజు, పాఠశాల అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రథమ ధ్యేయం

- లింగాల మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన
- పీహెచ్సి, జీడికల్ హై స్కూల్, అంగన్వాడీ కేంద్ర, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన
- జనగామ లోని ఫర్టిలైజర్ షాప్ తనిఖీ



జనగామ ప్రతినిధి, జూలై 29 (జనంసాక్షి) : ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించి మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యాధికారుల మీద ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మంగళవారం లింగాల గణపురం మండలంలో కలెక్టర్ పలు ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా పీహెచ్సీ ని సందర్శించి ఓపీ, అటెండెన్స్ తదితర రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించి... సీజనల్ వ్యాధుల మీద రివ్యూ తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాపిడ్ ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల విషయం లో చిన్న పిల్లల కు సంబందించిన మరింత అలర్ట్‌గా ఉండాలన్నారు. ప్రతీ ఓపి పెషేంట్ కి ముందస్తుగా పరీక్షలు తప్పకుండా చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య పరీక్షలు జరగాలన్నారు. ఫీవర్ సర్వే గురించి అక్కడి సిబ్బందిని అడిగి టీ హబ్ కి వెళ్లే ప్రతి శాంపుల్‌కు సంబంధించి రికార్డు మైంటైన్ చేయాలని సూచించారు. టీబి ముక్త్ భారత్ అభియాన్ గురించి అడిగి తెలుసుకోని ఎక్స్‌రే పరీక్షలు పెంచాలని సూచించారు. డెలివరీస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అయ్యే విధంగా చూడాలని అక్కడ సిబ్బందికి సూచించారు, అలాగే సాధారణ ప్రసవాలు పెంచాలని సూచించారు. క్లిష్టతరమైన డెలివరీలను ఎంసిహెచ్ సెంటర్ కి రిఫర్ చేయాలన్నారు. హెల్త్ సూపర్వైజర్ లింగాల ఘన్పూర్ గైర్హాజరు ను, తీవ్రంగా పరిగణించి అట్టి ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. రోగుల ఆరోగ్యమే కాకుండా తమ ఆరోగ్యం కూడా కాపాడుకోవాలని వైద్య సిబ్బందిని సూచించారు అలాగే ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం జీడికల్ హై స్కూల్‌ని సందర్శించి.. టీచర్ల అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించి...10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. క్లాస్ ఎలా అవుతున్నాయి... సిలబస్ ఎక్కడి వరకు వచ్చిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రానికి కలెక్టర్ వెళ్లి... చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం అదే గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామ శివారులో.. పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్లు టంగ్ (నీలి నాలిక వ్యాక్సినేషన్ )వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పది రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో.. 1,68,700 గొర్రెలకు టీకా వేయనున్నట్లు తెలిపారు. షీప్ సొసైటీ కి కావలిసిన కనీస అవసరాలను తీరుస్తామన్నారు. చివరగా జనగాం లోని ఆగ్రోస్ 3 ఫర్టిలైజర్ షాప్ ను సందర్శించి.. స్టాక్ రిజిస్టర్ అమ్మకాల రిజిస్టర్ను పరిశీలించారు. ఎంత యూరియా నిల్వలు ఉన్నాయి.. ఎంత అమ్మారు..ఇప్పటివరకు ఎంత అమ్మారు అని షాప్ యాజమాని ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. యూరియా అమ్మకం వివరాలు పక్కాగా ఉండాలని.. రైతు ఫోన్ నెంబర్ తో సహా అంత సమాచారం ఉండాలన్నారు.



# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

కాళేశ్వరం, జూలై 29 (జనంసాక్షి) : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం కాళేశ్వరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కాళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు కోలా శాన్వి, గంట హరిచందన, నాగుల తులసి రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికైన సందర్భంగా శాలువాతో సన్మానించారు. జూలై 1న హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాల్గొన్న మన జిల్లా నుండి విద్యార్థులు ఎంపికకావడం పట్ల ఆయన అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కాళేశ్వరం గ్రామానికి చెందిన ఈ ముగ్గురు విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగాల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి

- విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




ములుగు ప్రతినిధి, జులై 29(జనంసాక్షి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పేర్కొన్నారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలిసి నిర్వహించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ హాస్టళ్లను సందర్శిస్తున్నామని, హాస్టల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో బోర్ల మంజూరు అసలైన లబ్దిదారులకు అందించామని అన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కేంద్రం లో అంబేద్కర్ కమ్యూనిటీ భవన నిర్మించాలని సభ్యులు కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరగా, రేపటి సమాజ నిర్మాతలైన యువత డ్రగ్ మహమ్మారి భారిన పడకుండా కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, డ్రగ్స్ నిర్మూలనకై అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ అన్నారు. డిఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జొన్న రవి, సునర్కని రాంబాబు, మురకుంట్ల నరేందర్, చింత కృష్ణ, బానోతు రాము నాయక్, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలతో కలిసే పాలన నిజమైన ప్రజా పాలన

**మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి**

చెన్నూర్, జూలై 29 (జనంసాక్షి) : ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా డాక్టర్ వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను, రేషన్ కార్డులను అందించి పేద ప్రజల కుటుంబాల భద్రత అభివృద్ధి కోసం అంకితభావంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పలువురు లబ్ధిదారులు సమస్యలు పరిష్కరించాలని కోరిన వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. ప్రతి పౌరుడికి హక్కుగా రావలసిన పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత ప్రజలతో కలిసే పాలన అదే నిజమైన ప్రజాపాలన అని కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు తొలగించారని నిరసన



చెన్నూర్, జులై 29 (జనంసాక్షి) : భీమారం మండలంలోని పోలంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో నుండి పేర్లు తొలగించారని గడ్డి మందు డబ్బాతో నక్క రమేష్, సుందిళ్ల వెంకటేష్ ఆందోళనతో నిరసన చేపట్టారు. స్థానిక గ్రామపంచాయతీ ప్రాంగణంలో గ్రామ కార్యదర్శి తో వివాదానికి దిగారు. తమకు రావలసిన ఇందిరమ్మ ఇల్లు జాబితాలో నుండి పేర్లు తొలగించారని ఎంపీడీవోని అడిగితే మంత్రి పిఏని అడుగుమని అంటున్నారని, ఒకవేళ న్యాయం జరగకపోతే గ్రామపంచాయతీ ముందే మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

# అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం



భూపాలపల్లి, జూలై 29 (జనంసాక్షి): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం ఉదయం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 20, 21 వార్డులు హనుమాన్ నగర్, శాంతినగర్ తదితర వార్డులల్లో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఇతర శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జీఎస్సార్ పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వారి సమస్యలతో కూడిన దరఖాస్తులను ఎమ్మెల్యేకు ఇవ్వగా, వారి సమస్యలను వింటూ కాలనీల్లో కలియతిరిగారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని ఎమ్మెల్యే అన్నారు. కాలనీల్లో ముఖ్యంగా తాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో నెలకొన్న విద్యుత్, పారిశుధ్య సమస్యలను అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఓసీ-2తో ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడి పలువురి ఇళ్లు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వారికి వెంటనే పరిష్కార మార్గం చూపాలని సింగరేణి జీఎం, ప్రాజెక్టు ఆఫీసర్ కు ఎమ్మెల్యే సూచించారు.

**నాగుల పంచమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్**

మహిళలు అత్యంత పవిత్రంగా కొలిచే నాగుల పంచమి భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా నాగదేవత ఆలయాలు, పుట్టల వద్ద మహిళలు పాలుపోయడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా, భూపాలపల్లి లోని హనుమాన్ ఆలయం లో ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగదేవత విగ్రహానికి పాలు పోశారు. ఆ నాగేంద్రుడి దివ్యమైన ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రార్థించారు. అనంతరం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొత్తపల్లిగోరి మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన మొత్తం 10 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరీ పత్రాలను అందజేశారు.

# ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులను స్టాక్ బోర్డుల్లో ప్రదర్శించాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ రూరల్, బ్యూరో, జూలై (జనంసాక్షి) : ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలన్నీ రైతులకు తెలిసేలా స్టాక్ బోర్డుల్లో ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం మామడ మండలంలో గల గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా దుకాణానికి సంబంధించిన వివరాలు కంప్యూటర్లో పరిశీలించారు. క్రయ విక్రయాలకు సంబంధించి రసీదు పుస్తకాలను తనిఖీ చేశారు. దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా, ఎరువులు, ఇతర పురుగుల మందుల వివరాలను ఎరువుల దుకాణ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసే నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. రైతులకు వారు వేసిన పంటను బట్టి, భూసారాన్ని బట్టి తగిన మోతాదులో అవసరమైనన్ని ఎరువులను ఇవ్వాలన్నారు. జిల్లాలో తగినంత యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా, ఇతర ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలన్నీ జాగ్రత్తగా పొందుపరచాలని సూచించారు. గడువు ముగిసిన పురుగుల మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించవద్దని తెలిపారు. ఈ తనిఖీలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సిల్లో డాక్టర్లు అందుబాటులో ఉండాలి

**ఏఎన్ఎం.. ఆశ వర్కర్లు సమయపాలన పాటించాలి**

**మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలి**

**చెరువుల సమీప ప్రాంతాల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ ప్రతినిధి, జులై 29 ( జనంసాక్షి): ఈ వర్షాకాలం సీజన్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంగెం మండలం కాపుల కనపర్తి, పి హెచ్ సి, గవిచెర్ల ఇందిరమ్మ ఇండ్లు, నెక్కొండ మండలం అప్పలరావుపేట్ ఊర చెరువు, వెంకటాపూర్ పెద్ద చెరువులను, నెక్కొండ జిల్లా పరిషత్ హై స్కూల్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ తనిఖీలో డాక్టర్స్ ఏఎన్ఎం విధులకు ఆలస్యంగా రావడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సిలో కాలం చెల్లిన మందులు ఉండడం పట్ల డాక్టర్ పై చర్యలు తీసుకోవలసిందిగా డిఎం అండ్ హెచ్ ఓ సాంబశివరావు ను ఆదేశించారు. గవి చర్ల లో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇందిరమ్మ యాప్ లో లబ్ధిదారుల ఇండ్లకు చెల్లించవలసిన రూపాయల మంజూరుకు విడతల వారిగా అప్లోడ్ చేసే ప్రక్రియ ను స్వయంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నెక్కొండ మండలం అప్పలరావుపేట్ ఊర చెరువు, వెంకటాపూర్ పెద్ద చెరువు ప్రాంతాల్లో గతంలో ఆర్టీసీ బస్సు వరదలో చిక్కిన ప్రాంతాన్ని తనిఖీ చేశారు. చెరువుల చుట్టుప్రక్కన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 3424 కు సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అనంతరం నెక్కొండ జిల్లా పరిషత్ హై స్కూల్ లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం తయారు చేయడం లేదని జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు కారణమైన ఇన్చార్జి టీచర్ పై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మధ్యాహ్నం భోజనం చేశారు. 8, 9 ,10వ తరగతి విద్యార్థుల ఇంగ్లీష్,హిందీ, తెలుగు భాషల పాఠ్యాంశాలను విద్యార్థులచే చదివించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. టీచర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు.విద్యార్థుల హెల్త్ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య వివరాలు నమోదు చేసే హెల్త్ కార్డ్స్ లను ఇవ్వాలని డిఎంహెచ్ ఓకు సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలను అలవాటు చేయడంలో వారంలో ఒక రోజు ఒక భాష మాట్లాడే విధంగా ప్రణాళికలు చేసినచో పిల్లలకు లాంగ్వేజ్ పైన పట్టు సాధించగలుగుతారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నెక్కొండ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామి రెడ్డి , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాంబశివరావు, నెక్కొండ తహసిల్దార్ ఎంపీడీవో లు, నెక్కొండ ఎంఈఓ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



పరకాల, జులై 29 (జనం సాక్షి): ఎరువుల దుకాణాల యజమానులు ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. మంగళవారం రోజున పరకాల పట్టణంలోని పిఏసిఎస్ మాదారం ఎరువుల గోదాం, రాఘవేంద్ర ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, కొనగోల్ల రిజిస్టర్ లను పరిశీలించారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సబ్సిడీ ఎరువులను దారి మళ్లించిన బ్లాక్ మార్కెట్కు తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ అధికారులు నిరంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాలన్నారు. ఈ సందర్భంగా మాదారం సొసైటీ చైర్మన్ నల్లెల లింగమూర్తి సొసైటీలో ఎక్కువ గ్రామాలు ఉన్నందున అదనంగా 300 టన్నుల యూరియాను కేటాయించాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ జ్యోతి, సీఈవో రాజేందర్, ఏఈఓ శైలజ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
30 జూలై 2025

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తున్నాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**నల్గొండ బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి నల్గొండ జిల్లా, పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడినప్పుడు రాష్ట్రంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉండేవని, రెండు కోట్ల 80 లక్షల మంది సభ్యులు ఉండేవారని, ఆ సంఖ్య ఇప్పుడు 97 లక్షలకు పెరిగిందని, మూడు కోట్ల 15 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు.సమాజంలో ఎక్కువ శాతం మంది పేద ప్రజలకు కడుపునిండా అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోనే కొత్తగా 10,800 రేషన్ కార్డు ఇస్తున్నామని, 52,000 మందికి కొత్తగా లబ్ధిదారులను చేర్చడం జరిగిందని తెలిపారు. అర్హులైనవారందరికి రేషన్ కార్డులు ఇచ్చే వరకు ఇది కొనసాగుతుందని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గత 3 సార్లు గరిష్ట స్థాయికి నీరు చేరడం అదృష్టం అని అన్నారు. వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ సమన్వయంతో గత యాసంగి, వానకాలం కలిపి రెండు కోట్ల 81 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించడం జరిగిందని, భారత దేశంలో ఇప్పటివరకు ఇంత పంట పండలేదన్నారు. పంట పండించడమే కాకుండా ప్రతి గింజ కొంటున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో నాగార్జున్ సాగర్ ప్రాజెక్టు గొప్పదనాన్ని మర్చిపోలేమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయలేదని అన్నారు. నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల 65,398 రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా 62,155 ఇచ్చామని, నాగార్జునసాగర్ నియోజక వర్గంలో కొత్తగా 10,747 కార్డులు ఇవ్వడం సంతోషమని, రేషన్ కార్డుల వల్ల అన్ని సంక్షేమ పథకాలకు అర్హులు అవుతారని, అంతేగాక సన్నబియ్యం పొందుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత పవర్, అలాగే రైతు రుణమాఫీ, రైతుభరోసా వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోలేదని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పెద్దవూర మండలంలోని 1,200 కొత్త కార్డులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. రేషన్ కార్డు స్కాలర్షిప్స్, పాఠశాలలు, ఆరోగ్య విషయాలకు లబ్ధి పొందేందుకు ప్రయోజనం చేకూరుస్తుందని, రేషన్ కార్డు నిరంతర ప్రక్రియ అని, చనిపోయిన వారి పేర్లు తొలగించడం, కొత్తవారిని ఎక్కించడంలో ప్రజలు సహకరించాలని, త్రిపురారం, పెద్దవూర మండలాలలో ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తుల సమర్పణలో తప్పిపోయిన గ్రామాల్లో త్వరలోనే సరి చేస్తామని, ధాన్యం కొనుగోలులో పెద్దపురం మండల పిఎసిఎస్ జిల్లాలోని మూడవ అతిపెద్ద కేంద్రంగా నిలిచిందని, సన్న బియ్యం లో సైతం పెద్దవూర రెండవ స్థానంలో ఉందని, రేషన్ కార్డు రాని వారికి వారంలో ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లింగారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- భవిష్యత్ మార్గాలకు విద్యార్థి దశే కీలకం
- ఉన్నత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి
- శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 29 (జనంసాక్షి) :** వనపర్తి మండలం చిట్యాలలో గల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల పీఎం శ్రీ నిర్వహణలో జాతీయస్థాయిలో బెస్ట్ పాఠశాలగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంగళవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఎడ్యుకేషనల్ పాలసీ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై పోయిందని నేను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో పటిష్ట పరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మునిపెన్నడూ లేని విధంగా పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తువులు నెలరోజుల ముందే పాఠశాలలకు చేరాయన్నారు. అదేవిధంగా వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు 40 శాతం మెస్ ఛార్జీలు పెంచి విద్యార్థుల ఇబ్బందులను తొలగించిందని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాల నిర్వహణలో జాతీయస్థాయిలోనే మంచి గుర్తింపు పొందేందుకు కృషిచేసిన పాఠశాల ప్రశంసించారు. పాఠశాల సమస్యలను పరిష్కరిస్తామని అత్యవసరంగా రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డీఈఓ అబ్దుల్ గని, పాఠశాల ప్రిన్సిపాల్ గురువయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిచరణ్ రెడ్డి, రఘుపతిరావు, బి. కృష్ణ, శంకర్ నాయక్, నాగవరం యాదయ్య, వాల్య నాయక్, ఎత్తం రవికుమార్, కర్ణాకర్, వెంకటేష్, కుమార్, నరసింహ, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ భాషలపై ప్రావీణ్యం సంపాదించాలి


- భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్



**రాజేంద్రనగర్, జూలై 29 (జనంసాక్షి) :** పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు కేవలం మాతృభాషనే కాకుండా అంతర్జాతీయంగా ఉండే అన్ని భాషల మీద ప్రావీణ్యం సంపాదించాలని భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నారు. మంగళవారం శంషాబాద్ మండలం ముచింతల్ గ్రామంలోని జూపల్లి బాలమ్మ మెమోరియల్ మండల పరిషత్ హై స్కూల్ మైల్ స్టోన్ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి కపిల్ దేవ్ తో పాటు, ఆర్టిసి ఎండి సజ్జనార్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కపిల్ దేవ్ మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాష నే కాకుండా అంతర్జాతీయ భాషల పై పట్టు సాధించాలని ప్రపంచ స్థాయిలో జరిగే ఎలాంటి పోటీలోనైనా సునాయాసంగా విజయం సాధించవచ్చునని రుజువు చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు అలాగే క్రీడలో ప్రావీణ్యం పొందే విద్యార్థులకు తాను ఆర్థికంగా సహాయం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. తన కృషి ఫౌండేషన్ తో పాటు జూపల్లి కుటుంబానికి చెందిన మై హోమ్స్ ఫౌండేషన్ వారు ముందుకు వచ్చి ఈ పాఠశాల ఏర్పాటుకు సహకరించడంతో పాటు అన్ని రకాలుగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యా ప్రాప్తి ఎక్కువగా జరగడానికి తోడ్పడుతూ అందించడం ఎంతో ప్రశంస నీయమన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి విద్య ఎంతో అవసరమని విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు ఎదగాలంటే విద్య ఎంతో అవసరం అని ఆ విద్యను ఈ పాఠశాలలో తప్పకుండా నేర్చుకుంటారని తాను పూర్తిగా విశ్వసిస్తున్నట్టు తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున ఒక ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుచేసిన రామేశ్వర్ రావుని ఆయన సోదరుడు జగపతి రావు తో పాటు ఖుషి ఫౌండేషన్ చైర్మన్ భారత మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్‌ల కృషి అనితర సాధ్యమని ఆయన కొనియాడారు. ఈ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం తరఫున కృషిచేసిన డీఈవో సుశీందర్ రావు,ఎంఈఓ లక్ష్మణ నాయక్ లకు ఆయన ప్రశంసించారు. మై హోమ్ వైస్ చైర్మన్ జూపల్లి జగపతి రావు మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటు జరగడం చేరిన విద్యార్థులంతా మంచిగా విద్యను అభ్యసించడం ఇతర ప్రాంతాల్లోని విద్యార్థులంతా ఈ పాఠశాలలో చేరడానికి ఉత్సాహం చూపుతూ అడ్మిషన్లు తీసుకోవడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన కపిల్ దేవ్ సజ్జనార్ తో పాటు ఇతర ప్రముఖులను పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను కనీసం ఇద్దరు ముగ్గురు చొప్పున దత్తతకు తీసుకొని వారి విద్యాభ్యాసానికి ఖర్చులను స్కాలర్షిప్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముచ్చింతల సర్పంచ్ వద్దే సుజాత చంద్రయ్య, ఉప సర్పంచ్ గండు రాజు, మాజీ సర్పంచ్ పెంటయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతున్న సమాచార హక్కు చట్టం

- ప్రభుత్వ కార్యాలయాలో కనిపించని బోర్డు
- మండలంలో కొన్ని ప్రదాన కార్యాలయాలో సమాచార హక్కు చట్టం బోర్డు లేవీ
- చెత్తలో పడి ఉన్నా తహాశీల్దార్ కార్యాలయం బోర్డు




**చందంపేట, జూలై 29 (జనం సాక్షి) :** చందంపేట మండలాల్లోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అధికారులకు సంబంధించిన సమాచారం లేకుండా పోతున్నది. ఒకవేళ ఉన్నా పాత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ఉంటున్నాయి. అధికారులు మారినా.. బోర్డులను మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వ సంస్థల్లో పారదర్శకతను, ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచడమే ఉద్దేశంగా సమాచార హక్కు చట్టం. అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతుంది. కార్యాలయాల్లో బదిలీ అయిన అధికారుల పేర్లు, మరికొన్ని కార్యాలయాల్లో అధికార పేర్లు లేకుండానే బోర్డులు దర్శనమిస్తున్నాయి. సమాచారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే ఎవరికి దరఖాస్తు అందజేయాల్లో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. స.హ హక్కు చట్టం ప్రకారం అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేసి దానిపై సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు రాయించి ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. కానీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నిర్లక్ష్యంతో చందంపేట మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో స.హా చట్టం బోర్డులేవి కనిపించడం లేదు కనిపించిన కార్యాలయాల్లో బదిలీ అయిన అధికారుల పేర్లు, మరికొన్ని కార్యాలయాల్లో అధికార పేర్లు లేకుండానే బోర్డులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే తహసీల్ కార్యాలయంలో స.హచట్టం బోర్డు ఉన్నా చెత్త లో పడేశారు. అందులో కూడా బదిలీ అయిన అదికారుల పేర్లు కనిపిస్తున్నాయి. ఎవరికి దరఖాస్తు చేయాలో తెలియక దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారిందని మండలంలో ఆరోపణలు వస్తున్నాయి. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అప్పీల్ స్వీకరించే అదికారి ఉద్యోగ విరమణ పొందిన అదికారి పేర్లు ఉంటున్నాయి. ప్రాథమిక పశువు వైద్య కేంద్రంలో అధికారుల పేర్లు లేకుండానే బోర్డు కనిపిస్తుంది. కానీ మండల అధికార యంత్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స.హ. చట్టం బోర్డులు ఏర్పాటు చేసి సామాన్యులను చైతన్యవంతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేయాలి

- సమాజంలో వ్యక్తి కన్నా హెూదాకే ఎక్కువ ప్రాధాన్యత
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**చిలుకూరు, జూలై 29 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని జెడ్.పి.హెచ్.ఎస్, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మరియు పశు వైద్యాశాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకొన్ని దాన్ని సాధించుటకు కృషి చేయాలని అన్నారు. గత సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ చూపెట్టిన విద్యార్థులకి బహుమతులు ఇచ్చామని ఈ సంవత్సరం కుడా ఇస్తామని బాగా చదువుకొని జీవితంలో స్థిర పడాలంటే పదవ తరగతి మొట్ట మొదటి మైలురాయి అని అన్నారు. తెలుగు, ఇంగ్లీష్ బాషలపై పట్టు సాధించి తదుపరి భవిష్యత్ కొరకు మ్యాథ్స్, సైన్స్ ను బాగా చదివి పదవ తరగతిని జీవితంలో టర్నింగ్ పాయింట్ గా మలుచుకోవాలన్నారు. ఆధునిక సాంకేతికత యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ పై, సాఫ్ట్ వేర్ ఉద్యోగాల పై ప్రాథమిక అవగాహన కోసం పాఠశాలకి కంప్యూటర్ ల్యాబ్ త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. భవిష్యత్ లో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకొని పదిమందికి సహాయం చేయాలని ఆకాక్షించారు. జిల్లా కలెక్టర్ నందలాల్ అంగన్వాడీ కేంద్రం నందు పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లల పేర్లు అడిగి తెలుసుకున్నారు. ధరణి అనే పాప తెలంగాణ లోని 33 జిల్లాల పేర్లు కలెక్టర్‌కి వివరించగా కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణీల వివరాలు అడిగి తెలుసుకొని ప్రభుత్వ హాస్పిటల్ లోనే ప్రసవాలు అయ్యేలా చూడాలని తెలిపారు. ఒ.పీ రిజిష్టర్, ఏ.ఎన్.సి రిజిష్టర్ పరిశీలించారు. అనంతరం పశు వైద్యశాలని సందర్శించి వర్షాకాలంలో పశువులకి వాక్సిన్స్ లు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎం.పి.డి.ఓ గిరిబాబు, ప్రధాన ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ఆయుష్ డాక్టర్ సుశీల, స్టాఫ్ నర్సు రజని, పంచాయతీ కార్యదర్శి షరీఫ్, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## శాసనసభాపతిని కలిసిన మాజీ కౌన్సిలర్ పరిమళ



**తాండూరు, జూలై 29 (జనంసాక్షి) :** అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను తాండూర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పరిమళ రవిందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించేందుకు కలికట్టుగా కృషి చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటింటి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదంఖా మోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు తదితరులు ఉన్నారు.

# కైదమ్మకుంట చెరువును సుందర శోభితంగా తీర్చిదిద్దుతా...

- వర్షాకాలంలోపు కైదమ్మ కుంట చెరువు పనులను పూర్తి చేయండి...
- ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదేశం



**శేరిలింగంపల్లి, జూలై 29 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో సహజసిద్ధమైన, ప్రధాన నీటి వనరుగా బాసిల్లుతున్న కైదమ్మకుంట చెరువును సుందర శోభితంగా తీర్చిదిద్దడంతోపాటు పూర్తి పరిరక్షణకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని, అన్ని రంగాలలో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న కైదమ్మకుంట చెరువును శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు నెక్సెస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ప్రతినిధులు సోషల్ కార్పొరేట్ రెస్పాన్సిబుల్(సి.ఎస్.ఆర్) పథకం కింద కైదమ్మకుంట చెరువు అభివృద్ధి పనులను, మంగళవారం ఆయన ఇరిగేషన్, జలమండలి విభాగం అధికారులు, శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ తోకలిసి అరికెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో హాఫీజ్పేట్ డివిజన్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా... పచ్చదనం ఉట్టిపడేలా, పూదోటలతో ఎంతో సుందర రమణీయంగా హాఫీజ్పేట్ డివిజన్ పరిధి కైదమ్మకుంట చెరువును తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమని అరికెపూడి గాంధీ అన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ పరిశ్రమ స్వచ్ఛందంగా చేపడుతున్న కైదమ్మకుంట చెరువు అభివృద్ధి పనులను కంపెనీ ప్రతినిధులు సామాజిక సేవా కోణంలో ముందుకు వచ్చి నిధులను వెచ్చించి చెరువు అభివృద్ధి, పునర్జీవ పనులను చేపట్టడానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. కైదమ్మకుంట చెరువు సుందరీకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నట్లు ఆయన వివరించారు. చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే చెరువు దశ దిశ మారనుందని, చెరువుభూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించే బాధ్యతను తాను స్వయంగా తీసుకోవడం జరిగిందన్నారు. కైదమ్మకుంట చెరువు సుందరీకరణ పనులను చేపట్టడానికి సహకరించటం ద్వారా తిరిగి పూర్వవైభవాన్ని సంతరింపజేసుకునేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. సామాజిక సేవలో మరిన్ని కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు ముందుకు వస్తే శేరిలింగంపల్లిని మరింతగా ప్రగతి పథంవైపు మళ్లిస్తానని అరికపూడి ధీమాను వ్యక్తం చేశారు. చెరువు సుందరీకరణ క్రమంలో చెరువుకట్టలు మరింత దృఢంగా నిర్మించడానికి నేటిపారుదల శాఖ అధికారులు పకడ్బందీ వ్యూహంతో వ్యవహరించాలని, కైదమ్మకుంట చెరువులోకి మురుగు నీటిని రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు చుట్టూ భూగర్భ డ్రైనేజీ మురుగునీటి కాలువను నిర్మించాల్సిన అవసరం ఉందని, చెరువు అలుగు మరమ్మత్తులు, ఇతర పునరుద్ధరణ పనులు వీలైనంత త్వరలో అభివృద్ధిపరిస్తే ఓవైపు మురుగునీరు, అనారోగ్య సమస్య సమసిపోయి ఆహ్లాదకరమైన చెరువుతోపాటు మార్నింగ్ వాక్ ట్రాక్, ఇతర ఆరోగ్య ప్రదాత కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని అరికెపూడి భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ విభాగం డిఇ నళిని, ఏఇ శ్రీనివాస్, సిఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సమావేశ పోస్టర్ ఆవిష్కరణ

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హయత్‌నగర్, జూలై 29 (జనంసాక్షి) :** తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8 వ వార్షిక సమావేశం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, హిస్టరీ కాంగ్రెస్ ప్రతినిధులతో కలసి పాంప్లెట్, బ్రోచర్, పోస్టర్ లను వారి కార్యాలయం లో ఆవిష్కరించారు. 2025 ఆగస్టు 7, 8 తేదీ లలో హైదరాబాద్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం పాలిత), విద్యానగర్ లో జరగనున్న సమావేశానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హిస్టరీ కాంగ్రెస్ ప్రతినిధులు మాట్లాడుతూ అంతర్జాతీయ, దేశ వ్యాప్తంగా ప్రముఖ చరిత్రకారులు ఈ వార్షిక సమావేశంలో పాల్గొని తెలంగాణ చరిత్రను విశ్లేషిస్తూ పత్రాలు సమర్పిస్తారని వారు తెలిపారు. తెలంగాణ చరిత్రను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని వారు తెలియజేశారు. హయత్‌నగర్, కామారెడ్డి, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ కార్యక్రమానికి తమ అభినందనలు తెలియజేసి, పూర్తి సహకారాన్ని ప్రకటించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అంకం జయప్రకాశ్, కోశాధికారి డాక్టర్ బండి శ్రీనివాస్, ప్రొఫెసర్ ఈశ్వర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విపణి

# మళ్లీ జోరందుకున్న మార్కెట్లు



## రియల్టీ, ఫార్మా అండతో లాభాల్లో ముగిసిన సూచీలు

**జనంసాక్షి:**దేశీయ మార్కెట్లు మంగళవారాన్ని లాభాలతో ముగించాయి. వరుసగా మూడురోజులుగా కొనసాగుతోన్న నష్టాలకు నేడు బ్రేక్ పడింది. రియల్టీ, ఫార్మా రంగాలు సూచీలకు అండగా నిలిచాయి.ఈ ఉదయం 80,973.25 వద్ద సెన్సెక్స్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,665కు తగ్గి.. చివరకు 446 పాయింట్లు పుంజుకొని 81,328 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల లాభంతో 24,821 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 15 పైసలు తగ్గి 86. 82 గా ముగిసింది. నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, లార్సెన్, రిలయన్స్, ఆసియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్ రాణించగా.. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టైటాన్ కంపెనీ షేర్లు కుదేలయ్యాయి. ఐటీ, లోహ, రియల్టీ రంగాల్లో కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి కనబర్చడం ఈ లాభాలకు కారణమైంది. మార్కెట్ అస్థిరతను అంచనా వేసే వీఐఎక్స్ సూచీ 2.9 శాతం క్షీణించింది.

## క్లౌడ్ ఆధారిత డెస్క్‌టాప్..



### దేశంలోనే మొదటి

**జనంసాక్షి:**ఖరీదైన హార్డ్‌వేర్ అవసరం లేకుండా ఏ స్క్రీన్ నైనా పూర్తి స్థాయి కంప్యూటర్‌గా మార్చే గేమ్ ఛేంజింగ్ సర్వీస్‌ను రిలయన్స్ జియో 'జియోపీసీ' పేరుతో అందుబాటులోకి తీసుకొచ్చింది.జియో ఫైబర్ లేదా జియోఎయిర్ ఫైబర్‌తో నడిచే క్లౌడ్ ఆధారిత వర్చువల్ డెస్క్ టాప్‌ను జియోపీసీ అంటారు. దీనిద్వారా కేవలం కీబోర్డు, మౌస్ ఉపయోగించి టీవీ లేదా మానిటర్‌ను పర్సనల్ కంప్యూటర్‌గా మార్చుకోవచ్చు.పూర్తిగా క్లౌడ్ మీద ఆధారపడి ఇది కంప్యూటింగ్ సర్వీసు అందిస్తుంది. ఇందులో సీపీయూ ఉండదు. అప్‌గ్రేడ్‌లు ఉండవు. మెయింటెనెన్స్ ఉండదు. ఈ క్లౌడ్ సర్వీస్ కోసం నెలకు రూ.400 నుంచి 'పే-యాస్ యూ-గో' మోడల్ ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. కొత్త యూజర్లకు ఒక నెల ఉచిత ట్రయల్ అందిస్తారు. 8 జీబీ ర్యామ్, 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్, ఏఐ ఆధారిత టూల్స్ ఇందులో ఉంటాయి. అడోబ్ ఎక్స్‌ప్రెస్‌ను ఉచితంగా అందిస్తారు. ఇది ఫైల్ డిజైన్, ఎడిటింగ్‌కు ఉపయోగపడుతుంది.లిబ్రే ఆఫీస్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ (బ్రౌజర్ కోసం), జియో వర్క్ స్పేస్ వంటి ఉత్పాదక అప్లికేషన్లను సపోర్ట్ చేస్తుంది. ఈ క్లౌడ్‌లో డేటాను సురక్షితంగా స్టోర్ చేసేందుకు వైరస్ అటాక్‌ల నుంచి భద్రత కల్పిస్తారు.ఆన్‌లైన్ లెర్నింగ్, కోడింగ్, రీసెర్చ్ కోసం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ముందస్తు పెట్టుబడి లేకుండా సరసమైన కంప్యూటింగ్ కోసం చిరు వ్యాపారాలకు తోడ్పడుతుంది. కుటుంబ సభ్యుల కోసం వినోదాన్ని అందిస్తుంది. క్లౌడ్ టూల్స్‌తో కంటెంట్ క్రియేటర్లు డిజైన్, ఎడిట్, పబ్లిషింగ్‌ను ఉపయోగించవచ్చు.

ఎలా సెట్ చేయాలంటే..

జియో సెట్ టాప్ బాక్స్ ఆన్ చేయాలి. యాప్స్ విభాగానికి వెళ్లి జియోపీసీ యాప్‌ను లాంచ్ చేయాలి.కీబోర్డ్, మౌస్‌ను ప్లగ్ ఇన్ చేయాలి.జియో నంబర్‌తో రిజిస్టర్ అయి, సైన్ ఇన్ అవ్వాలి.

## 'ఏఐ మా ఉద్యోగులను ఏం చేయలేదు'



**జనంసాక్షి:**టెక్ రంగంలో ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భర్తీ చేస్తుందనే భయాలు నెలకొంటున్న తరుణంలో జోహో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఆశలు రేకెత్తిస్తోంది. జోహోలో ఇంజినీర్లను ఏఐ భర్తీ చేయగలదా అని కంపెనీ సీఈఓ మణి వెంబును అడిగినప్పుడు ప్రస్తుతానికి దాని ప్రభావం లేదని సమాధానం చెప్పారు. ఇటీవల ఓ సమావేశంలో వెంబు మాట్లాడారు.'కృత్రిమ మేధ కారణంగా జోహోలో ఉద్యోగాల్లో కోత లేదు. మీరు ఏఐ వ్యవస్థను ఒక కంటెంట్‌ను సృష్టించమని అడిగితే అది చాలా మెరుగ్గా కంటెంట్‌ను ఇస్తుంది. అయితే కేవలం ఈ ఫీచర్ మా కంపెనీలో ఉద్యోగాలను తొలగించలేదు. ఇప్పటివరకు కృత్రిమ మేధ కారణంగా మేము సిబ్బందిని తగ్గించలేదు. వాస్తవానికి మరికొందరు ఇంజినీర్లను నియమించుకోవాలని యోచిస్తున్నాం' అని చెప్పారు.ఇటీవల బెంగళూరులో జరిగిన జోహోలిక్స్ కార్యక్రమంలో వెంబు ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో జియా అని పిలువబడే కంపెనీ సొంత లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్‌ఎల్‌ఎం)ను ఆవిష్కరించారు. ఈ కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ భారతదేశపు మొట్టమొదటి ఎంటర్ప్రైజ్ ఏఐ అని చెప్పారు. ఇది సాధారణ ప్రజల కోసం ఉద్దేశించింది కానప్పటికీ, ఈ నమూనా వ్యాపారాలకు ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. దీన్ని జోహో ఉత్పాదకత, ఎంటర్ప్రైజ్ ప్లాట్‌ఫామ్‌లతో అనుసంధానించినట్లు, కృత్రిమ మేధ కంపెనీ వర్క్ ఫ్లోలో భాగమవుతోందని వెంబు చెప్పారు.



## అసలైన హీరో ఆమెనే

### ఆనంద్ మహీంద్ర ట్వీట్ వైరల్

**జనంసాక్షి:**దివ్య దేశ్‌ముఖ్ భారత చెస్ వర్గాల్లో ప్రస్తుతం ఈ పేరు మారుమ్రోగి పోతోంది. చదరంగ దిగ్గజాలు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక లకు కూడా సాధ్యం కాని అరుదైన ఘనతను దివ్య సాధించడమే ఇందుకు కారణం.ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్లో ఏకంగా హంపినే ఓడించిన దివ్య.. ఈ టైటిల్ సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా తన పేరును చరిత్ర పుటల్లో లిఖించుకుంది.పందొమిదేళ్ల వయసులోనే ఈ మహారాష్ట్ర అమ్మాయి ఈ అరుదైన రికార్డు సాధించడం మరో విశేషం. దూకుడుగా ఎత్తులకు పైఎత్తులు వేస్తూనే.. కీలక సమయాల్లో ఒత్తిడి దరిచేరనీయకుండా ప్రశాంతంగా ఉండటం దివ్యలోని అరుదైన లక్షణం. ప్రత్యర్థి ఎంతటివారైనా ఏమాత్రం తడబాటుకు లోనుకాకుండా తన పనిని పూర్తి చేయడంలో ఆమె దిట్ట.అందుకే భారత చదరంగ మహారాణిగా వెలుగొందుతున్న 38 ఏళ్ల హంపిని కూడా.. ఇంత చిన్నవయసులోనే దివ్య ఓడించగలిగింది. క్లాసిక్ గేమ్స్‌ను డ్రా చేసుకున్న దివ్య.. ర్యాపిడ్ రౌండ్స్‌లో మాత్రం చక్కటి ప్రదర్శనతో ఆద్యంతం సానుకూల దృక్పథంతో ముందుకు సాగి చాంపియన్‌గా అవతరించింది. ఈ నేపథ్యంలో దివ్య దేశ్‌ముఖ్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండుల్కర్ తదితరులు దివ్యను కొనియాడగా.. తాజాగా వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్ర కూడా ఈ జాబితాలో చేరారు. అయితే, ఆయన దివ్యను ప్రశంసిస్తూనే ఆమె వెనుక ఉన్న అసలైన 'హీరో'కు కూడా క్రెడిట్ ఇవ్వడం విశేషం.ఈ మేరకు.. "ఫిడే ప్రపంచకప్-2025 విజేత దివ్య దేశ్‌ముఖ్. ఈ విజయంతో ఆమె గ్రాండ్ మాస్టర్ హోదాను కూడా పొందింది. పందొమిదేళ్ల వయసులోనే ఈ ఘనత సాధించింది .అయినా, ప్రతీ గ్రాండ్ మాస్టర్ వెనుక ఓ తల్లి ఉం టుంది. ఎంతో మంది ఇలాంటి స్టార్ల వెనుక అన్ సంగ్ హీరోగా నిలబడిపోతుంది" అంటూ దివ్య దేశ్‌ముఖ్ తన తల్లి నమ్రతను ఆలింగనం చేసుకున్న వీడియోను ఆనంద్ మహీంద్ర పంచుకున్నారు.ఇక ఆయన వ్యాఖ్యలతో నెటిజన్లు కూడా ఏకీభవిస్తు న్నారు. ఈ సందర్భంగా చెన్నై చెస్ స్టార్లు ఆర్.ప్రజ్ఞా నంద, ఆర్.వైశాలిల తల్లి నాగలక్ష్మిని గుర్తుచేస్తూ అమ్మలకు సెల్యూట్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.ప్రపంచకప్ గెలవగానే దివ్య తీవ్ర భా వోద్వేగానికి లోనైంది. "ఈ విజయానుభూతిని ఆస్వా దిస్తున్నాను. దీని నుంచి తేరుకునేందుకు ఇంకా కొంత సమయం పడుతుంది. ఇక్కడికి వచ్చే ముందు నాకు ఒక్క జీఎం నార్మ్ కూడా లేదు.నేను ఎప్పుడు నార్మ్ సాధిస్తానో అని ఆలోచించేదాన్ని. కానీ ఇక్కడ ఇలా గ్రాం డ్‌మాస్టర్ కావాలని నాకు రాసి పెట్టి ఉంది. నాకు ఈ ఆనం దంలో మాటలు రావడం లేదు. ఈ విజయానికి ఎంతో ప్రత్యేకత ఉంది. నా దృష్టిలో ఇది ఆరంభం మాత్రమే. ము న్ముందు ఇంకా ఇలాంటివి చాలా సాధించాలని కోరు కుంటున్నా" అని పేర్కొంది. ఇక ఫైనల్ గెలవగానే తల్లి నమ్రతను హత్తుకుని దివ్య ఆనందభాష్పాలు రాల్చింది. ఆ తల్లి కూడా విజయగర్వంతో ఉప్పొంగిపో యింది. కాగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్య దేశ్‌ముఖ్ తల్లిదండ్రులు నమ్రత, జితేంద్ర దేశ్‌ముఖ్. వీరిద్దరూ డాక్టర్లే!

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.00 | ₹ 4.02 |

### బంగారం ధరలు (10 గ్రాములు) హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 91,500 | ₹ 99,820 |

### వెండి ధరలు (కేజీ) హైదరాబాద్

₹ 1,26,000





## టీసీఎస్ లేఆఫ్స్‌తో ఆర్థిక ప్రకంపనలు

**జనంసాక్షి:**టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా తన మొత్తం సిబ్బందిలో 2 శాతం ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ నేత జైరాం రమేష్ స్పందించారు.టీసీఎస్ ప్రకటన ఆర్థిక ప్రకంపనలకు(ఎకనామిక్ ఎర్త్‌క్వేక్) కారణమవుతుందన్నారు. భారతదేశపు అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టీసీఎస్ 12,261 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఇటీవల ప్రకటించింది. ఇందులో ప్రభావితం చెందే వారిలో ఎక్కువ మంది మిడిల్, సీనియర్ గ్రేడ్ ఉద్యోగులు ఉండబోతున్నట్లు సంస్థ తెలిపింది.2025 జూన్ 30 నాటికి టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. ఇటీవల ముగిసిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 5,000 మంది ఉద్యోగులను చేర్చుకుంది. 'నైపుణ్యాల అసమతుల్యత వల్ల కంపెనీ ఈమేరకు ప్రకటన చేసి ఉండవచ్చు. ఏది ఏమైనా ఈ వార్త ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఇది ఆర్థిక ప్రకంకపనలు సృష్టిస్తుంది' అని జైరాం రమేష్ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు. టెక్నాలజీ, కృత్రిమ మేధ, మార్కెట్ విస్తరణ, శ్రామిక శక్తి పునర్వ్యవస్థీకరణలో పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్తుకు సిద్ధంగా ఉంటున్నట్లు కంపెనీ తెలిపింది.

# టెక్ దిగ్గజాలు ఎంతవరకు చదివారు?



టెక్ బిలియనీర్ల ప్రపంచంలో సుందర్ పిచాయ్, ఎలాన్‌మస్క్‌లకు ప్రత్యేక స్థానం ఉంది. సుందర్ పిచాయ్ ఆల్ఫాబెట్ ఇంక్‌కు నాయకత్వం వహిస్తూ, బిలియనీర్ జాబితాలో ఇటీవల చోటు సంపాదించారు.టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్‌ఏఐ వ్యవస్థాపకుడిగా ఎలాన్‌మస్క్ ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానంలో ఉన్నారు. వీరు సారథ్యం వహిస్తున్న కంపెనీల ఉత్పత్తుల ద్వారా నిత్యం పోటీ పడుతున్నారు. ఈ తరుణంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు వీరి నుంచి అకడమిక్ ప్రమాణాలతోపాటు చాలా విషయాలు నేర్చుకోవాల్సి ఉంది.

### సుందర్ పిచాయ్

చెన్నైలో జన్మించిన సుందర్ పిచాయ్ టెక్ ప్రపంచంలో ఎంతో ప్రసిద్ధి చెందారు. చెన్నైలోని అశోక్ నగర్‌లో ఉన్న జవహర్ విద్యాలయంలో ప్రాథమిక విద్య అభ్యసించారు. వానవాణి స్కూల్‌లో హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మెటలార్జీ ఇంజినీరింగ్ చేశారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఎంఎస్ చేశారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి వార్టన్ స్కూల్ ద్వారా ఎంబీఏ చేశారు. గూగుల్‌లో ప్రొడక్ట్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి సంస్థ అసాధారణమైన పనితీరుతో గూగుల్ యాజమాన్యం తనకు దాసోహమయ్యేలా చేసుకున్నారు. ముఖ్యంగా గూగుల్ క్రోమ్, గూగుల్ టూల్ బార్స్‌ను అందుబాటులోకి తెచ్చి ఔరా అనిపించుకున్నారు. అందుకు ప్రతిఫలంగా సుందర్ పిచాయ్‌కు గూగుల్ యాజమాన్యం సీఈఓ అనే సింహాసనం మీద కూర్చోబెట్టింది. 2015లో గూగుల్‌లో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి అమెరికన్ స్టాక్ మార్కెట్లైన ఎస్ అండ్ పీ 500, నాస్‌డాక్‌ల్లో గూగుల్ షేర్లను పరుగులు పెట్టేలా చేశారు.

### ఎలాన్ మస్క్

దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో జన్మించిన ఎలాన్ మస్క్ చిన్న వయసులోనే కంప్యూటింగ్‌పై ఆసక్తి పెంచుకుని 10 ఏళ్లకే ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాడు. దక్షిణాఫ్రికాలోని తప్పనిసరి సైనిక సేవను నివారించడానికి క్వీన్స్ విశ్వవిద్యాలయంలో చేరడానికి కెనడా వెళ్లారు. రెండేళ్ల తరువాత పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో చేరారు. వార్టన్ స్కూల్ నుంచి ఫిజిక్స్, ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ చేశారు. మస్క్ స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో అప్లైడ్ ఫిజిక్స్ అండ్ మెటీరియల్స్ సైన్స్‌లో పీహెచ్‌డీ కోసం కొంతకాలం చేరారు. కాని కొద్ది రోజులే అందుకు కొనసాగారు.

## పసిడి ప్రియులకు స్వల్ప ఊరట..

**తులం ఎంతంటే..**
**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధరలు ఊగిసలాడుతున్నాయి. వరుసగా నాలుగు సెషన్ల నుంచి తగ్గుతున్న పసిడి ధరల్లో ఈ రోజు కూడా ఊరట లభించింది. సోమవారంతో పోలిస్తే మంగళవారం పసిడి ధరలు స్వల్పంగా తగ్గాయి.**





## లీకుల తుపాన్‌లో చిక్కుకున్న 'టీ' యాప్

### 11 లక్షల మంది మహిళల ప్రైవేట్ చాట్ లీక్..!



**జనంసాక్షి:**డేటింగ్ యాప్ 'టీ' లీకుల తుపాన్‌లో చిక్కుకుంది మహిళలు తమకు నచ్చిన విషయాలు షేర్ చేసుకునేలా రూపొందించిన ఈ వేదికలో గోప్యతా ఉల్లం ఘనలు బయటపడ్డాయి.11 లక్షల మంది యూజర్ల మధ్య జరిగిన ప్రైవేటు మెసేజ్‌లు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయని ఓ మీడియా కథనం పేర్కొంది. వాటిలో అత్యంత సున్నితమైన, వ్యక్తిగత సమాచారం ఉందని వెల్లడించింది. తమ యాప్ మహిళలకు సేఫ్ స్పేస్ అని 'టీ' నిర్వాహకులు చెప్పున్నప్పటికీ.. వరుసగా డేటా బయటకు పొక్కుతోంది కొన్ని రోజుల క్రితం వేలాది యూజర్ల సెల్ఫీలు, ఐడీ ఫొటోలు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టాయి. ఈవిషయాన్ని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఒకరు మీడియాకు వెల్లడించారు. తాజా ఉల్లంఘనల్లో 2023 నుంచి ఉన్న సందేశాలు కూడా ఉన్నాయని ఆ కథనం పేర్కొంది. అందులో కొందరు మహిళలు అబార్షన్, రిలేషన్‌షిప్ సమస్యలను చర్చించుకున్నారు. ఈ యాప్‌లో నకిలీ పేర్లు వాడే వెసులుబాటు ఉన్నప్పటికీ.. చాలామంది యూజర్లు తమ గుర్తింపు తెలియజేసే వివరాలను ఉపయోగించారు. తమ ప్రైవేటు సంభాషణలు గోప్యంగా ఉంటాయని వారు భావించినప్పటికీ.. ఇలా బయటకు పొక్కడం తీవ్ర ఆందోళనలకు దారితీసింది. దీంతో ఈ యాప్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ టీ యాప్‌నకు 16 లక్షల మంది యూజర్లు ఉన్నారు. మహిళలు మాత్రమే ఈ యాప్‌లో చేరేలా వారి సెల్ఫీలతో నిర్ధరణ చేసుకుంటారు. ఈ ఫీచర్ వల్లే మహిళలు దీనిపై ఆకర్షితులయ్యారు. కానీ వరుసగా జరిగిన ఈ ఉల్లంఘనల వల్ల యూజర్ల సమాచారాన్ని భద్రపరిచే సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారాలపై టీ నిర్వాహకులు స్పందించారు. "ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలను ఇప్పటికే ప్రారం భించాం. అలాగే సైబర్ సెక్యూరిటీ నిపుణులతో విచారణ చేయిస్తున్నాం. అలాగే భద్రతా సంస్థలు జరిపే దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నాం" అని వెల్లడించారు.

## బీఎస్‌ఎన్‌ఎల్ టారిఫ్‌లపై కీలక ప్రకటన

**జనంసాక్షి:**ప్రభుత్వ రంగ టెలికాం ఆపరేటర్ బీఎస్‌ఎన్‌ఎల్ టారిఫ్‌లను పెంచే యోచన లేదని కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. భారతదేశం అంతటా 4జీ వినియోగదారుల సంఖ్యను పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.బీఎస్‌ఎన్‌ఎల్ త్వరలో టారిఫ్‌లను పెంచబోతుందనే వాదనలను తోసిపుచ్చుతూ మంత్రి ఈమేరకు స్పష్టత ఇచ్చారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు (సీజీఎంలు) పాల్గొన్నారు.బీఎస్‌ఎన్‌ఎల్ ఎప్పటినుంచో 2జీ, 3జీ నెట్‌వర్క్‌ల్లో వాడుతున్న పాత చైనీస్ పరికరాలను స్వదేశీ 4జీ మౌలిక సదుపాయాలతో భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు మంత్రి పెమ్మసాని చెప్పారు. అయితే, ఎప్పటిలోపు దీన్ని పూర్తి చేస్తారో నిర్దిష్ట కాలపరిమితి తెలపలేదు. బీఎస్‌ఎన్‌ఎల్ 2జీ, 3జీ సేవలను దశలవారీగా నిలిపివేస్తున్నప్పటికీ, 5జీకి మారే ప్రణాళికలు మాత్రం ప్రస్తుతానికి లేవనే సంకేతాలు వెలువడుతున్నాయి.బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్లకు ప్రస్తుతం 4జీ సరిపోతుందని మంత్రి అన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా 4జీ నెట్‌వర్క్‌ను అందించడమే ప్రస్తుత ప్రాధాన్యమని పెమ్మసాని తెలిపారు. ఇతర టెల్కోల్లో 75 శాతం మంది వినియోగదారుల అవసరాలను 4జీ తీరుస్తుందన్నారు. స్వదేశీ 5జీ కోర్, అందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయని, ఆర్థికంగా లాభదాయకంగా ఉన్నప్పుడే ఈ విషయంలో ముందుకెళ్తామన్నారు.

## భారత సంతతి కోపైలట్ అరెస్ట్

### కాక్‌పిట్‌లోకి దూసుకొచ్చి అరెస్టు చేసిన పోలీసులు

**జనంసాక్షి:**భారత సంతతికి చెందిన కోపైలట్ రుస్తుం భగ్వాగర్ అమెరికాలో అరెస్టయ్యాడు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అతడిని కాక్‌పిట్ నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.డెల్టా ఎయిర్‌లైన్స్‌లో విధులు నిర్వర్తిస్తోన్న అతడిపై చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలు ఉన్నాయి.డెల్టా సంస్థకు చెందిన బోయింగ్ విమానం మిన్నియాపోలిస్ నుంచి బయల్దేరి, శాన్‌ఫ్రాన్సిస్కోలో ల్యాండ్ అయింది. అది దిగిన పది నిమిషాల వ్యవధిలోనే పోలీసులు కాక్‌పిట్‌లో దూసుకువచ్చారు. విమానం నుంచి దిగాలని ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఆ పరిణామంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. లోపలికి వెళ్లిన భద్రతాసిబ్బంది కోపైలట్ భగ్వాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. "వేర్వేరు సంస్థలకు చెందిన దుస్తులు ధరించిన అధికారులు తుపాకులతో లోపలికి వచ్చారు. అతడికి బేడీలు వేసి తీసుకెళ్లారు" అని ఓ ప్రయాణికుడు మీడియా వెల్లడించారు. ఈ అరెస్టుతో భగ్వాగర్ షాక్‌కు గురయ్యాడు. దీని గురించి తనకు ముందుగా తెలియదని చెప్పాడు. అతడు తప్పించుకునే అవకాశం ఉంటుందని భావించిన అధికారులు ఈ ప్రక్రియనంతా గోప్యంగా నిర్వహించారు. భగ్వాగర్.. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలపై ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆదివారం అతడిని అరెస్టు చేశారు. దీనిపై డెల్టా సంస్థ స్పందించింది. "అనైతిక ప్రవర్తనను మా సంస్థ ఏమాత్రం సహించదు. అతడిపై వచ్చిన అభియోగాలు మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. మేం అతడిని సస్పెండ్ చేస్తున్నాం" అని వెల్లడించింది.



## ఉక్రెయిన్ జైలుపై రష్యా వైమానిక దాడులు

గాయపడినట్లు తెలిపారు. ఉక్రెయిన్ లోని ఆగ్నేయ జపోర్జియా ప్రాంతంలోని జైలుపై ఈ దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. బిలెన్‌కివ్స్కాలోని మరో కాలనీపై కూడా ఈ దాడుల ప్రభావం కన్పించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో 17 మంది చనిపోగా.. 42 మంది ఖైదీలు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. సిబ్బందిలో ఒకరితో పాటు మరికొందరు గాయపడ్డారని తెలిపారు. జైలు డైనింగ్ హాలుతో సహా పరిపాలనా, క్వారంటైన్ భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మరో మూడంతస్తుల భవనం పాక్షికంగా దెబ్బతిందని, ప్రసూతి ఆస్పత్రితో సహా పలు ఆస్పత్రుల్లోని వైద్య సౌకర్యాలు నాశనమయ్యాయని వెల్లడించారు. ఈ దాడుల నేపథ్యంలో ఖైదీలు ఎవరూ జైలు నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు కీవ్ అధికారులు పేర్కొన్నారు. జైళ్ల వంటి పౌరుల మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన్నారు.

## 21 నెలలుగా మారణహోమం

### 60 వేలు దాటిన మరణాలు!



భీకర దాడులు.. ఆకలి కేకలు.. వెరసి గాజాలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. గత 21 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ యుద్ధంలో స్థానికంగా మృతుల సంఖ్య 60 వేలు దాటింది.మరో 1.45 లక్షల మంది గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని పేర్కొంది. గత 24 గంటల్లోనే 113 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 637 మంది గాయపడ్డారని తెలిపింది. అయితే, మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఆహార సంక్షోభంతో కొంతకాలంగా గాజా పౌరుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. స్థానికంగా అత్యంత దారుణమైన కరవు పరిస్థితి నెలకొందని, తక్షణమే చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున మరణాలు సంభవించే అవకాశం ఉందని ఐరాస సహకారంతో రూపొందిన 'ఐపీసీ' నివేదిక అంచనా వేసింది. "మే- జూలై మధ్యకాలంలో తీవ్ర ఆకలిని ఎదుర్కొంటున్న కుటుంబాల సంఖ్య రెట్టింపు అయ్యింది. గాజా సిటీలో పోషకాహార లోపం రేటు మేలో 4.4 శాతంగా ఉండగా.. జులై నాటికి ఏకంగా 16.5 శాతానికి పెరిగింది. గర్భిణులు, బాలింతల్లో ఐదింట రెండొంతుల మంది జూన్‌లో తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడ్డారు" అని పేర్కొంది.అం తర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతుండటంతో ఇజ్రాయెల్ ఇటీవల ఆంక్షలను కాస్త సడలించింది. అయినప్పటికీ.. పరిస్థితిలో పెద్దగా మార్పులేదని ఐరాస ప్రతినిధు లు, పాలస్తీనీయన్లు తెలిపారు. గాజాలోకి ఎన్ని సహాయ ట్రక్కులు ప్రవేశించవ చ్చనే దానిపై ఎటువంటి పరిమితి లేదని ఇజ్రాయెల్ చెబుతుండగా.. స్థానికంగా కరవు పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఈ చర్యలు సరిపోవని ఐరాస సంస్థలు తెలిపాయి

# పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం





- 18 నెలల కాలంలో హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిల పెంపు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 29 (జనంసాక్షి)**
పేద విద్యార్థులకు మెరుగైన విద్య, అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిఎం ఉషా పథకం క్రింద రూ 9 కోట్ల 20 లక్షల నిధులతో మహిళా వసతి గృహము హాస్టల్ భవనం నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పర్యటించిన సందర్భంగా బాలికలు హాస్టల్ వసతి లేక పడుతున్న ఇబ్బందులను గమనించి సీఎం దృష్టికి తీసుకుని వెళ్ళానన్నారు. విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రాముఖ్యత, పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తూ పనిచేస్తున్న క్రమంలో ప్రభుత్వం హాస్టల్ నిర్మాణానికి రూ 10 కోట్లు మంజూరు చేసిందన్నారు. 2005 సంవత్సరంలో అగ్రహారం డిగ్రీ కళాశాలలో సైన్స్ వింగ్ ఏర్పాటు కోసం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. హాస్టల్ వసతి కారణంగా ఎక్కువ మంది బాలికలు ఉన్నత చదువులు చదువుకుంటారన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంచామన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మేన్యూ ప్రవేశ పెట్టామన్నారు.
నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో నియమించామన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా చేశామన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని, ఐటిఐ కళాశాలను రతన్ టాటా కంపెనీ తో అనుసంధానం చేసుకొని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామన్నారు. రూ 200 కోట్లు ఖర్చు చేసి 20 నుంచి 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందన్నారు. మేడిపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసుకున్నమన్నారు. వేదాలకు సంబంధించిన ఆల్ ఇండియా పరీక్షలు వేములవాడ రాజన్న ఆలయంలో జరగాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని విద్యాసంస్థలను వేములవాడ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ నాగ పంచమి రోజు పీఎం ఉష పథకం క్రింద రూ 9 కోట్ల 20 లక్షలతో అగ్రహారం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బాలికల వద్ద గృహ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. 18 నెలల కాలంలో ఈ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు స్థానిక నాయకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రంథాలయం మూసి ఉంటే ఎలా?





**నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 29 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సందర్శించిన సమయంలో అది మూసివేయబడి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించి, లైబ్రరీ ఎందుకు తాళం వేసి ఉందని నిలదీశారు. జిల్లాలోని 24 గ్రంథాలయాలు సమయ పాలన పాటించేలా పర్యవేక్షణ జరపాలని, ఇకనుండి రోజువారీ నివేదికను తనకు పంపాలని ఆదేశించారు. లైబ్రరీని తెరిపించి, అందుబాటులో ఉన్న పత్రికలు, పుస్తకాలు, మ్యాగజైన్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం 8 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 6 గంటల వరకు గ్రంథాలయాలు తెరిచి ఉండేలా చూడాలని సూచించారు. మంగళవారం మాక్లూర్ మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ సెంటర్, మండల విద్యాశాఖ కార్యాలయం, వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్, శాఖా గ్రంథాలయం, సబ్ పోస్టాఫీస్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. మాక్లూర్ పీహెచ్‌సీని సందర్శించి, ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్‌పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్‌లను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్, సిబ్బంది హాజరును పరిశీలించి, వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీబీపీ, షుగర్, రక్తపోటు నిర్ధారణ కోసం రోజువారీ రక్త పరీక్షలు, వాటి ఫలితాల నిర్వహణ గురించి ప్రశ్నించారు. రక్త పరీక్షల రికార్డులను తనిఖీ చేసి, సూచనలు చేశారు. ప్రభుత్వ బడులు, వసతి గృహాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల సమయంలో రక్త నమూనాలు సేకరించి, పీహెచ్‌సీలలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన విద్యార్థులకు చికిత్స అందించాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్, టీబీ పరీక్షలు శతశాతం జరిగేలా చూడాలని, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు, పాముకాటు మందు, ఇతర ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పీహెచ్‌సీ, దాని పరిధిలోని ఆరు సబ్ సెంటర్ల ద్వారా వైద్య సేవలు పక్కాగా అందేలా పర్యవేక్షించాలని మెడికల్ ఆఫీసర్‌కు ఆదేశించారు. లోటుపాట్లను సరిదిద్దుకోవాలని, ప్రజల ఆరోగ్య రక్షణ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని హితవు పలికారు. మాతాశిశు మరణాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, దురదృష్టకర సంఘటనలు జరిగితే వెంటనే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి, సదుపాయాలను పరిశీలించి, చిన్నారులకు పౌష్టికాహారం, సక్రమ నిర్వహణకు సూచనలు చేశారు. ఎంఈఓ కార్యాలయంలో సిబ్బంది గైర్హాజరును గమనించి, హాజరు పట్టికను తనిఖీ చేసి, సెలవుల గురించి ఆరా తీశారు. వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను సందర్శించి, ఎరువుల నిల్వలను, రైతుల అవసరాలను పరిశీలించారు. ఎరువులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని రైతులు తెలిపారు. స్టాక్ వివరాల బోర్డును గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ పోస్టాఫీస్‌లో ఆసరా పెన్షన్ల పంపిణీ గురించి ఆరా తీసి, నగదు కొరత లేకుండా, సకాలంలో పెన్షన్లు అందజేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతి గురించి పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి, లబ్ధిదారులను ప్రోత్సహించాలని, ఐకేపీ ద్వారా రుణాలు అందేలా చొరవ చూపాలని ఆదేశించారు.

# రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

*అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలు*

- 6 నెలల్లో నారాయణపూర్ కుడి కాలువ నిర్మాణం : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్ జిల్లా బ్యూరో / గంగాధర, జులై 29 (జనంసాక్షి) :** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గంగాధర మండలంలోని జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులందరికీ కార్డులు అందజేస్తామని తెలిపారు. గత సర్కారు దశాబ్దం పాటు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయకపోవడంతో ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రేషన్ కార్డు పేదలకు ఆత్మగౌరవాన్ని అందిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల అవసరాలను గుర్తించి, దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులు అందిస్తోందని, ఈ ప్రక్రియ నిరంతరమని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, నియోజకవర్గంలో తొలి విడతగా 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రానున్న కాలంలో అర్హులందరికీ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. నారాయణపూర్ జలాశయం కుడికాలువ పనులను ఆరు నెలల్లో ప్రారంభించనున్నామని, దీనివల్ల సాగు విస్తీర్ణం పెరిగి చొప్పదండి నియోజకవర్గం మరింత సస్యశ్యామలం అవుతుందని అన్నారు. రైతు శ్రేయస్సు కోసం 9,000 కోట్ల రైతు భరోసా సొమ్ము రైతు ఖాతాల్లో జమ చేశామని, 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో 78,500కు పైగా కొత్త రేషన్ కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు చేశామని, గంగాధర మండలంలో 5,516 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, వీటి ద్వారా 10,816 మందికి ప్రతి నెలా 64.896 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడం వల్ల మహిళలు ఎక్కువగా ఇబ్బంది పడ్డారని, మహిళల పేరిట కార్డులు నమోదు కావడం, కుటుంబ రేషన్ కార్డులో యజమానిగా ఉండడం సానుకూలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ కరుణాకర్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తిరుమలరావు, తహసిల్దార్ అనుపమ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి పరిధిలో ఆరోగ్య కార్యక్రమాలను

# పకడ్బందీగా అమలుచేయాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 29 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి పల్లి దవాఖానాను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి, ఎన్సి చెకప్ చేసి, తదితర వివరాలను వాకబు చేశారు. ఆసుపత్రి పరిధిలో తరచు ఫీవర్ సర్వే నిర్వహించాలని, ఎక్కడైనా డెంగ్యూ వంటి వ్యాధులు నిర్ధారణ అయితే వెంటనే వైద్యులను అప్రమత్తం చేసి మెడికల్ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించారు. ఆశాల ద్వారా ఎన్సి చెకప్, సామ్ మామ్ పిల్లల ఆరోగ్య సంరక్ష సక్రమంగా ఉండాలని, మండలంలో ఎక్కడ నీరు నిలువ కాకుండా చూసుకోవాలని, శానిటేషన్ పనులు సక్రమంగా జరగాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్వహించే రోజువారీ కార్యక్రమాలను రిజిస్టర్లలో నమోదు చేయడంతోపాటు వాటిని ధృవీకరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలస్యం కాకుండా చూడాలని, ఇసుక, మొరం కొరకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, డిప్యూటీ వైద్యాధికారి ప్రభుకిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యనందించాలి

**బీర్పూర్ మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**జగిత్యాల బ్యూరో ,జులై 29 జనంసాక్షి :**
జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులు, వసతులు, విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన



విద్యాబోధన అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. క్లాస్ రూమ్‌లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సమయపాలనను హాజరు పట్టిక ద్వారా తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు భావి తరాలకు అవసరమైన విద్యను అందిస్తున్నారని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో వంద శాతం ప్రగతి సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి, పాఠాలు చదివించి వారి బోధన స్థితిగతులను పరిశీలించారు. హాజరు, తరగతుల నిర్వహణ, పారిశుధ్య సౌకర్యాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజన తయారీలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రతను నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. వర్షాకాలంలో దోమలు, పిచ్చి మొక్కల వృద్ధిని నివారించేందుకు శానిటేషన్ చేయించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని హెచ్చరించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాధికారి రాము, డీపీఓ మదన్ మోహన్, హౌసింగ్ డీఈ భాస్కర్, ఎమ్మార్వో సుజాత, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ మిలిటరీ ఏరియాలో చిరుత కలకలం

**రాజేంద్రనగర్, జూలై 29 (జనంసాక్షి)**
గోల్కొండ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపుతుంది. మంగళవారం అర్ధరాత్రి ఇబ్రహీంబాగ్ మిల్ట్రీ ఏరియాలో రోడ్డు దాటుతూ కనిపించిన దృశ్యాలు సిసి ఫుటేజీలో రికార్డయ్యాయి. చిరుత తారామతి ,బారామతి వెనుకవైపు మూసినది ప్రాంతంకు వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయినట్టు అటవీ అధికారులు గుర్తించారు.

# బిజెపి బీసీల ద్రోహిగా మారద్దు

- కేంద్రమంత్రిగా బండి సంజయ్ భేషరతుగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు ప్రకటించాలి
- జిల్లా కాంగ్రెస్ బీసీసెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 29 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీసీ రిజర్వేషన్లను ముస్లిం డిక్లరేషన్‌గా పేర్కొన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతీయ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన మాటకు కట్టుబడి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎనిమిది మంది బిజెపి ఎంపీలను గెలిపించినా, బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ ఈ విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా పనిచేసి, ప్రస్తుతం కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్, బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ఉంటూ బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వకుండా, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రిజర్వేషన్లకు మతాన్ని అంటగట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను ముస్లిం డిక్లరేషన్‌గా అభివర్ణించడం రాజకీయ అజ్ఞానంగా పేర్కొన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బీసీ డిక్లరేషన్ అమలుకు



ఢిల్లీ పర్యటనలు చేసి జాతీయ నేతల ప్రశంసలు పొందుతుంటే, బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్, ప్రధాని నరేంద్ర మోడీ బీసీ అని చెప్పుకుంటూనే రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌పై బిజెపి నేతలు చేస్తున్న ఆరోపణలను తిరస్కరిస్తూ, బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల లోపు బిజెపి జాతీయ నేతలను కలిసి బీసీ రిజర్వేషన్లకు అనుకూల ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన సాహసాన్ని అభినందిస్తూ, బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే బండి సంజయ్ చరిత్రలో హీనుడిగా మిగిలిపోతారని, బీసీల ఆగ్రహానికి బిజెపి నేతలు గురవుతారని, బీసీ బిడ్డలు బిజెపిపై తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, ప్రధాని మోడీపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రామిడి తిరుపతిరెడ్డి, సాయిరి దేవన్న, నూనె గోపాల్ రెడ్డి, పోతుగంటి శ్రీనివాస్, వంగల విద్యాసాగర్, వరహాల చారి, కుంభాల రాజకుమార్, బండి పెల్లి ప్రవీణ్ కుమార్, గండికోట సురేష్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కోసం ప్రభుత్వ చొరవ





- ఆహార భద్రత కార్డుల పంపిణీ
- సామాజిక బలోపేతానికై మహిళలకు ఆర్థిక సహాయం
- సంక్షేమ పథకాల అమలు, సామాజిక అభివృద్ధి కోసం కార్యక్రమాలు


**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 28 (జనంసాక్షి) :**
రాష్ట్రంలోని ప్రతి మహిళను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, కామారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. కామారెడ్డి జిల్లా దోమకొండ గ్రామంలోని శ్రీ వనదుర్గ పెద్దమ్మతల్లి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో దోమకొండ, బీబీపేట్ మండలాల లబ్ధిదారులకు నూతన ఆహార భద్రత కార్డులు, అదనపు సభ్యుల చేర్పు లేఖలను మంత్రి సీతక్క, ఎస్సీ, ఎస్టీ, ఒబీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా దోమకొండ మండలంలో 352 మందికి, బీబీపేట్ మండలంలో 555 మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, అదనపుసభ్యుల చేర్పు లేఖలు పంపిణీ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, 2004 నుండి 2014 వరకు పేదలకు రేషన్ కార్డులు అందించినట్లు, ప్రస్తుతం మళ్లీ ఈ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. రేషన్ కార్డు ద్వారా ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నామని, దీనివల్ల ఆహార ఖర్చు గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. మూడు నెలలకు సరిపడా సరుకులను ముందస్తుగా అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, వడ్డీలేని రుణాలను మహిళల పేరిట అందిస్తున్నామని వివరించారు. మహిళల సంతోషం సమాజ, కుటుంబ అభివృద్ధికి కీలకమని, అందుకే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు 26 వేల కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు, స్త్రీ నిధి కింద కోటి రూపాయల సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ నిధులను వృథా చేయవద్దని సూచించారు. మహిళా సంఘ సభ్యులకు ఆపద సమయంలో వడ్డీలేని రుణాలు, ప్రమాద బీమా కింద 10 లక్షల రూపాయలు, రుణం తీసుకున్న మహిళ మరణిస్తే 2 లక్షల రుణ మాఫీ, 60 ఏళ్లు దాటిన మహిళలు, 15 ఏళ్లు దాటిన బాలికలకు సంఘ సభ్యత్వం కల్పిస్తున్నామని వెల్లడించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఆర్థిక స్థోమత లేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణ సౌకర్యం, అద్దెబస్సుల ఆదాయం, స్కూల్ యూనిఫామ్ కుట్టు పని, పెట్రోల్‌బంకులు అందిస్తున్నామని, రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీని చట్టబద్ధం చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులేని పిల్లలకు మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద సబ్సిడీ, ఆరోగ్యశ్రీ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ, 13 సంవత్సరాల తర్వాత 4 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు, కొత్తగా పిల్లల పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చినట్లు తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, తెలంగాణలోనే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇది దేశంలో ఇతర రాష్ట్రాల్లో లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిం చిందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పెట్రోల్ బంకులు, ఉచిత రవాణా, 5 లక్షల ఇంటి నిర్మాణ సాయం అందిస్తున్నామని, ఇందిర మ్మ ఇళ్ల మంజూరులో సమస్యలు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల పట్ల సాను కూలంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మండలంలో 85 శాతం మహిళలు బీడీ కార్మికులుగా ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో అనాథ పిల్లల కు ఆరోగ్యశ్రీ కార్డులు, నూతన రేషన్ కార్డులు, 45 మహిళా సంఘాలకు 5 కోట్ల బ్యాంకు లింకేజి, స్త్రీ నిధి కింద ఒక కోటి రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్, డీఆర్డీఓ, జిల్లా సంక్షేమ అధికారి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ విధానంలో వైద్య సిబ్బంది హాజరు నమోదు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**మంథని, జూలై 29, (జనంసాక్షి) :**
బయోమెట్రిక్ విధానం ద్వారా వైద్య సిబ్బంది హాజరు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని పట్టణ కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ



హెల్త్ సెంటర్, మాత శిశు ఆసుపత్రి, గోపాల్ పూర్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గద్దెలపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో వార్డులను క్షుణ్ణంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల కొరకు నూతనంగా నిర్మించిన షెడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, ప్రతిరోజు తప్పనిసరిగా హాజరు వివరాలను బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను గర్భిణీ మహిళలకు అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గోపాల్ పూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు. గద్దెలపల్లి ప్రాథమిక ఆసుపత్రిని పరిశీలించి ఏఎంసి ప్రొఫైల్ సక్రమంగా నిర్వహించాలని, ఎన్ సి డి స్క్రీనింగ్, ఎక్స్‌రే, టిబి ముక్త్ భారత్, ఆరోగ్య మహిళ తదితర వాటిపై ఆరా తీశారు. ఓపీ సేవలు పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎంపీడీవో శశికళ, మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, ఏఈపిఆర్ అనుదీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 30, 31 తేదీలలో కేజీబీవీలో ఇంటర్మీడియట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్

**జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి**

**గోదావరిఖని, జనంసాక్షి :** జూలై 30, 31 తేదీలలో కేజీబీవీ లో ఇంటర్మీడియట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 8 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ వివిధ కోర్సులకు, అంతర్గాం లో 10 బై.పి.సీ, జూలపల్లి లో 15 బై.పి.సి, మంథని ముత్తారంలో 16 సీఈసీ, 19 ఎంపిహెచ్ డబ్ల్యూ, ఓదెలలో 18 ఎం.పి.సి , 27 బై.పి.సి, పాలకుర్తిలో 19 ఎం.ఎల్.టి, 19 బై.పి.సి , రామగిరి లో 10 ఎం.పి.సి, కంప్యూటర్ సైన్స్ 25, శ్రీరాంపూర్ లో 20 సి.ఈ.సి, 2 ఎం.పి.హెచ్.డబ్ల్యూ, సుల్తానాబాద్ లో 21 ఎం.పి.హెచ్.డబ్ల్యూ సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నేరుగా జూలై 30, 31న స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# గంభీర్ 'తగ్గేదేలే'

## టీమ్ ఇండియా కోచ్ గంభీర్, ఓవల్ పిచ్ క్యూరేటర్‌తో తీవ్ర వాగ్వాదం

లండన్‌లోని ఓవల్ స్టేడియంలో జులై 29, 2025న టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్‌తో తీవ్ర వాగ్వాదంలో పాల్గొన్నాడు. ఇంగ్లాండ్‌తో జులై 31 నుంచి జరగనున్న ఐదో టెస్ట్ మ్యాచ్‌కు ముందు జరిగిన ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత జట్టు శిక్షణ సెషన్ లో ఉండగా, పిచ్‌పై జరిగిన ఏదో విషయంపై గంభీర్, ఫోర్టిస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గంభీర్, "నీవు కేవలం మైదాన సిబ్బంది మాత్రమే, మాకు ఏం చేయాలో చెప్పే హక్కు నీకు లేదు. కావాలంటే మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేయి," అంటూ తీవ్రంగా హెచ్చరించినట్లు వీడియోలో కనిపిస్తోంది



# సిరీస్ సమం చేస్తాం

## టీమిండియా గొప్ప పోరాట పటిమ ప్రదర్శించింది

### ధీమా వ్యక్తం చేసిన కోచ్ గౌతం గంభీర్

లండన్‌లోని ద ఓవల్ మైదానంలో ఈ నెల 31 నుంచి ఇంగ్లాండ్‌తో జరిగే ఐదో టెస్టు కోసం టీమిండియా ప్లేయింగ్ లెవన్‌పై చర్చ జోరుగా సాగుతోంది. స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆడతాడా లేదా అనే అనిశ్చితి నెలకొంది. టీమ్ మేనేజ్‌మెంట్ ముందుగా బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని ప్రకటించింది. తొలి, మూడు, నాలుగు టెస్టుల్లో ఆడిన బుమ్రా తన కోటా పూర్తి చేశాడు. అయినప్పటికీ, జట్టు అవసరాల దృష్ట్యా ఐదో టెస్టులో ఆడే అవకాశంపై హెడ్ కోచ్ గౌతం గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం పేసర్లంతా ఫిట్‌గా ఉన్నప్పటికీ, బుమ్రా ఆడటంపై నిర్ణయం తీసుకోలేదని తెలిపాడు. సిరీస్‌లో మూడు టెస్టుల్లో 14 వికెట్లు తీసి, 26 సగటుతో టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. రెండుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శనతో ప్రత్యర్థి జట్టును కట్టడి చేశాడు. గంభీర్ మాట్లాడుతూ, జట్టు అనుభవరాహిత్యంగా ఉన్నప్పటికీ గొప్ప పోరాట పటిమ చూపిందని, ఈ స్ఫూర్తితో ఐదో టెస్టు గెలిచి 2-2తో సిరీస్‌ను సమం చేస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ప్లేయింగ్ లెవన్‌లో మార్పులు గణనీయంగా ఉండకపోవచ్చు. బుమ్రా, మహ్మద్ సిరాజ్ తప్పుకోకపోతే వారు ఆడే అవకాశం ఉంది. వీరిలో ఎవరైనా ఆడకపోతే అర్షదీప్ సింగ్‌కు అవకాశం దక్కవచ్చు. మూడో పేసర్‌గా విఫలమైన అన్షుల్ కాంబోజ్ స్థానంలో ఆకాశ్ దీప్ ఆడే ఛాన్స్ ఉంది. బ్యాటింగ్‌లో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా, సాయి సుదర్శన్ మూడో స్థానంలో, శుభమాన్ గిల్ నాలుగో స్థానంలో ఆడనున్నారు. రిషభ్ పంత్ గాయంతో ధ్రువ్ జురెల్ ఏడో స్థానంలో ఆడే అవకాశం ఉంది. ఐదు, ఆరు స్థానాల్లో వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా ఆడవచ్చు. స్పిన్‌కు అనుకూలమైన పిచ్ ఉంటే శార్దూల్ ఠాకూర్ స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉంది. పిచ్ పరిస్థితులు, ఆటగాళ్ల లభ్యతను బట్టి టీమ్ మేనేజ్‌మెంట్ తుది నిర్ణయం తీసుకోనుంది.

### టెస్ట్ క్రికెట్‌లో రికార్డుల వర్షం

**రవీంద్ర జడేజా 2022 ఆగస్టులో మోకాలి గాయంతో ఐదు నెలలపాటు ఆటకు దూరమయ్యాడు, కానీ 2023 ఫిబ్రవరిలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో టీమిండియాలోకి తిరిగి వచ్చి టెస్ట్ క్రికెట్‌లో రికార్డుల వర్షం కురిపిస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత రంజీ ట్రోఫీలో తమిళనాడుపై ఆడిన మ్యాచ్‌లో 8 వికెట్లు, అందులో ఒకే ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. టీమిండియా తరఫున తిరిగి టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన జడేజా, గత రెండున్నరేళ్లలో స్థిరమైన ప్రదర్శన తో అందరి దృష్టిని ఆకర్షించాడు. 24 టెస్ట్ మ్యాచ్‌లలో 1301 పరుగులు, 88 వికెట్లు సాధించాడు. 11 అర్ధ సెంచరీలు, 2 సెంచరీ లతో పాటు రెండుసార్లు ఒకే టెస్ట్‌లో 10 వికెట్లు తీసి అద్భుతం చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో మూడో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా, రెండో అత్యంత విజయవంతమైన బౌలర్‌గా, అత్యధిక అర్ధ సెంచరీలలో రెండో స్థానంలో, ఒక మ్యాచ్‌లో 10 వికెట్లు తీసిన వారిలో అగ్రస్థానంలో నిలిచాడు.**

# నా అంతరాత్మ ఒప్పుకోదు

## పాకిస్థాన్‌తో ఎలా క్రికెట్ ఆడుతాం : అసదుద్దీన్ ఓవైసీ



**న్యూఢిల్లీ:** ఇండియా, పాకిస్థాన్ క్రికెట్‌కు ఎంత క్రేజీ ఉందో తెలిసిన విషయం తెలిసిందే. ఆ రెండు జట్లు తలపడితే ఆ టెన్షనే వేరు. అయితే తాజాగా ఆసియా కప్ షెడ్యూల్ రిలీజ్ అయ్యింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన ఆ రెండు జట్లు దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడితే ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు తన అంతరాత్మ ఒప్పుకోదన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలహీనపడిన విషయం తెలిసిందే. ఇలాంటి సందర్భంలో ఎలా పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతారని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్ విమానాలు మన వైమానిక క్షేత్రంలోకి రావడం లేదని, మన జలాల్లోకి వాళ్ల బోట్లు రావడం లేదని, ఆ దేశంతో వాణిజ్యం జరగడం లేదని, అలాంటప్పుడు పాకిస్థాన్‌తో ఎలా క్రికెట్ ఆడుతారని ఓవైసీ ప్రశ్నించారు. ఆ దేశానికి మనం నీళ్లు ఇవ్వడం లేదని, పాక్‌కు వెళ్లే 80 శాతం నీటిని ఆపేస్తున్నామని, రక్తం.. నీరు ఒకేసారి పారవని అంటున్నామని, అలాంటప్పుడు ఆ దేశంతో ఎలా క్రికెట్ ఆడుతారని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు తన అంతరాత్మ అంగీకరించదన్నారు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి జరిగే ఆసియాకప్‌లో 8 దేశాలు ఆడనున్నాయి.

# హుస్సేన్ సాగర్‌లో యూత్ ఓపెన్ రెగెట్టా ఉత్సాహం




**హైదరాబాద్:** సికింద్రాబాద్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో జరుగుతున్న టిస్కాన్ యూత్ ఓపెన్ రెగెట్టా పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. రెండో రోజు పోటీల్లో ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో ఎన్‌వైఎస్‌సీకి చెందిన మహ్మద్ రిజ్వాన్ అద్భుత ప్రదర్శనతో మొదటి స్థానంలో నిలిచాడు. ఆరు రేసుల్లో 10 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. టీఎస్‌సీ నుంచి బొంగూర్ బన్నీ రెండో స్థానం, ఆర్ఎంవైసీ తరపున పోటీపడిన కృష్ణా వెంకటాచలం మూడో స్థానం పొందారు. బాలికల విభాగంలో సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన శ్రింగేరి రాయ్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఓవరాల్‌గా అగ్రస్థానంలో నిలిచింది. ఐఎల్‌సీయే బాలుర కేటగిరీలో ఎన్‌వైఎస్‌సీకి చెందిన రమాకాంత్ 19 పాయింట్లతో మొదటి స్థానంలో నిలవగా, బాలికల విభాగంలో ఆస్థా పాండే అగ్రస్థానంలో కొనసాగుతోంది. వాతావరణం అనుకూలించకపోవడంతో తొలిరోజు వాయిదా పడిన ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్ కేటగిరీ పోటీలు రెండో రోజు జరిగాయి. 36 మంది యువ సెయిలర్లు పాల్గొనగా, టీఎస్‌సీకి చెందిన యువరాజ్ మొదటి స్థానం సాధించాడు. బాలికల విభాగంలో సీఈఎస్‌సీకి చెందిన సోనియా బ్రార్ తన ప్రతిభను చాటింది.

# బెంగళూరులో దులీప్ ట్రోఫీ

## దేశవాళీ క్రికెట్ సీజన్ ఆరంభం

హైదరాబాద్: దేశవాళీ క్రికెట్ సీజన్ 2025-26 మరో ఇరవై రోజుల్లో బెంగళూరులో దులీప్ ట్రోఫీతో ఘనంగా ప్రారంభం కానుంది. ఆగస్టు చివరి వారంలో జరిగే ఈ టోర్నమెంట్ తర్వాత నాగ్‌పూర్‌లో టీ20 ఫార్మాట్‌లో ఇరానీ కప్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. టీమిండియా యువ స్టార్ తిలక్ వర్మ సౌత్ జోన్ జట్టుకు నాయకత్వం వహిస్తూ తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.

ఇంటర్ జోన్ ఫార్మాట్‌లో జరిగే దులీప్ ట్రోఫీ ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 15 వరకు సాగనుంది. బీసీసీఐ నిర్మించిన కొత్త సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానం ఈ మ్యాచ్‌లకు వేదికగా ఉంటుంది. సౌత్ జోన్, సెంట్రల్ జోన్, వెస్ట్ జోన్, ఉత్తర జోన్, తూర్పు జోన్, ఈశాన్య జోన్ జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. వీటిలో సౌత్, వెస్ట్ జోన్ జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. ఆగస్టు 28న ఉత్తర జోన్‌తో తూర్పు జోన్, ఆగస్టు 31న సెంట్రల్ జోన్‌తో ఈశాన్య జోన్ క్వార్టర్ ఫైనల్‌లో తలపడనున్నాయి. సెప్టెంబర్ 4-7 వరకు సెమీఫైనల్స్, సెప్టెంబర్ 11న ఫైనల్ జరిగి విజేత తేలనుంది.

**కరుణ్ నాయర్ ఆడతాడా?**

దులీప్ ట్రోఫీ తర్వాత నాగ్‌పూర్‌లో ఇరానీ కప్ నిర్వహించనున్నారు. గత సీజన్ రంజీ విజేత విదర్భ, రెస్ట్ ఆఫ్ ఇండియాతో తలపడనుంది. అయితే, గత సీజన్‌లో విదర్భ తరఫున అద్భుతంగా ఆడిన కరుణ్ నాయర్ ఈ టోర్నమెంట్‌లో ఆడతాడా అనేది సందేహంగా ఉంది. ఇటీవల అతడు కర్నాటక జట్టుకు మారినప్పటికీ, సౌత్ జోన్ సెలెక్టర్లు దులీప్ ట్రోఫీ జట్టులో కరుణ్‌ను చేర్చలేదు. దీంతో అతడి పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. యువ పేసర్ రసిక్ దార్ సలాం జమ్ముకశ్మీర్ జట్టును వీడి, బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొంది బరోడా జట్టుకు చేరాడు. అలాగే, ఐపీఎల్ స్టార్ జితేశ్ శర్మ కూడా బరోడా తరఫున ఆడేందుకు సిద్ధమయ్యాడు.



## అద్భుతమైన స్ఫూర్తిని ప్రదర్శించింది

### 64 ఏళ్ల వయస్సులో అరంగేట్రం..

64 ఏళ్ల జోవన్నా చైల్డ్ టీ20ఐ మ్యాచ్‌లో అరంగేట్రం చేసి, క్రికెట్‌లో స్ఫూర్తి మరియు పట్టుదలకు నిదర్శనంగా చరిత్ర సృష్టించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వయసులో అరంగేట్రం చేసిన క్రీడాకారిణిగా నిలిచిన ఆమె, తన ఆటతో కాకుండా అంకితభావంతో అందరి దృష్టిని ఆకర్షించింది. నార్వేతో పోర్చుగల్ ఆడిన టీ20 సిరీస్‌లో పాల్గొన్న జోవన్నా, ఏప్రిల్ 7న అల్బెర్గారియాలో జరిగిన తొలి మ్యాచ్‌లో పోర్చుగల్‌కు ప్రాతినిధ్యం వహించి, ఫాక్లాండ్ దీవులకు చెందిన ఆండ్రూబ్రౌన్లీ, కేమన్ దీవులకు చెందిన మూర్ రికార్డులను అధిగమించింది.

# ప్రజా సంక్షేమమే, ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- మా దృష్టి అభివృద్ధి మీద, కౌశిక్ రెడ్డి దృష్టి చిల్లర రాజకీయాల మీద
- త్వరలో హుజూరాబాద్‌కు ఇంటిగ్రేటెడ్ పాఠశాల
- హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్



**హుజురాబాద్, జులై 29 (జనం సాక్షి) :** హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ మంగళవారం హుజూరాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, కౌశిక్ రెడ్డి చిల్లర రాజకీయాలపై దృష్టి పెడితే, తాము అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, ఐదు పాఠశాలలకు కోటి 13 లక్షలు, నీటి సమస్యకు కోటి రూపాయలు వెచ్చించామని తెలిపారు. ఎస్డిఎఫ్ నిధుల కింద 10 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కుల సంఘాలు, మహిళా భవనాలు, ఆంజనేయస్వామి దేవాలయ ప్రహరీ, 20 లక్షలతో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు పనులు త్వరలో ప్రారంభిస్తామని, త్వరలో హుజూరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తామని పేర్కొన్నారు. గతంలో ఉన్నత పదవులు అనుభవించిన నాయకులు పెండింగ్‌లో ఉన్న పనులపై శ్రద్ధ చూపలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటికి పరిష్కారం కల్పిస్తున్నామని అన్నారు. ఎంజెపి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, మండలాల్లో సొంత భవనాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని, డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచామని, రేషన్ కార్డులు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాలను అమలు చేశామని తెలిపారు. ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికీ చేరుస్తున్నామని, ఉచిత బస్సు ద్వారా మహిళలకు కోటి 30 లక్షల టిక్కెట్లు ఇచ్చి 52 కోట్ల రూపాయలు ఆదా చేశామని, రెండు లక్షల రుణమాఫీ, 9,000 కోట్ల రైతు భరోసా, రైతులకు బోనస్ అందజేశామని, ఈ ఏడాది కూడా ఇస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అప్పులకు నెలకు 5-6 వేల కోట్ల వడ్డీ కడుతూ, పేదలకు నెలకు 4 వేల రూపాయలు ఆదా అయ్యేలా పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.

కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల మెప్పు కోసం చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని, ఉప ఎన్నికల్లో అడ్డగోలు ప్రొసీడింగ్‌లు ఇచ్చి, విప్, ఎమ్మెల్సీగా ఏమీ చేయలేక ఇప్పుడు డిమాండ్లు చేయడం విడ్డూరమని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ సూత్రధా రులని, ఆధారాలతో రుజువైందని, కౌశిక్ రెడ్డి నిరాధార ఆరోపణలతో ముఖ్య మంత్రిపై చిల్లర మాటలు మాట్లాడితే బహిరంగంగా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌ను అధికారంలో ఉన్నప్పుడే ఆడుకున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో దమ్ము చూపించారని, ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు చూపించినది ఫస్ట్ లుక్ మాత్రమేనని, టీజర్, ట్రైలర్, సినిమా బాకీ ఉందని అన్నారు. బీజేపీ ఎంపీ సీఎం రమేష్ బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామనడంతో కేటీఆర్ ఉలిక్కిపడ్డారని, కేటీఆర్ బీజేపీ ఎంపీ ఇంటి కి ఎందుకు వెళ్లారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తుందని తెలిపారు.

# నిరంతర ప్రక్రియగా నూతన రేషన్ కార్డుల జారీ కొనసాగుతోంది

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ
- రేషన్ కార్డుతో పేద కుటుంబాలకు 10 లక్షల కవరేజితో ఆరోగ్యశ్రీ లబ్ది :మేడిపల్లి సత్యం



**బోయిన్ పల్లి, జూలై 29 (జనం సాక్షి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. బోయిన్‌పల్లి మండలంలో 1070 పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు, 1971 రేషన్ కార్డులలో కొత్త సభ్యులను జోడించామని, దాదాపు 6,000 మందికి రేషన్ సౌకర్యం అందనున్నదని పేర్కొన్నారు. రేషన్ కార్డు ప్రజల జీవనంలో కీలక డాక్యుమెంట్‌గా ఉపయోగపడుతుందని, కరెంట్ కనెక్షన్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పథకాల అమలులో దీని ప్రాముఖ్యత ఉందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ఎవరైనా దరఖాస్తు చేస్తే వెంటనే పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రేషన్ కార్డు పేదల జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, గత పదేళ్లలో ఒక్క పేద కుటుంబానికి కూడా రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తున్నామని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. బోయిన్‌పల్లి మండలంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుతో 9 రకాల వస్తువులు ఇచ్చినప్పటికీ, గత పాలకులు వాటిని రద్దు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ తాము తినే సన్న బియ్యాన్ని పేదలకు కూడా రేషన్ ద్వారా సరఫరా చేస్తున్నామని, ఉగాది నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించడంతో రేషన్ కార్డు ప్రాముఖ్యత పెరిగిందని పేర్కొన్నారు. రేషన్ కార్డుతో 10 లక్షల కవరేజితో రాజీవ్ ఆరోగ్యశ్రీ సౌకర్యం అందిస్తున్నామని, 48 గంటల్లో ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 25 లక్షల రైతులకు 2 లక్షల వరకు పంట రుణమాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ళకు 500 రూపాయల బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 40% డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రజిత, బోయిన్‌పల్లి తహసిల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల, సెస్ డైరెక్టర్ సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ

- తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఇంచార్జ్ మంత్రి, స్పీకర్, చీఫ్ విప్‌లతో కలిసి శంకుస్థాపనలు



**పెద్దెముల్ జులై 29(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల అవసరాలను తీర్చేలా ప్రజా పాలన సాగిస్తోందని అన్నారు. మంగళవారం పెద్దెముల్ మండలంలోని కందనెల్లి గ్రామంలోని జిపిఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గుండె చప్పుడును విని, ప్రజల అవసరాలను తీర్చేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు, ఇళ్లు అందించని మునుపటి ప్రభుత్వంతో పోలిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 95 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, అర్హులైన పేదలకు సన్న బియ్యం అందిస్తోందన్నారు. రేషన్ కార్డుల ద్వారా ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని, హామీలను నెరవేర్చుకుంటూ వస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కింద 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లతో కార్యక్రమం చేపట్టామని, బిల్లుల చెల్లింపులో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారంవారీ బిల్లుల చెల్లింపు కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 70 వేల ఉద్యోగాలు, సన్న బియ్యం పంపిణీ, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నాణ్యమైన విద్య కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, ఉన్నత విద్యకు ఆర్థిక సాయం, యువతకు సొంత వ్యాపారాల కోసం రుణాలు, మహిళలకు లక్షల కోట్ల వడ్డీ రహిత రుణాల ద్వారా కోటి మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, వికారాబాద్ జిల్లాలో 1,57,599 వినియోగదారులకు 74 శాతం మందికి ఉచిత విద్యుత్ అందుతోందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచి ప్రజల అవసరాలను తీర్చేలా ఆలోచిస్తున్నారని అన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తాండూరు నియోజకవర్గంలో పారిశ్రామిక వాడ, జిల్లా రోడ్ల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయిస్తోందని, కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.90 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని చెప్పారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు, బైపాస్ రోడ్డు, పారిశ్రామిక వాడ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్, ఆర్‌బీఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ జిల్లా చైర్మన్ సత్తయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల ఎల్లారెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, శోభారాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎండి రియాజ్, డివై నర్సింలు, విద్యాసాగర్ పాల్గొన్నారు.





# మొక్కలు నాటుతూ.. వాటిని సంరక్షించాలి

- తిప్పాపూర్ గోశాలలో వన మహోత్సవం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 29 (జనంసాక్షి) :** వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.మంగళవారం వన మహోత్సవాన్ని వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో నిర్వహించగా,ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు ఈ సందర్భంగా గోశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాను రాను అడవుల విస్తీర్ణం తగ్గుతుండడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, ఆక్సిజన్, పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. గ్రామాల్లో పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో పండ్ల,పూల మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటేటప్పుడు స్తంభాల కింద, గోడల వద్ద పెట్టవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న ఆలయం, నియోజకవర్గం, పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, భారీగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. వేములవాడ ఆలయం, పట్టణ అభివృద్ధి పై సీఎం ప్రత్యేక దృష్టి పెడుతున్నారని,అలాగే తిప్పాపూర్ గోశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు.రాష్ట్రంలో నాలుగు అధునాతన పద్ధతిలో విశాలమైన గోశాలల నిర్మాణానికి సీఎం అధ్యక్షతన కేబినెట్ ఆమోదించిందని ఆయన గుర్తు చేశారు. వేములవాడ ఆలయానికి సంబంధించి కూడా ఆధునాతన వసతులతో గోశాల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని దీనికి సంబంధించి స్థలం కూడా గుర్తించామన్నారు.వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ,ఇతర శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందని,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

**ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ కోసం కృషి :**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.తిప్పాపూర్ గోశాల ఆవరణలో పనులు కొనసాగుతున్నాయని వాటిని విప్ తో కలిసి పరిశీలించామన్నారు.

కోడెలకు పచ్చి గడ్డి సరఫరాలో ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నామన్నారు.వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లిలో 40 ఎకరాలు, నాంపల్లిలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో పచ్చి గడ్డి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెంచేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. మూడు నెలల్లో పచ్చి గడ్డి అందుబాటులోకి వస్తుందని, కోడెలకు అవసరమైన పచ్చిగడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. కాంట్రాక్టర్లపై ఆధారపడే ఇబ్బంది ఉండదని ఈ విషయంలో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు డబ్బులు ఆదా అవుతాయన్నారు.గోశాలలో ఒక్కో సమస్య ప్రణాళిక ప్రకారం పరిష్కరిస్తున్నామని, మొరాదాబాద్ లోని గోశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని గుర్తు చేశారు. తిప్పాపూర్ గోశాల కూడా ఐఎస్ఓ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ రాజన్న ఆలయ ఇంచార్జి ఈవో రాధాబాయి, మున్సిపల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి టీంతో

# టి-సాట్ ప్రత్యేక చర్చా కార్యక్రమం

## టి.సాట్-సాఫ్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : 'తెలంగాణ వ్యవసాయం- రైతు సమస్యలు' అనే అంశంపై బుధవారం టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు నిర్వహించే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు హాజరౌతారని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని టి-సాట్ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు టి-సాట్ నిపుణ ఛానల్ లో ప్రసారమయ్యే లైవ్ కార్యక్రమంలో ఛైర్మన్ తో పాటు సభ్యులు పాల్గొని తెలంగాణలో రైతు సంక్షేమం- కమిషన్ పర్యవేక్షణపై వివరించనున్నారని, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో పాటు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపైనా చర్చించి రైతుల ప్రశ్నలకు సమాధానాలిస్తారన్నారు. తెలంగాణలోని రైతులు, రైతు, వ్యవసాయ కూలీలు తమ తమ సందేహాలకు సమాధానాల కోసం 040-23540326/726 టోల్ ఫ్రీ నెం.1800 425 4039 లకు ఫోన్ చేయాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు. ప్రత్యేక చర్చా కార్యక్రమం టి-సాట్ శాటి లైట్ ఛానళ్లతో పాటు యూట్యూబ్, యాప్ లోనూ ప్రసారమౌతోందని గుర్తుచేశారు.

# విద్యా, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం

## మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 29 (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రమే కాదని, విద్యా, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తుందని తెలంగాణ రాష్ట్రానికి ఎందుకు ఈ వివక్ష రాజ్యాంగంలో దళితులు, గిరిజనలకు జనాభా ప్రాతిపదికనా నిర్దేశినట్లుగా బలహీన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఇంపీరియల్ డాటా ద్వారా రిజర్వేషన్ పొందే వారినీ గుర్తించాలని, సామాజిక వెనకబాటు తనం గురి అవుతున్న వర్గాలను వారీ జనాభాకు అనుగుణగం డెడికేటెడ్ కమిషన్ ద్వారా నిర్ధారించాలని కోర్టు నిర్దేశించిందన్నారు. సామాజిక వెనకబాటుకు గురిఅవుతున్న వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా డెడికేటెడ్ కమిషన్ సామాజిక వెనకబాటు గురవుతున్న వారు 56 శాతం గా పేర్కొనగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు శాసనసభ, శాసన మండలిలో ఆమోదం తెలిపి, గవర్నర్ పరిశీలించి నివేదిక రాష్ట్రపతికి పంపారు. మూడు నెలలు అవుతున్న రాష్ట్రపతి ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదని ఏ బిల్లు అయిన రాష్ట్రపతి మూడు మాసాల్లో నిర్ణయం తీసుకోకుంటే అమలు చేసినట్లే అని సుప్రీమ్ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రిజర్వేషన్లు షెడ్యూల్‌లో 9లో చేర్చబడితే చట్టబద్ధత వస్తుందని రాష్ట్ర శాసన సభ, శాసన మండలిలో బీజేపీ మద్దతు తెలిపి,9 వ షెడ్యూల్ లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదని న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా షెడ్యూల్ 9లో చేర్చాలని ఉండగా, కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత విస్మరించిందన్నారు. రాష్ట్రంలో రిజర్వేషన్ అమలు బిల్లు కు బీజేపీ మద్దతు తెలిపి జాతీయ ఓబీసీ నాయకులు 42 శాతం రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద ఉండగా ఆర్డినెన్సు ఎలా తీసుకు వస్తారంటూ ప్రశ్నిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. కిషన్ రెడ్డి సీనియర్ రాజకీయ నాయకులు, బండి సంజయ్ సీనియర్ నాయకులు రెండు పర్యాయాలు పార్లమెంట్ మెంబర్ కేంద్రంలో మంత్రి రామచంద్ర రావు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మతపరమైన రిజర్వేషన్ సుముఖంగా లేరు అని చెపుతున్నారు. మతపరమైన రిజర్వేషన్ సౌకర్యం కల్పనకు కాంగ్రెస్ సుముఖంగా లేదని కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న రిజర్వేషన్ కేవలం సామాజిక వెనుకబాడుతనానికి గురవుతున్న వారికి మాత్రమే అని హిందువులలో కానీ ముస్లింలలో కానీ సిక్కు కిసాయ్ ఎవరు అయిన సామాజిక వెనుకబడుతనానికి గురవుతున్న వారికి మాత్రమే రిజర్వేషన్ సౌకర్యం కల్పింపచేయడం జరుగుతుందని 42 శాతం రిజర్వేషన్లు 10 శాతం ముస్లింలే పట్టుకపోతారు బిజెపి వారి లెక్కేందో అర్థం కావడం లేదన్నారు. సామాజిక న్యాయం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి, సామాజిక వెనకబాటుకు గురి అవుతున్న వారికి హక్కులు కల్పించాలి అని సంకల్పంతో అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి, రాష్ట్ర ప్రభుత్వం బిల్లు రాష్ట్రపతికి నివేదించింది. బండి సంజయ్ బలహీన వర్గాల నాయకులు ఆయన ముందు ఉండి పోరాటం చేయాలి వారు కూడా కిషన్ రెడ్డి రాంచంద్ర రావు లాగా మాట్లాడితే ఎలా అన్నారు.బలహీన వర్గాల రిజర్వేషన్ కొరకు బండి సంజయ్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 9 షెడ్యూల్ లో చేర్చే విదంగా చొరవ చూపాలి పార్లమెంట్ లో కేంద్ర హెూంశాఖ పై కానీ ప్రధాన మంత్రి పై ఒత్తిడి తేవాలి అన్నారు. 42 శాతం స్థానిక సంస్థల్లోనే కాదు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం అమలు చేస్తామన్నారు.

# కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు వార్తలకు ఖండన

న్యూఢిల్లీ, జూలై29 (జనంసాక్షి) : కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి.

యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మరణించాడు.

దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందుగా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది. దాంతో ఈ నెల 16న నిమిషకు ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు- ప్రకటించారు. నిమిషకు శిక్ష తప్పించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించిన భారత ప్రభుత్వం.. ఇక తాను చేసేదేమీ లేదని చేతులెత్తేసింది. జూలై 16న అమలు చేయాల్సిన మరణశిక్ష చివరి నిమిషంలో వాయిదా పడింది.

# కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను ప్రారంభించండి

- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన బండి సంజయ్
- ప్రజల అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకులన్నీ అధిగమించామన్న గడ్కరీ
- కమిటీ నివేదిక వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ



కరీంనగర్ (జనంసాక్షి) : తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులను విడుదల చేయాలని కోరుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అందులో భాగంగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట-ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి-పోతూర్ రోడ్డు విస్తరణ పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అట్లాగే కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయి. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. గత ఎన్నికలకు ముందే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం కేంద్రం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

# సిఎం రమేశ్ బ్రోకరిజం అందరికీ తెలుసు

- దాడులకు భయపడి బిజెపిలో చేరింది నిజం కాదా
- కెటిఆర్‌ను గతంలో ఎన్నిసార్లు కలిశావో చెప్పు
- కంచెగచ్చిబౌలి భూములపై మధ్యవర్తిత్వం నెరిపావా లేదా
- కెటిఆర్‌పై విమర్శలకు కొప్పుల ఈశ్వర్ ఘాటు స్పందన




హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) : బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని అంటూ ఎంపీ సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు 'ఇయర్ ఆఫ్ ది జోక్' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు.. ఏ పార్టీలో విలీనం కాదన్నారు. సీఎం రమేష్ ఎప్పుడు బీజేపీలో చేరారు అని, బీజేపీలో ఆయనకు ఉన్న పరపతి ఎంత అని ప్రశ్నించారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా? అని తెలంగాణ ప్రజలకు సీఎం రమేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీది తెలంగాణ భావజాలం అని, బీజేపీది ఆర్ఎస్ఎస్ భావజాలం అని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దని కొప్పుల ఈశ్వర్ చెప్పుకొచ్చారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిత్వం వహించి 10 వేల కోట్ల రుణాలు ఇప్పించారన్నారు. దీనికి సీఎం రమేష్ సమాధానం చెప్పకుండా, విలీనం అంశం ఎందుకు మాట్లాడుతున్నారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా తెలంగాణ ప్రజలకు చెప్పాలి. కేటీఆర్ నా ఇంటికి వచ్చి కలిశారని అంటున్న సీఎం రమేష్.. నీ కంపెనీ కోసం, నీ కాంట్రాక్టుల కోసం అధికారంలో వున్నప్పుడు కేటీఆర్ వెంటపడలేదా?. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు ఏ పార్టీలో విలీనం కాదు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ బీజేపీతో పొత్తు పెట్టు- కోలేదు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి పొత్తు ఉండదని కొప్పుల ఈశ్వర్ అన్నారు.రేవంత్ రెడ్డి ఆఫీస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదువుతున్నారు. టీడీపి నుంచి రాజ్యసభ ఎంపీ అయ్యి ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీలో చేరిన సీఎం రమేష్ మాటలకు విలువ ఉందా?. సీఎం రమేష్ చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసు. ఆంధ్రా ఎంపీ సీఎం రమేష్ అక్కడ ఉన్న కుల పంచాయతీలు తెలంగాణకు తీసుకురావాలని చూస్తున్నారు. ఆయన లాంటి వాళ్ళతో తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సీఎం రమేష్ ప్రస్తావన చేసిన కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు కేసీఆర్ సీఎంగా వున్నప్పుడు ఉన్న ప్రాధాన్యత ఇప్పుడు ఉందా?. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల వారు అత్యధికంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీలుగా, పార్టీ పదవుల్లో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని అస్థిరపరచాలని రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదివారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ నాయకత్వానికి అన్ని వర్గాలు మద్దతు తెలిపాయి. 2023లో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయినా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కువ సీట్లు- గెలిచింది. సెటిలర్స్, కమ్మ, రెడ్డి, అన్ని సామాజిక వర్గాల వారు కేసీఆర్, కేటీఆర్ నాయకత్వానికి ఆమోదం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్న సామాజికవర్గాల వారిని కేటీఆర్ ఎట్లా తిడతారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దు' అని కొప్పుల ఈశ్వర్ సూచించారు.

లైంగిక వేధింపుల కేసులో

# కో-పైలట్ అరెస్ట్

## విమానం ల్యాండ్ కాగానే అదుపులోకి తీసుకున్న పోలీసులు



న్యూయార్క్, జూలై29 (జనంసాక్షి) : అమెరికాలో భారతీయ సంతతికి చెందిన ఓ పైలట్ అరెస్ట్ చేశారు. విమానం ల్యాండింగ్ అయిన వెంటనే కాక్ పిట్‌లోకి ఎంటరయిన హోమ్‌ల్యాండ్ ఏజెంట్లు- మరో మాట లేకుండా పైలట్ ను అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికులు ఇంకా దిగకుండానే వారిని తోసుకుంటూ వెళ్లిను ఏజెంట్లు- బ్యాడ్జీలు, గన్స్ తో విమానంలోకి ప్రవేశించి కో పైలట్ ను బంధించారు. అసలు పైలట్ ను ఎందుకు అరెస్ట్ చేశారో పూర్తి వివరాల్లోకి వెళితే.. భారతీయ సంతతికి చెందిన డెల్టా ఎయిర్‌లైన్స్ కో-పైలట్ భగవాగర్‌ను శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అరెస్టు చేశారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఏజెంట్లు-, అధికారులు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. జూలై 27 ఆదివారం నాడు మిన్నియాపాలిస్ నుంచి వచ్చిన డెల్టా ఫ్లైట్ 2809 (బోయింగ్ 757-300) ల్యాండ్ అయిన పది నిమిషాల తర్వాత ఈ అరెస్ట్ జరిగింది. ప్రయాణికులు ఇంకా విమానం దిగకముందే, ఏజెంట్లు- వారిని పక్కకు తోసుకుంటూ బ్యాడ్జ్‌లు, తుపాకులతో కాక్‌పిట్‌లోకి వెళ్లి భగవాగర్‌ను బంధించారు. కాంట్రా కోస్టా షెరీఫ్ కార్యాలయం ఫేస్‌బుక్ పోస్ట్ ప్రకారం..ఒక చిన్నారిపై లైంగిక నేరాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు తర్వాత డిటె-క్టివ్‌లు ఏప్రిల్ నుండి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో భగవాగర్ నిందితుడిగా గుర్తించడంతో అతనిపై అరెస్ట్ వారెంట్ జారీ చేయబడింది. ఏప్రిల్‌లో 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లవాడితో ఐదుసార్లు నోటి ద్వారా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు భగవాగర్‌పై ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం భగవాగర్ మార్టినెజ్ డిటెన్షన్ ఫెసిలిటీ జైలులో ఉన్నారు. పైలట్ భగవాగర్ అరెస్ట్‌పై డెల్టా ఎయిర్‌లైన్స్ తీవ్రంగా స్పందించింది.

# ఏనుగుల సంచారంపై నిరంతర పర్యవేక్షణ

## అటవీ అధికారులకు డిప్యూటి సిఎం పవన్ ఆదేశం

## వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచన




అమరావతి, జూలై 29 (జనంసాక్షి) : తిరుపతి జిల్లాల్లో ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్న క్రమంలో అటవీశాఖ సిబ్బంది గ్రామాలలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. సోమవారం ఉదయం అటవీ శాఖ ఉన్నతాధి కారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ ద్వారా ఏనుగుల గుంపుల సంచారం, పంట పొలాలను ధ్వంసం చేయడం, ఏనుగుల దాడిలో ఇటీవల ఒక రైతు దుర్మరణంపై సమీక్షించారు. సోమవారం ఉదయం చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఏనుగుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనపై అధికారులు వివరాలు అందించారు. 11 ఏనుగులు ఒక గుంపుగా తిరుగుతూ కళ్యాణి డ్యామ్ సమీపంలోని సత్యసాయి ఎస్టీ కాలనీ దగ్గర పొలాలు, తోటలు తొక్కివేశాయని వివరించారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు- వివరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఏనుగులు ఎటు-వైపు వెళ్తున్నాయి అనేది పరిశీలించడానికి డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న క్రమంలో... అవి వెళ్ళే అవకాశం ఉన్న మార్గాల్లోని గ్రామాలవారిని అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. గ్రామాలవారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు- చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని ఆదేశించారు. ఏనుగుల కదలికలు, హెచ్చరిక సందేశాలు పంపించడాన్ని డి.ఎఫ్.ఓ. కార్యాలయాలు, పి.సి.సి.ఎఫ్. కార్యాలయం పర్యవేక్షించాలన్నారు. వీటితోపాటు- ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం అర్ధరాత్రి తిరుపతి శ్రీవారి మెట్టు- మార్గంలో ఏనుగులు సంచరించిన విషయం తెలిసిందే. పంప్ హౌస్ వద్ద 11 ఏనుగులు సమీపంలోని పంట పొలాలను ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు పవన్ కళ్యాణ్ సూచించారు. గ్రామస్థులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు- చేసి ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అటవీ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

# అరుణాచల్‌లో ఆక్రమణలు అబద్ధం

## 1962 నుంచి యధాతథ స్థితి: కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ, జూలై29 (జనంసాక్షి) : భారత భూభాగంలోకి చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. 1962 నుంచి ఇదే పరిస్థితి అని మంగళవారం లోక్‌సభకు వెల్లడించారు. రికార్డులను సరిచేయడం ఎంతోముఖ్యమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తన సొంతరాష్ట్రంలోకి చైనా ప్రవేశించి, ఆక్రమణలకు పాల్పడిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ముఖ్యమని నేను భావించాను. అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ప్రాంతం 1962 యుద్ధానికి ముందు లేదా ఆ సమయంలో ఆక్రమించారు. ఆ తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తలేదు' అని వెల్లడించారు. వాస్తవాధీన రే(ఎల్ఏసీ) వెంబడి భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల పేర్లను మార్చడానికి డ్రాగన్ యత్నించింది. దానిని పలుమార్లు భారత్ తిరస్కరించింది కూడా. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని.. అది విడదీయరాని భాగమని.. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇక గత ఏడాది ఈ ఆసియా దేశాల మధ్య గస్తీ దోస్తీ కుదిరింది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాలు.. ఆ ఒప్పందం తర్వాత కాస్త మెరుగయ్యాయి.

# తెలుగు ఫిలిం చాంబర్‌లో తెలంగాణ సెగ



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలుగు ఫిలిం చాంబర్‌లో తెలంగాణ సెగ రాజుకుంది. చాంబర్‌లో తెలంగాణకు చెందిన సినీ కళాకారులకు ప్రాధాన్యత లేకపోవడాన్ని ఖండిస్తూ తెలంగాణ ఉద్యమకారులు నిరసన వ్యక్తం చేశారు. చాంబర్‌లోకి చొచ్చుకొని వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ ఉద్యమకారులను అడ్డుకొని వారిని చాంబర్ నుంచి బయటకు నెట్టివేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి నేతృత్వంలో పలువురు ఉద్యమకారులు ఆంధ్రా గోబ్యాక్.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. చాంబర్ గోడలపై ఉన్న ఫొటోల విషయంలో స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ సినీ లెజండ్ పైడి జయరాజ్ ఫొటో చిన్నగా ఉండడంతో పాటు ఓ హీరోయిన్ కింద ప్రాధాన్యత లేకుండా ఏర్పాటు చేయడాన్ని తప్పుపట్టారు. ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సి. నారాయణరెడ్డి ఫొటో లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాగ్వాదం పెరిగి తోపులాటలు షురువై పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. పాశం యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ కళాకారులు, రచయితలను కించపరిచే విధంగా తెలుగు ఫిలించాంబర్ వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే తప్పును సరిదిద్దుకోకుండా ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370